# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి





శనివారం 24•8•2019 | కరీంనగర్ | • వెల. రూ.6.50 • సంపుటి 9 • సంచిక 60 • పేజీలు: 14 + 16

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD


## హైకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

కొలీజియం సిఫారసులకు రాష్ట్రపతి ఆమోదం.. కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు

కొత్త న్యాయమూర్తుల ప్రమాణం త్వరలో

హైకోర్టులో 14కు చేరిన న్యాయమూర్తుల సంఖ్య

2



తడకమళ్ల వినోద్‌కుమార్



అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి



కూనూరు లక్ష్మణ్

# శరవేగంగా పాలమూరు

- కాళేశ్వరమంత వేగంగా పూర్తిచేయాలి
- మూడు షిఫ్టుల్లో పనులు కొనసాగాలి
- వచ్చే వానకాలంలో పొలాలకు నీళ్లివ్వాలి
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తిచేసి, వచ్చే వర్షాకాలంలో పంటపొలాలకు నీరందించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులపై సీఎం కేసీఆర్ శుక్రవారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయడంద్వారా పాలమూరు జిల్లాలోని సగం వ్యవసాయ భూములకు సాగునీరు అందుతున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. మిగతా సగానికి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంద్వారా నీరివ్వాలని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే రేయింబవళ్లు, మూడుషిఫ్టుల్లో పనిచేసి ప్రాజెక్టును పూర్తిచేయాలని ఆదేశించారు. పాలమూరు ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం కొనసాగుతున్న, భవిష్యత్తులో జరుగాల్సిన పనులపై ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లు, కాల్వల పనులను సమాంతరంగా చేపట్టాలని చెప్పారు. సీనియర్ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రపర్యటన జరిపి, పనుల్లో వేగం పెంచాలని కోరారు. సమావేశంలో నీటిపారుదల ఈఎన్సీ మురళీధర్‌రావు, సీఈ రమేశ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కరంటు కనిపిస్తలేదా?



శుక్రవారం విద్యుత్‌సౌధలో మీడియా సమావేశంలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు. చిత్రంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు ఉన్నారు

- నాడు 7778 మెగావాట్ల స్థాపిత శక్తి
- నేడు 16,203 మెగవాట్లకు చేరిక
- సక్రమంగానే విద్యుత్ కొనుగోళ్లు
- సీబీఐ విచారణకు సైతం సిద్ధం
- బీజేపీ లక్ష్మణ్‌వి నిరాధార ఆరోపణలు
- విద్యుత్ సంస్థల నిర్ణయాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిళ్లు లేవు
- ప్రభుత్వ ప్రోత్సాహం చారిత్రాత్మకం
- సీఎం కేసీఆర్ లక్ష్యం మేరకు 24 గంటల నిరంతర కరంట్ సరఫరా
- ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర విద్యుత్ సంస్థల పనితీరుపై దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తుంటే.. అవగాహనలేని కొందరు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలన్నీ పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా జరిగాయని స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణ బాధ్యతలు ప్రభుత్వ సంస్థలకు ఇవ్వడంవల్లే పారదర్శకత సాధ్యమైందన్నారు. విద్యుత్‌సంస్థల పనితీరుపై అనుమానాలుంటే సీబీఐ విచారణకు సైతం సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. విద్యుత్ సంస్థలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కే లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్‌సౌధలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎండీ వివరణ ఇచ్చారు. లక్ష్మణ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. భయానక విద్యుత్ కోతల నుంచి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా దిశగా విద్యుత్ సంస్థల ప్రస్థానంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహక చర్యలు చారిత్రాత్మకమని సీఎండీ చెప్పారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఒక్క మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తి కాలేదని పలువురు మాట్లాడటం ఆశ్చర్యానికి గురిచేస్తున్నదన్నారు. రాష్ట్రం

మిగతా 2వ పేజీలో



శుక్రవారం రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్ వద్ద ఉప్పొంగుతున్న జలాలు

# బాహుబలి గర్జన

రోజుకో టీఎంసీ ఎత్తిపోస్తున్న మూడు మోటర్లు

- పరవళ్లు తొక్కుతున్న కాళేశ్వర గంగ
- నిండుతున్న శ్రీరాజరాజేశ్వర జలాశయం
- చరిత్రలోనే తొలిసారి 9 టీఎంసీలకు నీటినిల్వ

3

# దిద్దుబాటలో..

ఆర్థిక రంగానికి బూస్ట్



- ఎఫ్‌పీఐ, దేశీయ మదుపరులపై సర్చార్జి ఎత్తివేత
- పీఎస్‌బీలకు రూ.70 వేల కోట్ల అదనపు నిధులు
- మార్చి 31నాటికి బీఎస్-4 వాహన విక్రయ అనుమతి
- నెలరోజుల్లో ఎంఎస్‌ఎంఈలకు జీఎస్టీ రిఫండ్ల చెల్లింపులు
- అక్టోబర్ 1 నుంచి కేంద్రీకృత విధానం ద్వారా ఐటీ నోటీసులు
- ప్రత్యేక సందర్భాల్లో స్టార్టప్‌లకు ఆదాయం పన్ను మినహాయింపు
- సంస్కరణలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం
- మీడియా సమావేశంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

9

## కార్మికులకు కనీసవేతనం



- అమల్లోకి రానున్న వేతనాల కోడ్- 2019 బిల్లు
- 50 కోట్ల మందికి లబ్ధి
- ఇకపై మహిళలు, పురుషుల వేతనాల్లో వ్యత్యాసం ఉండదు

III

- హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ సంస్థ

## నానక్‌రాంగూడలో వన్‌ప్లస్ ఆర్ అండ్ డీ సెంటర్

- ఎల్లుండి ప్రారంభించనున్న సంస్థ వ్యవస్థాపకుడు పీట్ ల్యూ
- ప్రపంచంలోనే అతిపెద్ద కేంద్రంగా తీర్చిదిద్దాలని యోచన

2



## చిదంబరానికి ఊరట

- ఈడీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరుచేసిన సుప్రీంకోర్టు
- సోమవారం వరకు అరెస్ట్ చేయొద్దన్న ధర్మాసనం
- సీబీఐ కస్టడీ అంశంలో జోక్యం చేసుకోని కోర్టు
- రేపటివరకూ సీబీఐ కస్టడీలోనే చిదంబరం

5

## తమిళనాట ఉగ్ర కలకలం

- శ్రీలంక నుంచి భారత్‌లోకి చొరబడిన ఆరుగురు ఉగ్రవాదులు
- హెచ్చరించిన ఆర్మీ నిఘా వర్గాలు
- నుదుటిపై తిలకం పెట్టుకొని హిందువుల్లాగా ప్రవేశం
- ఉగ్రవాదుల్లో ఒకరు పాకిస్థానీ, ఐదుగురు శ్రీలంక తమిళ ముస్లింలు
- కోయంబత్తూర్‌తో పాటు తమిళనాడు, కేరళ లో హైఅలర్ట్

III

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 70.00 | రిటైల్ లైవ్ | 92.00 |
| డ్రెస్డ్ | 133.00 | స్కిన్‌లెస్ | 152.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 310.00 | రంగారెడ్డి | 310.00 |
| మెదక్ | 310.00 | కరీంనగర్ | 313.00 |
| వరంగల్ | 313.00 | చిల్లర ధర | 3.70 |

# కారణం లేకపోయినా కొర్రీలు

ధర్మగంట

- కాస్తులో ఉన్నా రికార్డులోకి ఎక్కని 9.29 ఎకరాలు
- వారసత్వ భూమికి ఆధారాలు చూపినా పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది
- కోర్టులో ఉన్నదంటూ దాటవేస్తున్న అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి బాధితులు కల్లూరి మల్లేశ్, చంద్రమౌళి

6

**అది** తాతల నుంచి వారసత్వంగా వచ్చిన 9.29 ఎకరాల భూమి. 65 ఏండ్లుగా అన్నదమ్ములిద్దరూ కాస్తులో ఉండి సాగుచేసుకొంటున్నారు. తండ్రి చనిపోయిన తర్వాత ఆ భూమిని తమ పేరిట చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా తమ పేరిట పట్టాచేయాలని దరఖాస్తు చేసుకొన్నారు. ప్రొవిజినల్ ఖాతాతోపాటు తామే భూమి యజమానులమని చెప్పేందుకు అన్ని ఆధారాలు చూపించారు. అయినా, సర్వే నంబర్ తప్పుగా ఉన్నదనే సాకు చూపి రెవెన్యూ అధికారులు రికార్డుల్లోకి ఎక్కించకుండా కాలయాపన చేస్తున్నారు. తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ.. గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించినా సమస్యకు పరిష్కారం లభించడంలేదు. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి నర్కొండకర్‌నగర్‌కు చెందిన బాధితులు కల్లూరి మల్లేశ్, కల్లూరి చంద్రమౌళి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.



శుక్రవారం కురిసిన భారీ వర్షానికి కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కాటేపల్లి ఒర్రెవాగు

## రెండు జిల్లాల్లో భారీ వర్షాలు

- పలు జిల్లాల్లో ఓ మోస్తరు.. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పొంగుతున్న వాగులు
- సమీప గ్రామాలకు నిలిచిన రాకపోకలు.. సింగరేణి ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్
- అత్యధికంగా బెజ్జూర్‌లో 8.22 సెం.మీటర్లు నమోదు

7




## గవర్నర్, సీఎం కేసీఆర్ కృష్ణాష్టమి శుభాకాంక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణుడు భగవద్గీతలో కుల, మత, వర్ణ వివక్ష లేకుండా సోదరభావంతో మెలగాలని, శాంతియుత వాతావరణంలో జీవనం సాగించాలని సందేశమిచ్చారని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిగా ప్రజలు కలిసి మెలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు శుక్రవారం ట్విట్టర్ ద్వారా కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.





## ● గుర్తుకొస్తున్నాయి..



టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు తన పాత జ్ఞాపకాలను నెమరేసుకొన్నారు. 1999లో తన స్నేహితుడు వోదెల మహేశ్‌తో కలిసి ఉన్న ఫొటోను ట్విట్టర్‌లో షేర్ చేశారు.



## డయల్ -100కు స్మార్ట్ పోలీసింగ్ అవార్డు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ పోలీసులు అమలుచేస్తున్న డయల్-100ని ఫిక్కీ స్పెషల్ జ్యూరీ అవార్డ్ వరించింది. ఎమర్జెన్సీ రెస్పాన్స్ క్యాటగిరీ కింద వచ్చిన స్మార్ట్ పోలీసింగ్ పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ తరఫున అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (టెక్నికల్ సర్వీస్) రవిగుప్తా శుక్రవారం ఢిల్లీలో కేంద్ర సహాయమంత్రి జితేంద్రసింగ్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. డయల్-100 అధికారులకు, సాంకేతిక బృందానికి, పెట్రోలింగ్ కార్ప్స్, బ్లూకోల్ట్స్ అధికారులను అభినందించారు. అత్యవసర సమయంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. దేశ ప్రజల రక్షణ, భద్రత విషయంలో పలు రాష్ట్రాలు అమలుచేస్తున్న స్మార్ట్ పోలీసింగ్ విధానాలను ప్రోత్సహించేందుకు ఫిక్కీ ఈ అవార్డులను నెలకొల్పింది.





తన పదవీకాలం పొడిగించినందుకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే మనోహర్

## నిమ్స్ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

- వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ ఖైరతాబాద్:** నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) డైరెక్టర్ కే మనోహర్ పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. నిమ్స్ డైరెక్టర్‌గా మనోహర్ 2015లో బాధ్యతలు చేపట్టగా, ఈ నెల 26తో ఆయన పదవీకాలం ముగియనుంది. పొడిగింపు నిర్ణయంతో తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆయనే నిమ్స్ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. పదవీకాలం పొడిగింపుపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ సత్యగౌడ్, నిమ్స్ తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంచికట్ల రాజ్‌కుమార్, శరత్, గోపాల్‌రెడ్డి తదితరులు డైరెక్టర్ మనోహర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# హైకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

- కొలీజియం సిఫారసులకు రాష్ట్రపతి ఆమోదం
- ఉత్తర్వులు జారీచేసిన కేంద్రం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ హైకోర్టుకు నూతనంగా ముగ్గురు న్యాయమూర్తులను నియమించే ప్రతిపాదనకు రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ ఆమోదముద్ర వేశారు. ఆ మేరకు కేంద్ర న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి రాజిందర్ కశ్యప్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని కొలీజియం తెలంగాణ హైకోర్టుకు చెందిన న్యాయవాదులు తడకమళ్ల వినోద్‌కుమార్, అన్నిరెడ్డి అభిషేక్‌రెడ్డి, కూనూరు లక్ష్మణ్‌లను న్యాయమూర్తులుగా నియమించాలని ఇటీవల రాష్ట్రపతికి సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసులను రాష్ట్రపతి యథాతథంగా ఆమోదించారు. నూతనంగా నియమితులైన వీరు త్వరలో ప్రమాణం స్వీకరించనున్నారు. కొత్తగా నియమితులైన ముగ్గురు శుక్రవారం సాయంత్రం చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు.

### 14కు చేరిన న్యాయమూర్తుల సంఖ్య..

తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 24గా అప్పట్లో నిర్ధారించారు. జనవరి 1న 13 మంది ప్రమాణం స్వీకరించారు. ఇందులో ఒకరు రిటైర్‌కాగా మరో ఇద్దరు బదిలీపై వెళ్లారు. దీంతో వీరి సంఖ్య పదికి తగ్గింది. తర్వాత జస్టిస్ గండికోట శ్రీదేవి చేరికతో ఈ సంఖ్య 11కు పెరిగింది. ప్రస్తుతం మరో ముగ్గురి నియామకంతో 14కు చేరింది. హైకోర్టులో ఇంకా పదిమంది న్యాయమూర్తులను భర్తీచేయాల్సి ఉన్నది. మరోవైపు మొత్తం న్యాయమూర్తుల సంఖ్యను 42కు పెంచాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారు.

### ట్యాక్స్ అంశాల్లో అనుభవశాలి వినోద్‌కుమార్

**తడకమళ్ల** వినోద్‌కుమార్ 1964లో నల్లగొండ జిల్లా దాచారంలో జన్మించారు. హైదరాబాద్ ఎంబీ హైస్కూల్‌లో పాఠశాల విద్య, ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తిచేశారు. వీవీ కాలేజీలో డిగ్రీ, ఓయూ నుంచి ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశారు. 1988లో అడ్వకేట్‌గా ఎన్‌రోల్ అయి.. 1993 నుంచి ప్రాక్టీస్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌కంట్యాక్స్, తెలంగాణ రాష్ట్ర కమర్షియల్ ట్యాక్స్ స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేస్తున్నారు.

### విద్యారంగ అంశాల్లో అభిషేక్‌రెడ్డికి అనుభవం

**అన్నిరెడ్డి** అభిషేక్‌రెడ్డి విద్యారంగం, సర్వీస్ తదితర అంశాల్లో విశేష అనుభవం గడించారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఆయన.. తండ్రి పుల్లారెడ్డి వద్దే వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. హైదర్‌గూడ సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో పదో తరగతి, ఉప్పల్ లిటిల్‌ఫ్లవర్‌లో ఇంటర్ చదివిన అభిషేక్.. నిజాం కళాశాలలో డిగ్రీ, ఓయూ నుంచి ఎల్‌ఎల్‌బీ చేశారు. వాషింగ్టన్ డీసీలోని అమెరికన్ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌ఎం పూర్తిచేశారు. 1990లో హైకోర్టు న్యాయవాదిగా ఎన్‌రోల్ అయిన ఆయన.. 2004-07 వరకు పీపీగా, 2007-09 వరకు ఉన్నతవిద్యాశాఖ ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. ప్రస్తుతం ఉన్నత విద్యామండలి, జేఎన్టీయూ స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేస్తున్నారు.

### లేబర్, కోఆపరేటివ్, సర్వీస్ అంశాల్లో దిట్ట లక్ష్మణ్

**కేంద్రం** తరఫున హైకోర్టులో అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా కొనసాగుతున్న కూనూరు లక్ష్మణ్.. లేబర్, సర్వీస్, కోఆపరేటివ్, కార్పొరేట్ చట్టాల్లో దిట్టగా గుర్తింపుపొందారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం భోగారం గ్రామానికి చెందిన గోపాల్, సత్యమ్మ దంపతులకు 1966 సంవత్సరంలో ఆయన జన్మించారు. రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివారు. హైదరాబాద్ న్యూసైన్స్ కళాశాలలో డిగ్రీ చదివి.. ఎస్వీ నుంచి ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశారు. న్యాయవాది మాదిరాజు రాధాకృష్ణ వద్ద జూనియర్ న్యాయవాదిగా వృత్తిజీవితాన్ని ప్రారంభించారు. 1993లో ఎన్‌రోల్ అయిన లక్ష్మణ్.. 1999 నుంచి ఇండిపెండెంట్ అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. దాదాపు 70 సంస్థలు, కార్పొరేట్ కంపెనీలకు స్టాండింగ్ కౌన్సెల్‌గా సేవలు అందించారు. 2017 నుంచి అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్‌గా కొనసాగుతున్నారు.

## రవాణాశాఖలో పదోన్నతులు

- ఆర్టీవోలుగా పదిమంది ఎంవీఐలు, నలుగురు ఏవోలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రవాణాశాఖలో తొలిసారిగా క్యాడర్ స్ట్రెంత్ ఆధారంగా పదోన్నతులు కల్పించారు. 141 మంది ఎంవీఐలు, 46 మంది ఏవోలు ఉండగా.. సంఖ్యను అనుసరించి శాతాన్ని ఖరారుచేసి పదోన్నతులు ఇచ్చారు. మొత్తం 14 మందికి పదోన్నతి లభించగా.. ఇందులో పదిమంది ఎంవీఐలు, నలుగురు ఏవోలు న్నారు. పదోన్నతులు ఇవ్వడంతో సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డిలకు ఎంవీఐ అసోసియేషన్ అధ్యక్షుడు పాపారావు కృతజ్ఞతలు తెలిపారు. పదోన్నతుల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని, దీనిపై సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం సాహసోపేత నిర్ణయమని అన్నారు. ఆర్టీవోలుగా పదోన్నతులు పొందిన అధికారుల్లో ఎంవీఐల నుంచి పీ రవీందర్, ఎం కిషన్, పీ రవీంద్రకుమార్, సీపీ వెంకటేశ్వర్‌రావు, జీ సురేశ్‌రెడ్డి, రఘునందన్‌గౌడ్, రాంచందర్, డీవీ రెడ్డి, సుభాష్‌చంద్రరెడ్డి, వీ శ్రీనివాస్‌రెడ్డి ఉండగా.. ఏవో నుంచి ఆర్టీవోలుగా పదోన్నతి పొందినవారిలో సదానందం, మహబూబ్ హుస్సేన్, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి ఉన్నారు.

## హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ సంస్థ

- నానక్‌రాంగూడలో 'వన్‌ప్లస్' ఆర్‌అండ్‌డీ సెంటర్
- ఎల్లుండి ప్రారంభించనున్న సంస్థ వ్యవస్థాపకుడు పీట్ ల్యూ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ తన పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) కార్యక్రమాలను ప్రారంభించనున్నది. ఐటీ, అనుబంధ రంగాల్లో ఇప్పటికే దిగ్గజ సంస్థల ముఖ్య కార్యాలయాలకు కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లో ప్రపంచ ప్రఖ్యాత మొబైల్ కంపెనీ 'వన్‌ప్లస్' తన ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. నానక్‌రాంగూడలో ఏర్పాటైన ఈ కార్యాలయం ఆ సంస్థ వ్యవస్థాపకుడు పీట్‌ల్యూ, 'వన్‌ప్లస్' ఇండియా జనరల్ మేనేజర్ వికాస్‌అగర్వాల్, రాష్ట్ర ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సోమవారం ప్రారంభం కానున్నది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన 'వన్ ప్లస్' తమ జాతీయ, అంతర్జాతీయ అవసరాలను తీర్చగలిగే ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని భారత్‌లో ఏర్పాటుచేయాలని ఈ ఏడాది ప్రథమార్ధంలోనే నిర్ణయించింది. ఇందుకోసం ఆ సంస్థ.. స్టార్టప్ కల్చర్‌కు, సాంకేతిక విజ్ఞానానికి సుపరిచిత చిరునామాగా ఉన్న హైదరాబాద్‌ను ఎంచుకున్నది. మూడేండ్ల కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్‌అండ్‌డీ కేంద్రంగా 15 అంతస్తుల భవనంలో దీన్ని తీర్చిదిద్దాలని 'వన్‌ప్లస్' భావిస్తున్నది. ఈ కేంద్రం 'మేకిన్ ఇండియా' ఆకాంక్షలను నెరవేర్చడమే కాకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో కీలకపాత్ర పోషిస్తుందని 'వన్ ప్లస్ పేర్కొంది. ఐఐటీల్లోని విద్యార్థుల ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించేలా 'వన్‌ప్లస్' కృషిచేస్తున్నట్టు సమాచారం. ఈ ఏడాది మేలో వన్‌ప్లస్-7 స్మార్ట్‌ఫోన్ ఆవిష్కరణ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు పీట్‌ల్యూ ఈ ఆర్‌అండ్‌డీ సెంటర్ గురించి ప్రకటిస్తూ.. హైదరాబాద్ తమకు అత్యున్నతమైన కేంద్రమని తెలిపారు.

# తెలంగాణ ఐటీ మేటి

ఒక వ్యక్తి ఒకే ఓటరు కార్డుకు మీ సేవ పరిష్కారం

- ఆధార్‌తో అనుసంధానం అవసరం లేకుండానే నకిలీకి చెక్
- ఎలక్షన్ కమిషన్ వినియోగించుకుంటే ఎన్నెన్నో ప్రయోజనాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సాంకేతిక వినియోగంలో తనదైన ముద్ర వేసుకొన్న తెలంగాణ ప్రభుత్వం.. నకిలీ ఓటర్ గుర్తింపు కార్డులను అరికట్టి ఒకవ్యక్తి- ఒకే ఓటరు గుర్తింపుకార్డు విధానానికి సమగ్ర పరిష్కారం చూపేందుకు సిద్ధమైంది. ఒకే పౌరుడు- ఒకే ఓటరు కార్డు నినాదాన్ని అమలుచేయడంలో భాగంగా ఆధార్ అనుసంధానంతో ఎదురయ్యే సాంకేతిక, న్యాయసంబంధమైన చిక్కుల్లేకుండా పరిష్కారం కనుగొన్నది. ఒకే పౌరుడు- ఒకే ఓటరు గుర్తింపు కార్డు విధానంలో భాగంగా ఓటరు గుర్తింపుకార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఇటీవల కేంద్రం న్యాయశాఖకు లేఖ రాసిన సంగతి తెలిసిందే. 2015లో కేంద్రం ఇదే ప్రయత్నం చేయగా పలువురు అభ్యంతరం చెప్పడంతో సుప్రీంకోర్టు నో చెప్పింది. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుందనే చర్చ జరుగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న పెన్షనర్ లైఫ్ సర్టిఫికెట్ల విధానంలో ఉపయోగిస్తున్న టెక్నాలజీతో నకిలీ ఓటరుకార్డుల సమస్యను తొలగించుకోవచ్చునని రాష్ట్ర ఐటీశాఖ విభాగం కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు వివరించారు. నియమిత దరఖాస్తు ఫారం నింపి అందజేస్తే.. తమ వద్ద ఉన్న పరిమిత డాటాను సరిపోల్చి ఈసీ ఓటరు గుర్తింపుకార్డును జారీచేస్తుంది. ఇందులో మానవ ప్రమేయమే అధికంగా ఉంటున్నది. దీంతో పేరు, తండ్రిపేరు, చిరునామా, ఫొటోవంటి స్వల్పమార్పులతోనే ఒకేవ్యక్తి అనేక గుర్తింపు కార్డులను పొందగలుగుతున్నారు. ఇలాంటి నకిలీలకు చెక్‌పెట్టేలా తెలంగాణ ఐటీశాఖ సమర్థవంతమైన విధానాన్ని సిద్ధంచేసింది. ఫొటో వెరిఫై విధానంలో ఓటరు డాటాను సమగ్రంగా అధ్యయనం చేసేలా రూపొందించింది.

### డిజిటల్ ఫొటో వెరిఫై ఇలా పనిచేస్తుంది..

మూడుదశల ఆమోదం తర్వాతే కార్డు మంజూరు విధానాన్ని తెలంగాణ ఐటీశాఖ రూపొందించింది. ఆర్టిఫిషియల్ లెర్నింగ్, బిగ్‌డాటా, మెషిన్ లెర్నింగ్ ఉపయోగించి లైవ్‌నెస్, డెమోగ్రఫిక్స్ ఆధారంగా ఓటరు గుర్తింపు కార్డును మంజూరు చేస్తారు. ఇందుకోసం ఓటరుకార్డు పొందేవ్యక్తి తన లైవ్‌ఫొటోను అందించాల్సి ఉంటుంది. ఈ ఫొటోను డెమోగ్రఫిక్ మ్యాచింగ్‌తో సరిపోల్చుతారు. దరఖాస్తుదారుల 15 ఏండ్ల కిందటి ఫొటోను కూడా ప్రస్తుత ఫొటోతో సరిపోల్చుతుంది. దేశంలో ఎక్కడైనా ఇప్పటికే సదరు వ్యక్తికి ఓటరుకార్డు ఉన్నదా అనేది పరిశీలిస్తుంది. ఒకవేళ కార్డు ఉంటే దాని వివరాలను పేర్కొంటూ.. దరఖాస్తును తిరస్కరిస్తుంది. ఈ విధానంలో అనుమతి లేకుండా కార్డు తొలిగింపు కూడా సాధ్యం కాదు.

### నకిలీ ఓట్లకు అవకాశం లేదు

**ప్రస్తుతం** ఏదైనా గుర్తింపు కార్డు చూపించి జాబితాలో పేరు పరీక్షించుకొని ఓటువేయాల్సి ఉంటుంది. తెలంగాణ ఐటీ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ విధానంతో ఈ ప్రహసనం అవసరం లేదు. కేవలం సెల్ఫీతో ఓటరుకు ఆ బూత్‌లో ఓటు ఉందా? లేదా? అనే విషయం స్పష్టమవుతుంది. సెల్ఫీ ఇచ్చిన అనంతరం పచ్చ టిక్ వస్తేనే ఓటు వేయవచ్చు లేదంటే అనుమతి దక్కదు.

### కచ్చితత్వం, లోపరహితం

ఈ విధానంతో న్ని ఈసీ ఉపయోగిస్తే లక్షలాదిగా ఉన్న నకిలీఓట్లకు చెక్ పెట్టవచ్చు. నకిలీ ఓట్లను తొలగించడంలో అధునిక సాంకేతిక విధానం ద్వారా ఖచ్చితత్వం, లోపరహితంగా ఓటరు గుర్తింపుకార్డుల నమోదు, మార్పులు చేర్పులు జరుగుతాయి. నకిలీ ఓట్లు పొందే అవకాశం వందశాతం తగ్గిపోతుంది. మానవ ప్రమేయం తగ్గిపోవడంతో ఖర్చుసైతం తగ్గుతుంది. ప్రక్రియ సమయం సైతం తగ్గుతుంది.

**- మీసేవ కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు**

### ముహూర్తం

**సూర్యోదయం:** 6.04 గంటలకు

**సూర్యాస్తమయం:** 6.32 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, అష్టమి ఉదయం 8.34 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: రోహిణి, అమృతఘడియలు: మధ్యాహ్నం 2.00 నుంచి 3.36 వరకు, రాహుకాలం: ఉదయం 9.11 నుంచి 10.45 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.04 నుంచి 7.44 వరకు, వర్జ్యం: రాత్రి 8.07 నుంచి 9.43 వరకు.

# సంగారెడ్డి జిల్లాకు పోషణ్ అభియాన్ అవార్డు

- జాతీయస్థాయిలో ఉత్తమ జిల్లాగా ఎంపిక
- కేంద్ర మంత్రుల నుంచి అవార్డు అందుకొన్న కలెక్టర్ హనుమంతరావు



ఢిల్లీలో కేంద్ర మంత్రులు స్మృతిఇరానీ, సుభశ్రీచౌదరి చేతుల మీదుగా పోషణ్ అభియాన్ అవార్డు అందుకొంటున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంతరావు. చిత్రంలో ఐసీడీఎస్ పీడీ మోతీ, డీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్ గాయత్రీదేవి కూడా ఉన్నారు.

**సంగారెడ్డి, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'పోషణ్ అభియాన్' అవార్డును సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు అందుకొన్నారు. శుక్రవారం ఢిల్లీలోని అశోక కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రులు స్మృతిఇరానీ, సుభశ్రీచౌదరి ఈ అవార్డును బహూకరించారు. జిల్లాను మొదటిస్థానంలో నిలిపిన కలెక్టర్‌ను అభినందించిన కేంద్ర మంత్రులు.. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోతీ, డీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్ గాయత్రీదేవిని కూడా ప్రశంసించారు. గర్భిణీలు, బాలింతలు, శిశువులు, కౌమార బాలికలు, చిన్నారులకు శ్రేష్ఠమైన పోషకాహారం అందించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన తీసుకొచ్చేందుకు కేంద్రం ఈ పథకాన్ని తీసకొచ్చింది. ఈ పథకాన్ని సమర్థంగా అమలుచేయడంలో కలెక్టర్ హనుమంతరావుతోపాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి కారణంగా జాతీయస్థాయిలో సంగారెడ్డి జిల్లా నంబర్‌వన్‌గా నిలిచింది. ఈ పథకం అమలులో 2018-19 సంవత్సరానికిగాను రాష్ట్రంలో 33 జిల్లాల నుంచి 149 ప్రాజెక్టులు అవార్డుల కోసం ప్రతిపాదనలు పంపగా.. సంగారెడ్డి జిల్లా ఎంపికయింది.

### అందరి కృషివల్లే అవార్డు

గ్రామీణాభివృద్ధి, వైద్యాఆరోగ్యం, పంచాయతీ, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతోపాటు సీడీపీవో, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు.. అందరి కృషివల్లే జాతీయస్థాయిలో అవార్డు దక్కింది. పోషకాహారంపై అవగాహన కల్పించడంలో విజయం సాధించాం. 'గ్రామ ఆరోగ్య వేదిక'లో భాగంగా గ్రామాల్లోకి వైద్య బృందాలు వెళ్ళి అన్నిరకాల పరీక్షలు చేసి మందులు అందించడంతోపాటు అవసరమైనవారికి చికిత్సలు అందించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఆరోగ్యకరమైన జిల్లా ఏర్పాటే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– ఎం హనుమంతరావు
కలెక్టర్, సంగారెడ్డి జిల్లా

## ప్రజలచేతిలో 'జనతా జనార్దన్'

పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు కొత్తయాప్

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పారదర్శక విధానాలతో పరిపాలనను ప్రజలకు చేరువగా తీసుకుపోతున్న ప్రభుత్వం మరో అడుగు ముందుకేస్తున్నది. అన్నిశాఖల సమస్త సమాచారాన్ని నిక్షిప్తంచేసి మొబైల్ అప్లికేషన్‌ను రూపొందించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నది. ఇందుకోసం నేషనల్ ఇన్ఫర్మెటిక్ సెంటర్‌తో ఏడాదిన్నరగా జరుపుతున్న కసరత్తు కొలిక్కి వచ్చింది. ఈ యాప్‌కు 'జనతా జనార్దన్' అనేపేరు పెట్టనున్నట్టు తెలిసింది. ఈ విషయంపై రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అన్నిశాఖల అధికారులతో సమావేశమవుతున్నారు. త్వరలో జనతా జనార్దన్ యాప్‌ను తీసుకురానున్నట్టు ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

### యాప్‌లో సమస్త సమాచారం

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వశాఖల సమస్త సమాచారాన్ని మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. ఈ యాప్ ద్వారా ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రజలు తమకు కావాల్సిన సమాచారం కోసం ఇబ్బందులు పడకుండా మొబైల్‌లోనే పొందేలా చర్యలు తీసుకుంటున్నది. ఇందుకోసం ఏడాదిన్నరగా జరుగుతున్న ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చాయి. అన్నిరకాల డాటాబేస్‌తో అధికారులు మొబైల్‌యాప్‌ను సిద్ధంచేస్తున్నారు. రాష్ట్రంతోపాటు కేంద్ర ప్రభుత్వసంస్థల సేవలను కూడా యాప్‌లో పొందుపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అవినీతిలేని పారదర్శక పాలన కోసం సీఎం కేసీఆర్ మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్‌చట్టాల్లో అనేక మార్పులు చేశారు. ఈ క్రమంలో జనతా జనార్దన్ మొబైల్ యాప్ తెరమీదకు వస్తే తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టినట్లవుతుంది.

# కరంటు కనిపిస్తలేదా?

› మొదటిపేజీ తరువాయి...

ఏర్పడేనాటికి 7,778 మెగావాట్లుగా ఉన్న స్థాపితశక్తి ఇప్పుడు 16,203 మెగావాట్లకు పెరిగిందని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులపై, సంస్థలపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్న సీఎండీ.. విద్యుత్‌సంస్థల పనితీరుపై అనుమానాలుంటే సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించుకోవచ్చని, సీబీఐ విచారణకు సైతం సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ప్రభాకర్‌రావు వివరణ ఆయన మాటల్లోనే..

### ప్రభుత్వ ప్రోత్సాహంతోనే 24 గంటల విద్యుత్ సరఫరా

తెలంగాణ ఏర్పాటునాటికి విద్యుత్‌సరఫరా ఎంత దయనీయంగా ఉండేదో అందరికీ తెలుసు. రాష్ట్రం ఏర్పడితే వరుస విద్యుత్ కోతలతో చీకటిమయం అవుతుందన్న హెచ్చరికలు కూడా అందరికీ గుర్తున్నాయి. వ్యవసాయ కనెక్షన్లకు ఐదుగంటల కరంట్ కూడా సరిగ్గా ఇవ్వలేకపోవటంవల్ల రైతుల ఆత్మహత్యలు, వారానికి రెండురోజుల పవర్ హాలిడేలతో మూతబడిన పరిశ్రమలు, నిరుద్యోగం, వలసపోయిన తెలంగాణ పల్లెలు.. ఇలాంటి దృశ్యాలు అందరికీ గుర్తు. అటువంటి అస్తవ్యస్త పరిస్థితుల్లో.. తెలంగాణ ఏర్పడిన తర్వాత యుద్ధప్రాతిపదికన విద్యుత్‌రంగాన్ని గాడినపెట్టాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌సంస్థల పగ్గాలను విద్యుత్‌రంగంలో అపార అనుభవం ఉన్న అధికారుల చేతిలో పెట్టి, నిర్వహణలో స్వేచ్ఛనిచ్చింది. ఫలితంగా అనతికాలంలోనే రాష్ట్రం 'నిరంతర విద్యుత్ కోతల చీకటిరోజుల' నుంచి '24 గంటల నాణ్యమైన విద్యుత్ వెలుగుల రోజుల్లో'కి అడుగుపెట్టింది.

### బకాయిలు నిరంతర ప్రక్రియ

రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవటంవల్ల విద్యుత్ పంపిణీ సంస్థలు కుప్పకూలే పరిస్థితి వచ్చిందన్న ఆరోపణ కూడా సరైంది కాదు. ఈ ఐదేండ్లలో సబ్సిడీల రూపంలో రూ.19,826 కోట్లు, అదనంగా రూ.7,100 కోట్లు అందించింది. వాస్తవానికి కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన విద్యుత్ జనరేటర్స్‌కు ఎల్సీ ఆధారిత చెల్లింపులు నిబంధన పంపిణీ సంస్థలకు గుదిబండగా మారింది. ఈ అంశంలో అనేక రాష్ట్రాలు తమ నిరసన వ్యక్తపరిచాయి. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విద్యుత్ సంస్థలు తెలంగాణ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాయి.

### నాలుగున్నరేండ్లలో 16,203 మెగావాట్లకు..

తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్తగా ఒక్క మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికాలేదని ఆరోపించడం బాధాకరం. రాష్ట్రం ఏర్పడిన అనతికాలంలోనే భూపాలపల్లిలో 600 మెగావాట్లు, పులిచింతలలో 120, కేటీపీఎస్ పాల్వంచలో 800, జైపూర్ సింగరేణిలో 1200 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాం. రాష్ట్రం ఏర్పడేనాటికి 71 మెగావాట్లుగా ఉన్న సౌర విద్యుత్ ఉత్పత్తి ఈ రోజు 3,600 మెగావాట్లను దాటి, దేశంలోనే రెండోస్థానంలో ఉన్నది. రూఫ్‌టాప్ సోలార్‌లో కూడా దేశంలోనే రెండోస్థానంలోకి ఎగబాకి, ఈ మధ్యే భారత ప్రభుత్వ పురస్కారాన్ని అందుకున్నది. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు సంబంధించి వాస్తవాలను ఒక్క ముక్కలో చెప్పాలంటే, రాష్ట్రం ఏర్పడేనాటికి 7778 మెగావాట్లుగా ఉన్న సామర్థ్యం, కేవలం నాలుగున్నరేండ్లలోనే 16,203 మెగావాట్లకు పెరిగింది.

### ఒప్పందాలన్నీ బిడ్డింగ్‌తోనే

ఎన్టీపీసీ రూ.4.30 టారిఫ్‌కు సోలార్ పవర్ ఇవ్వడానికి సిద్ధమైనా తెలంగాణ ముందుకు రాలేదని, రాత్రికి రాత్రి రూ.5.50 టారిఫ్‌తో బిడ్డింగ్ రూట్లో ఒప్పందాలు చేసుకున్నామని ఆరోపించడాన్ని నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాం. వాస్తవానికి ఎన్టీపీసీ ఏరోజూ రూ.4.30 టారిఫ్‌తో రాలేదు. రెండేండ్లక్రితం రూ.4.66 నుంచి రూ.5.19 ధరలతో ఎన్టీపీసీతో బండిల్డ్ సోలార్‌పవర్ కోసం ఒప్పందం చేసుకున్నాం. సోలార్ డెవలపర్స్‌తో ఒప్పందాలైనా, 570 మెగావాట్ల విద్యుత్ సరఫరా కోసం రూ.4.15 టారిఫ్‌కు చేసుకున్న ఒప్పందాలైనా.. బిడ్డింగ్ ద్వారా చేసుకున్నవే. ఇవన్నీ పారదర్శకంగా, విద్యుత్ నియంత్రణ మండలి అనుమతులతో చేసుకున్నవే. రాత్రికిరాత్రే ఒప్పందాలు చేసుకున్నామనటం అవాస్తవం. ఛత్తీస్‌గఢ్‌తో కొనుగోలు ఒప్పందం కూడా ఒక రాష్ట్ర ప్రభుత్వం మరొక రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్నదే. ఇవి కాకుండా షార్ట్‌టర్మ్ రూపంలో, ఎక్స్ఛేంజ్ ద్వారా చేసే కొనుగోళ్లు అన్నీ కేంద్రం మార్గదర్శకాల ప్రకారం, డీప్ పోర్టల్ వంటి అంతర్జాల వేదికల ద్వారా చేసినవే. ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం నేపథ్యంలో కారిడార్ అనుసంధానం అతిత్వరగా అందుబాటులోకి వచ్చింది. సీఎం కేసీఆర్ పీజీసీఐఎల్ అధికారులతో సమావేశాలు నిర్వహించడంవల్లే ఉత్తర, దక్షిణ ప్రాంతాల కారిడార్ తక్కువకాలంలో సాకారమైంది.

### అది గొప్ప నిర్ణయం

ప్రైవేటు సంస్థలకు లాభం చేకూర్చే నిర్ణయాలు జరిగినట్లు ఆరోపించారు. వాస్తవానికి తెలంగాణ ఏర్పడిన తర్వాత భారీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణాలన్నీ ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలకే ఇవ్వాలన్న గొప్ప నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్నది. ఫలితంగా బీహెచ్‌ఈఎల్‌కు రూ.40 వేల కోట్ల విలువైన 5,880 మెగావాట్ల ఉత్పత్తి నిర్మాణ బాధ్యతల అప్పగింత. ఈ రోజు దేశంలోని 90% విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నడుస్తున్నవే. ఇంకా చెప్పాలంటే, సంప్రదాయేతర సౌర, పవన విద్యుత్ కేంద్రాలు ఎక్కువయ్యాక సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కేంద్రాలు కూడా సబ్‌క్రిటికల్ టెక్నాలజీ కేంద్రాలవలె నడుస్తున్నాయన్నది చేదు వాస్తవం. ఉదాహరణకు.. 2009-10లో ఎన్టీపీసీ ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ 90% పైన ఉంటే, 2018-19కి 77 శాతానికి పడిపోయింది. తెలంగాణ చేపట్టిన ఈ సబ్ క్రిటికల్ టెక్నాలజీ పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఈఏ, గ్రీన్ ట్రిబ్యునల్ వంటివి అనుమతులు ఇచ్చిన తర్వాతే చేపట్టాం.

### విద్యుత్ సరఫరాలో మనమే నంబర్ 1

**రాష్ట్రం** ఏర్పడిన తర్వాత రూ.22,000 కోట్ల పెట్టుబడితో విద్యుత్ ప్రసార వ్యవస్థలను పటిష్ఠం చేశామని సీఎండీ ప్రభాకర్‌రావు చెప్పారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 14,000 ఎంవీఏ నుంచి 31,000 ఎంవీఏకు పెంచామని తెలిపారు. అందుకే అత్యధిక ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ అందుబాటులో ఉండి నాణ్యమైన విద్యుత్ సరఫరాలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నదన్నారు. ఐదేండ్లలో సాధించిన ప్రగతికిగాను ప్రతిష్ఠాత్మక సీబీఐపీ, స్కోచ్, ఎకనామిక్ టైమ్స్ వంటి అనేక జాతీయ పురస్కారాలను అందుకున్నామని, ఆరోపణలు చేస్తున్నవారు ఈ విషయాలన్నీ గుర్తుచేసుకోవాలని అన్నారు. మీడియా సమావేశంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, జేఎండీ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

### లోకం పోకడ





● ధర్మసాగరం.. వరి సోయగం



నిండుకుండల్లా ప్రాజెక్టులు, సాగరాలను తలపిస్తున్న చెరువులు కోటి ఎకరాల మాగాణాన్ని సాక్షాత్కరిస్తున్నాయి! వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్ కింద వేల ఎకరాల్లో సాగయిన వరిపైరు కనుచూపుమేర పచ్చటి అందాలతో కనువిందు చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా వరినాట్లు చివరి దశకు చేరుకున్నాయి. వానకాలం అంచనాలను మించి పంట సాగువుతున్నది.

ఫొటోలు: గొట్టె వెంకన్న



## టీఎస్ సెట్‌లో 7.55 శాతం ఉత్తీర్ణత

**ఉస్మానియా యూనివర్సిటీ:** తెలంగాణ స్టేట్ – స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ – సెట్) 2019 ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. ఈ ఏడాది జూలై 5, 6 తేదీల్లో నిర్వహించిన పరీక్షకు 32,284 మంది హాజరు కాగా, 2,438 మంది అర్హత సాధించారు. అర్హత శాతం 7.55గా నమోదైందని రిజిస్ట్రార్ గోపాల్‌రెడ్డి తెలిపారు. వచ్చేనెల ధ్రువపత్రాలను పరిశీలించి అనంతరం టీఎస్ సెట్ అర్హతపత్రం జారీచేస్తామని చెప్పారు. సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలో విడుదలచేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ముగిసిన ఎడ్‌సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

- వెబ్‌ఆప్షన్ల ఎంపికకు నేటివరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీఈడీ కాలేజీల్లో సీట్ల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ముగిసింది. ఎడ్‌సెట్‌లో 41,195 మంది విద్యార్థులు అర్హత సాధించగా, వారిలో 27,451 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ శనివారం వరకు కొనసాగుతుందని తెలిపారు.

# బాహుబలి మోటర్ల గర్జన

- గాయత్రి పంప్‌హౌస్‌లో రోజుకు ఒక టీఎంసీ ఎత్తిపోత
- పరవళ్లు తొక్కుతున్న కాళేశ్వర గంగ
- నిండుతున్న శ్రీరాజరాజేశ్వర జలాశయం
- చరిత్రలోనే తొలిసారి 9 టీఎంసీల నీటినిల్వ



కాళేశ్వరం జలాలతో కళకళలాడుతున్న శ్రీరాజరాజేశ్వర జలాశయం

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** గాయత్రి పంప్‌హౌస్ (లక్ష్మీపురం)లో బాహుబలి మోటర్లు గర్జిస్తున్నాయి. ఆసియాలోనే మొదటిసారిగా 139 మెగావాట్ల భారీమోటర్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గాయత్రి పంప్‌హౌస్‌లో ఇటువంటివి ఐదుఉండగా.. ప్రస్తుతం మూడు మోటర్లు రోజుకు ఒక టీఎంసీ చొప్పున నీటిని ఎత్తిపోస్తున్నాయి. దీంతో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కీలకమైన నీటిజంక్షన్‌గా పేరుగాంచిన శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయానికి గంగమ్మ పరవళ్లు తొక్కుతున్నది. ప్రాజెక్టు చరిత్రలోనే తొలిసారి నీటి నిల్వ 9 టీఎంసీలకు చేరగా, మరికొద్దిరోజుల్లోనే నిండుకుండలా మారబోతున్నది.

### నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో నిత్యం ఎత్తిపోతలు

ధర్మారం మండలం నందిపంప్‌హౌస్‌లో నిత్యం మూడు మోటర్లు నీటిని ఎత్తిపోస్తున్నాయి. ఈ జలాలు నంది రిజర్వాయర్‌కు పరుగులు తీస్తున్నాయి. అక్కడ ఆరుగేట్ల ద్వారా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్‌కు చేరుకుంటున్నాయి. గాయత్రి పంప్‌హౌస్‌లో ఈ నెల 11 నుంచి బాహుబలి మోటర్లను దఫాలవారీగా నడిపిస్తున్న అధికారులు, 15వతేదీ నుంచి నాలుగు, ఐదోమోటర్లను నడిపిస్తున్నారు. 20వ తేదీ నుంచి ఒకటో మోటర్‌ను కూడా ఆన్‌చేయడంతో ఒక్కో మోటర్ 3,150 క్యూసెక్కుల నీటిని పంప్‌హౌస్ నుంచి 115 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోస్తున్నట్టు ఈఎన్సీ వెంకటేశ్వరరావు తెలిపారు.

### శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌కు జలకళ

బోయినపల్లి మండలం మాన్వాడలోని శ్రీరాజరాజేశ్వర జలాశయం జలశోభను సంతరించుకున్నది. జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా, మొదటిసారిగా రికార్డుస్థాయిలో శుక్రవారం రాత్రి 9 గంటలకు నీటి నిల్వ 9 టీఎంసీలకు చేరింది. 2017 సెప్టెంబర్‌లో మొదటిసారి నాలుగు టీఎంసీలు, గతేడాది 2018 అక్టోబర్‌లో 8 టీఎంసీల నీటిని నిల్వచేయగా, ఇప్పుడు 9 టీఎంసీలతో జలకళను సంతరించుకుంటున్నది. ఎల్లంపల్లి బరాజ్ నుంచి తరలివస్తున్న నీటిని నంది పంప్‌హౌస్‌లోని మోటర్లు ఎత్తిపోస్తుండగా, దిగ్విజయంగా లక్ష్మీపూర్ చేరుతున్నాయి. అక్కడి గాయత్రి పంప్‌హౌస్‌లోని అతిపెద్ద మోటర్లు నిరంతరం నడుస్తుండటంతో జలాలు గ్రావిటీ కాల్వగుండా పరుగులు తీస్తున్నాయి. వరదకాల్వలో కలిసి దాదాపు 22 నుంచి 23 కిలోమీటర్లు ప్రవహించి, శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్‌కు చేరుతున్నాయి.

## పత్తిలో గులాబీ పురుగుపై అప్రమత్తం

- రైతులకు పంపిణీ చేసేందుకు ఫెరమోన్ ట్రాప్స్, లూర్స్

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** పత్తిలో గులాబీరంగు కాయతొలుచు పురుగును నివారణకు, ఒక ప్రాంతం నుంచి మరోప్రాంతంలోని పంటలకు ఇది సోకకుండా ఉండేందుకు వ్యవసాయశాఖ అవసరమైన చర్యలు చేపడుతున్నది. ఇందుకోసం రైతులకు ఫెరమోన్ ట్రాప్స్‌తోపాటు ల్యూర్స్ పంపిణీ చేసేందుకు సమాయత్తమయింది. వీటి కోసం రూ.8.27 కోట్లు ఖర్చు చేయనున్నారు. 16 లక్షల ఫెరమోన్ ట్రాప్స్, 33 లక్షల ల్యూర్స్ కొనుగోలు చేశారు. ఈ సీజన్‌లో 43.53 లక్షల ఎకరాల్లో పత్తిపంట సాగయింది. అన్ని పంటల సాగు విస్తీర్ణంలో సగం పత్తిదే. ముందుగా వేసిన పత్తి పంటపై గులాబీ పురుగు దాడి చేస్తుందని వ్యవసాయవిద్యాలయం కూడా నిర్ధారించింది. పురుగు విస్తరించకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని వర్సిటీ శాస్త్రవేత్తలు సూచించడంతో వ్యవసాయశాఖ అప్రమత్తమైంది. గులాబీ పురుగుతో 8 నుంచి 92 శాతం పంట నష్టం వాటిల్లుతున్నట్టు ఐకార్ గుర్తించింది. ఈ ప్రభావంతో 30 శాతం దిగుబడి పడిపోతున్నట్టు పేర్కొన్నది.

### పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు

- పంట 45 రోజుల వయస్సు ఉన్నప్పుడు లేదా పూత దశలో ఉన్నప్పుడు ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు ఉధృతిని గమనించాలి.
- లింగాకర్షక బుట్టల్లోని ఎరను ప్రతీ 21 రోజులకోసారి విధిగా మార్చాలి.
- గులాబీ రంగు పురుగు ఆశించిన గుడ్డ పూలను ఏరి నాశనం చేయాలి.
- పత్తి పంట చుట్టూ బెండగాని, తుత్తురు బెండగాని లేకుండా చూసుకోవాలి.
- వీటితోపాటు శాస్త్రవేత్తలు సూచించిన ప్రకారం పురుగు మందులను పిచికారీ చేయాలి.

## పాతపద్ధతిలోనే సూక్ష్మసేద్యం సబ్సిడీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి యోజన కింద 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' మైక్రోఇరిగేషన్ పథకంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్‌ను (డీబీటీ) ప్రభుత్వం రద్దుచేసింది. పాత పద్ధతి ప్రకారం 2019–20 ఆర్థిక సంవత్సరంలో మైక్రోఇరిగేషన్ విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఈ ఏడాది రైతులకు సబ్సిడీ విధానాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని పేర్కొన్నది. ఈ మేరకు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.


JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD
Kukatpally, Hyderabad - 500 085, Telangana
ADMISSION NOTIFICATION
Sponsored Category Seats in M.Tech. Regular Programs – 2019-20
Eligible candidates can directly appear for counseling under Sponsored Category seats for admission in to M.Tech. regular program for the academic year - 2019-20. For details, seats in each specialization, eligibility requirements, application format, counseling schedule and course fee etc. visit JNTUH website www.jntuh.ac.in. These candidates are not eligible for hostel admission or scholarship. Sliding will not be permitted for already admitted candidates in PGECET.
Dt : 23.08.2019 Sd/- REGISTRAR


# కొనసాగుతున్న స్వల్ప ఇన్‌ఫ్లోలు

- నిండుగా కృష్ణా ప్రాజెక్టులు
- గోదావరిలో స్వల్ప ప్రవాహం
- కాళేశ్వరం వద్ద పెరిగిన వరద




జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద పారుతున్న గోదావరి నది

**వివిధ ప్రాజెక్టుల్లో శుక్రవారంనాటి నీటిమట్టాలు**

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1704.72 | 129.72 | 128.19 | 11,200 | 10,000 |
| నారాయణపుర | 1615.00 | 1612.60 | 37.64 | 34.34 | 4,116 | 10,530 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 1,977 | 4,350 |
| జూరాల | 1045.00 | 1044.75 | 9.66 | 9.50 | 12,000 | 14,174 |
| తుంగభద్ర | 1633.00 | 1632.98 | 100.86 | 100.78 | 11,495 | 10,929 |
| శ్రీశైలం | 885.00 | 883.50 | 215.81 | 207.41 | 30,001 | 95,660 |
| నాగార్జునసాగర్ | 590.00 | 590.00 | 312.05 | 312.05 | 72,606 | 53,488 |
| పులిచింతల | 175.00 | 171.95 | 45.77 | 41.14 | 10,146 | 10,146 |
| మూసీ | 645 | 628.80 | 4.46 | 1.24 | 150 | 0 |
| సింగూరు | 1717.93 | 1670.52 | 29.91 | 0.47 | 320 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.42 | 17.18 | 0.14 | 48 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1063.10 | 90.31 | 17.46 | 1,006 | 400 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.95 | 24.07 | 3.54 | 0 | 204 |
| మిడ్‌మానేరు | 1043.31 | 1009.68 | 25.873 | 8.28 | 9,097 | 83 |
| కడెం | 700.00 | 697.08 | 7.60 | 6.86 | 1,404 | 553 |
| ఎల్లంపల్లి | 485.56 | 479.56 | 20.18 | 15.30 | 0 | 0 |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** భారీవరదలు తగ్గిన కృష్ణా, గోదావరి బేసిన్లలో స్వల్ప ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నాయి. కృష్ణానదిపై ఉన్న అన్ని జలాశయాల్లో గరిష్ఠస్థాయిలో నీటిమట్టాలు నిర్వహిస్తూ, విద్యుదుత్పత్తి, కాల్వల ద్వారా మాత్రమే నీటిని విడుదలచేస్తున్నారు. అటు గోదావరి బేసిన్‌లోనూ పలు ప్రాజెక్టులకు స్వల్ప ఇన్‌ఫ్లోలు వస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు మాత్రం ఇప్పటికీ చుక్కనీరు కూడా రావటం లేదు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గాయత్రి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోస్తుండటంతో శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఇన్‌ఫ్లో వస్తున్నది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద శుక్రవారం గోదావరి క్రమంగా పెరుగుతున్నది. కాళేశ్వరం వద్ద గోదావరి 6.06 మీటర్ల లోతుతో, 97వేల క్యూసెక్కులుగా పారుతున్నదని ఇంజినీర్లు తెలిపారు. సరస్వతి బరాజ్‌కు 6వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. పేరూరు దగ్గర ప్రవాహం 1.76 లక్షల క్యూసెక్కులకు పైగా ఉన్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసాని ప్రాజెక్టులో శుక్రవారం 405.1 అడుగుల నీటిమట్టం ఉన్నది. చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 అడుగులు కాగా ప్రస్తుతం 73.05 మీటర్లుగా ఉన్నది. ఎగువన వర్షాలతో నీరు వచ్చి చేరడంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి 12,235 క్యూసెక్కులను దిగువకు వదిలారు. భద్రాచలం వద్ద గోదావరిలో నీటిప్రవాహం పూర్తిగా తగ్గింది. శుక్రవారం ఉదయం 6 గంటలకు 19.9 అడుగుల వద్ద నిలకడగా ప్రవహిస్తున్నది. దిగువన ధవళేశ్వరం వద్ద 2.72 లక్షల క్యూసెక్కుల జలాలు వస్తుండటంతో 2.60 లక్షల క్యూసెక్కులను అధికారులు దిగువన సముద్రంలోకి వదులుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం వరకు ఈ నీటిసంవత్సరంలో 1636 టీఎంసీల గోదావరిజలాలు సముద్రంలో కలిశాయి. అటు కృష్ణాబేసిన్ నుంచి 305 టీఎంసీల కృష్ణాజలాలు సముద్రంలో కలిశాయి.




# పోతిరెడ్డి'పాడు' లెక్కలు?

- ఏసీడీపీ సర్వేలో పదిశాతం ఎక్కువ డిశ్చార్జి
- బోర్డు అధికారులను అడ్డుకోవటం మంచిదికాదు
- తప్పుడు లెక్కలతో రాష్ట్ర విశ్వసనీయతపై ప్రభావం
- ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీకి కృష్ణా బోర్డు చైర్మన్ లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పోతిరెడ్డిపాడు వాస్తవిక నీటివిడుదల రికార్డు నమోదు తేడాల్లో తెలంగాణ చేసిన ఫిర్యాదుపై కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఎట్టకేలకు తీవ్రంగా స్పందించింది. క్షేత్రస్థాయిలో సర్వేచేసి మరీ ఏపీ గుట్టును రట్టుచేసింది. పోతిరెడ్డిపాడు తప్పుడు లెక్కలను సీరియస్‌గా పరిగణిస్తూ ఏపీ జలవనరులశాఖ ఈఎన్సీ వెంకటేశ్వరరావుకు కృష్ణాబోర్డు చైర్మన్ డాక్టర్ ఆర్కే జైన్ లేఖరాశారు. 'అకౌంటిక్ డాప్లర్ కరంట్ ప్రొఫైలర్ ద్వారా ఈ నెల 10–12 తేదీల్లో పోతిరెడ్డిపాడు డిశ్చార్జిని బేరీజువేశారు. పదోతేదీన ఏపీ అధికారులు నమోదుచేసిన డిశ్చార్జి కంటే పదిశాతం ఎక్కువ పరిమాణం ఏసీడీపీ యంత్రం ద్వారా నమోదైంది. అంతేగాకుండా 11, 12 తేదీల్లో ఏపీ అధికారులు పోతిరెడ్డిపాడునుంచి 28 వేల క్యూసెక్కులు విడుదల చేసినట్లు రికార్డుల్లో నమోదుచేశారు. కానీ ఏసీడీపీ యంత్రం ద్వారా డిశ్చార్జి 36 వేల క్యూసెక్కుల నుంచి 40వేల క్యూసెక్కుల వరకు నమోదైందనే వివరాలను తెలంగాణ ఈఎన్సీ మురళీధర్‌రావు నేరుగా బోర్డు సభ్యకార్యదర్శికి ఇచ్చారు. దీనిపై బోర్డు సభ్య కార్యదర్శి కర్నూలు ఎస్‌ఈకి ఫోన్ చేయగా.. పోతిరెడ్డిపాడు నుంచి గరిష్ఠ డిశ్చార్జిని పంపడంద్వారా కాల్వల్లో ప్రవాహం సాఫీగా ఉంటుందా? లేదా? అనే దానిపై ట్రయల్ రన్ చేశామని చెప్పారు' అని బోర్డు చైర్మన్ జైన్ తన లేఖలో వివరించారు. ఇలా క్షేత్రస్థాయి అధికారులు తప్పుడు డిశ్చార్జిని నమోదు చేయడమనేది రాష్ట్ర విశ్వసనీయపై ప్రభావం చూపుతుందని జైన్ ఘాటుగా స్పందించారు. దీంతోపాటు బోర్డు, తెలంగాణ ఇంజినీర్లు సంయుక్తంగా పోతిరెడ్డిపాడు డిశ్చార్జిని పరిశీలించేందుకు కూడా ఏపీ ఇంజినీర్లు అనుమతించకపోవడమనేది సుహృద్భావ వాతావరణాన్ని దెబ్బతీస్తుందన్నారు.

**రికార్డులు సవరించుకోండి..**

ఇప్పటివరకు పోతిరెడ్డిపాడు నీటి విడుదలపై నమోదుచేసిన రికార్డులను సవరించేలా ఇంజినీర్లకు సూచనలు చేయాలని ఏపీ ఈఎన్సీని బోర్డు చైర్మన్ కోరారు. వాస్తవిక డిశ్చార్జిని నమోదుచేయాలని, ఏపీ, తెలంగాణ, బోర్డు ఇంజినీర్లు డిశ్చార్జిని సంయుక్తంగా పరిశీలించేందుకు అనుమతించాలని సూచించారు.

## బీఎస్సీ నర్సింగ్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్

- రేపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిమ్స్ వైద్య కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశానికి విద్యార్థులకు కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు నిమ్స్ విద్యావిభాగం శుక్రవారం ఒక ప్రకటన జారీచేసింది. ఈ నెల 25న నిమ్స్ పాత ఓపీడీ బ్లాక్‌లోని లెర్నింగ్ సెంటర్‌లో మొదటివిడుత కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని, విద్యార్థులు ఉదయం 9 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించింది. అర్హులైన విద్యార్థుల జాబితా, ఇతర వివరాలకు www.nims.edu.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపింది.

## నేటినుంచి ఐసెట్ తుదివిడుత కౌన్సెలింగ్

- 28న సీట్ల కేటాయింపు: కన్వీనర్ నవీన్‌మిట్టల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐసెట్ తుదివిడుత కౌన్సెలింగ్‌ను శనివారం నుంచి ప్రారంభిస్తున్నామని కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం షెడ్యూల్ విడుదల చేశారు. శని, ఆదివారాలు విద్యార్థుల స్లాట్‌బుకింగ్ ప్రక్రియ ఉంటుందని, 26న సర్టిఫికెట్ల పరిశీలన, శనివారం నుంచి 27 వరకు వెబ్‌ఆప్షన్ల ఎంపిక కొనసాగుతుందని చెప్పారు. 28న సీట్లు కేటాయిస్తామని, విద్యార్థులు కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి ఈనెల 31 వరకు గడువు ఇచ్చామన్నారు. వివరాల కోసం https://tsicet.nic.inను సంప్రదించాలి.





మైనారిటీలకు మోదీ నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉన్నది. మోదీ పాలనలో ఎక్కడా మత కలహాల్లేవు, వివక్ష లేదు. డెబ్భై ఏండ్లుగా మైనారిటీల్లో అభద్రతా భయాలను పెంచారు. ఇప్పుడు డెబ్భై రోజుల్లోనో, ఏడేండ్లలోనో ఆ భయాలను పోగొట్టలేం.

**ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ, కేంద్రమంత్రి**

ప్రస్తుత క్లిష్ట ఆర్థిక పరిస్థితుల్లో అందరూ కేంద్రానికి అండగా నిలువాలి. ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్రం సముచిత నిర్ణయాలు తీసుకుంటుందనే విశ్వాసం ఉన్నది. అందుకే నేను కేంద్రానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నా.

**అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి**



### చరిత్రలో నేడు



**1456**

బైబిల్ ముద్రణను పూర్తిచేసిన గుటెన్ బర్గ్.

**1608**

సూరత్ చేరుకున్న బ్రిటిష్ వ్యాపారనౌకలు, సేనలు.





**1891**

ఫిల్మ్ కెమెరాను కనుగొన్న థామస్ ఎడిసన్.

ఐఎన్ఎక్స్ మీడియాలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరాన్ని సీబీఐ కస్టడీలోకి తీసుకొని విచారణ ప్రారంభించటం దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్నది. బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నదని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. ఈ క్రమంలో చిదంబరాన్ని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విదేశీ నిధుల విషయంలో అనేక ప్రశ్నలకు సమాధానాలు రాబడుతున్నది. ఏదేమైనా సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న సీనియర్ నేత విషయంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరి చట్టపరిధిలో, ప్రజాస్వామ్యయుతంగా ఉండాలి.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఢాకాలో ఎన్ఆర్సీ ప్రక్రియ భారత అంతర్గత విషయమని చెప్పకొచ్చారు. అస్సాంలో చేపడుతున్న ఎన్ఆర్సీ గడువు ఆగస్టు 31 కావటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. సుమారు 40 లక్షల మంది దాకా ఎన్ఆర్సీ రిజిష్టర్‌లో పేర్లు నమోదు కాని వారున్నారు. వారి భవితవ్యమేమిటనేది ప్రశ్నార్థకం. ఎన్ఆర్సీలో పేర్లు లేనివారంతా విదేశీయులుగానే పరిగణింపబడుతారని భారత్ అంటున్నది. మరోవైపు బంగ్లాకూడా తమ సరిహద్దులు దాటి తమ దేశస్తులు ఎవరూ కాలు బయటపెట్టలేదని చెప్పకొస్తున్నది.

**ది హిందూ**



# గోప్యతా హక్కు

నేటికి సరిగ్గా రెండేండ్ల కిందట.. 2017 ఆగస్టు 23వ తేదీన పౌరుల గోప్యతను ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ పరమోన్నత న్యాయస్థానం చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. అయినా ఇటీవల మళ్ళా ఇదే అంశం సుప్రీంకోర్టు ముందుకు వచ్చిందంటే, వర్తమాన కాలంలో గోప్యత ఎంత కీలకాంశంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఆధార్‌ను సోషల్ మీడియాకు అనుసంధానం చేసే విషయంలో మద్రాసు హైకోర్టులో రెండు పిటిషన్లపై వాదోపవాదాలు సాగి విచారణ తుది దశకు చేరుకున్నది. ఇదే అంశంపై బొంబాయి, మధ్యప్రదేశ్ హైకోర్టులలో ఒక్కో పిటిషన్ దాఖలైంది. ఫేక్‌న్యూస్‌ను, అవమానకర వ్యాసాలను, అసభ్య అంశాలను, దేశద్రోహ, ఉగ్రవాద సమాచారాన్ని అరికట్టడానికి సోషల్ మీడియాకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని తమిళనాడు ప్రభుత్వం వాదిస్తున్నది. కానీ సోషల్ మీడియాలో సాగే సమాచారం ఏమిటో తమకే తెలువదనీ, వినియోగదారుల గోప్యతా హక్కుకు తాము భంగం కలిగించలేమని ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికలు అంటున్నాయి. వేర్వేరు హైకోర్టులలో విచారణలు సాగుతున్నందున, వీటన్నిటినీ కలిపి విచారించాలని ఈ సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీంతో మద్రాసు హైకోర్టు విచారణ సాగించవచ్చునని, అయితే తుదితీర్పు ఇవ్వకూడదని ప్రస్తుతానికి సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆన్‌లైన్ గోప్యతా హక్కుకు, వెబ్‌ను వేదికగా చేసుకునే నేరస్థులను పట్టుకోవడానికి రాజ్యానికి ఉన్న హక్కుకు మధ్య సమతుల్యత సాధించవలసి ఉన్నదని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయపడ్డది. దీన్నిబట్టి గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ, గోప్యతా హక్కుపై ఇకముందు కూడా చర్చ సాగబోతున్నదని స్పష్టమవుతున్నది.

> **పౌరుడికి గోప్యతా హక్కు ఉండాలీ అంటే అది ప్రభుత్వం నుంచే కాదు, ప్రైవేటు సంస్థల నుంచి కూడా అని అర్థం చేసుకోవాలె. గత శతాబ్దంలో వ్యాపార రంగానికి చమురు ఎంత ప్రధాన పాత్ర వహించిందో ఇప్పుడు డిజిటల్ ఎకానమీలో డేటాకు అంత ప్రాముఖ్యం ఉన్నదని ఆర్థికవేత్తలు అంటున్నారు. డేటాను సేకరించడం, నిలువ చేయడం, అమ్ముకోవడం అనేవి కీలకమైన అంశాలు. ప్రజలకు తెలువకుండా వారి డేటాను ఉపయోగించుకోవడం చౌర్యమే.**

సుప్రీంకోర్టు రెండేండ్ల కిందట ఇచ్చిన విస్పష్టమైన తీర్పులో గోప్యతా హక్కు జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛలో భాగమని పేర్కొన్నది. పౌరుల వ్యక్తిగత అంశాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదనే ప్రజాస్వామిక సూత్రం ఇప్పటికే సుస్థిరపడ్డది. అయితే సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయి ఆన్‌లైన్ ప్రైవసీ అనేది కొత్తగా రావడంతో మరోసారి ధ్రువీకరించుకోవలసిన అవసరం ఏర్పడ్డది. సోషల్‌మీడియాలో కొన్ని పెడధోరణులు పొడసూపుతున్న మాట నిజమే. సంఘవిద్రోహ, ప్రజాస్వామ్య వ్యతిరేక, విద్వేష భావజాలం ప్రచారమవుతున్నది. ఉన్మాదశక్తులు కొందరు ప్రముఖులను, సామాన్యులను వారి అభిప్రాయాలు వెల్లడించకుండా బెదిరిస్తున్నాయి. ఈ వికృత పోకడలను అరికట్టడం అవసరం. అయితే ప్రభుత్వాలు తలుచుకుంటే ఇప్పుడున్న చట్టాలతోనే, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక హంగులతోనే నేరస్థులను గుర్తించవచ్చు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ముందు అధికార పక్షానికి అనుకూలంగా ఫేక్‌న్యూస్ సోషల్ మీడియాలో వరదలా వచ్చిపడ్డది. ఇంకా వస్తూనే ఉన్నది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయడం లేదు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోతే ఆధార్‌ను అనుసంధానం చేసినా ఫలితం ఉండదు. ప్రభుత్వం సదుద్దేశంతోనైనా పౌరుల హక్కులకు భంగం కలిగించే వెసులుబాట్లు పొందకూడదు. ప్రజల ఆలోచనలను, చర్యలను నిరంతరం పసిగట్టే ఏర్పాట్లు ప్రభుత్వం చేతిలో ఉండటం నిరంకుశ వ్యవస్థ లక్షణం. సాధారణ పరిస్థితుల్లో హక్కుల పరిరక్షణ ప్రాధాన్యం అర్థంకాదు. కానీ నిరంకుశశక్తులు అవతరించినప్పుడు వాటికి అవరోధంగా ఉండే రాజ్యాంగపరమైన రక్షణల అవసరం తెలిసివస్తుంది. ఒకప్పుడు మీడియా స్థూలంగా ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేది. కొన్ని విలువలు, లక్ష్యాల కోసం మీడియా సంస్థలు ఏర్పడేవి. కానీ ఇప్పుడు అనేక రాజకీయ, పారిశ్రామిక సంస్థలు మీడియాను నియంత్రిస్తున్నయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ప్రజాస్వామిక స్వభావాన్ని కలిగి ఉన్నదనే వాదన కూడా బలమైనదే.

ఇప్పుడు సుప్రీంకోర్టు ముందుకు వచ్చిన వివాదంలో- ప్రభుత్వం గోప్యత హక్కును హరించే వాదనలు చేస్తుంటే, విదేశీ మూలాలు గల ఫేస్‌బుక్ తదితర సంస్థలు మాత్రం గోప్యతా హక్కుకు అనుకూలంగా వాదిస్తున్నాయి. వీటి ధోరణి ప్రగతిశీలంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నట్టు కనిపిస్తున్నది. కానీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గోప్యతా హక్కు కోసం మాట్లాడుతున్న ఈ సంస్థలు స్వయంగా డేటా చౌర్యానికి పాల్పడుతున్నాయి. పౌరుడికి గోప్యతా హక్కు ఉండాలీ అంటే అది ప్రభుత్వం నుంచే కాదు, ప్రైవేటు సంస్థల నుంచి కూడా అని అర్థం చేసుకోవాలె. గత శతాబ్దంలో వ్యాపార రంగానికి చమురు ఎంత ప్రధాన పాత్ర వహించిందో ఇప్పుడు డిజిటల్ ఎకానమీలో డేటాకు అంత ప్రాముఖ్యం ఉన్నదని ఆర్థికవేత్తలు అంటున్నారు. డేటాను సేకరించడం, నిలువ చేయడం, అమ్ముకోవడం అనేవి కీలకమైన అంశాలు. ప్రజలకు తెలువకుండా వారి డేటాను ఉపయోగించుకోవడం చౌర్యమే. ఈ సంస్థలకు అనుకూలంగా చట్టాలను మార్చాలంటూ అమెరికా మన దేశం మీద ఒత్తిడి తెస్తున్నది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండటం అవసరం. వ్యక్తుల సమాచారం ప్రభుత్వం తమ గుప్పిటలో పెట్టుకోవడం ఎంత ప్రమాదకరమో, ప్రైవేటు కంపెనీలు దొంగిలించడం కూడా అంతే అవాంఛనీయం.

### సందర్భం

## గోకుల కృష్ణ



కారాగారంలో జన్మించి
గోకులాన ఆడిపాడి
యశోద ముద్దుల తనయుడై
బాలకృష్ణుడి ఆనంద పరవశం
బాల్య చేష్టలతో బృందావనాన తిరిగి
పిల్లనగ్రోవితో అలమందల కాసి
చిటికెన వేలుతో గోవర్ధనగిరినెత్తి
మాయ రాక్షసుల మట్టుబెట్టి
మామ కంసుడిని అంతం జేసి
తల్లిదండ్రుల చెర విడిపించిన
అవతార పురుషుడు బాలకృష్ణుడు
న్యాయం కోసం పాండవ పక్షపాతియై
కురుక్షేత్రాన గీతాసారం విప్పి
ధర్మనిరతికి మారుపేరు శ్రీకృష్ణ భగవానుడు
కృష్ణలీలలు జగతికి వెలుగు
గోకులాష్టమిన కృష్ణ పాదమై ఇంటికి వచ్చి
మధుర గానమై నిలువుము కన్నా..

**- ఉండ్రాల రాజేశం, 99669 46084**

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

### ముక్తసరి



**దేవులపల్లి ప్రభాకరరావు**

# విస్సన్న చెప్పిండు వేదం..

**భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్యత్వ దేశాల్లో మూడు అమెరికా, చైనా, బ్రిటన్-పాకిస్థాన్ పక్షా న గొంతు విప్పుతున్న సూచనలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఈ లోపున ఇక్కడ విస్సన్న చెప్పిన వేదం విన్నప్పుడు స్వతంత్ర భారత రాజ్యాంగంలోని మరికొన్ని పేజీలకు, అట్టడుగువర్గాల సంక్షేమానికి అవకాశం కల్పిస్తున్న రిజర్వేషన్ అధ్యాయం పేజీలకు ఎసరుపెట్టే, చెదలుపట్టే ప్రమాదం భయంకరంగా కన్పిస్తున్నది.**

విస్సన్న చెప్పిందే వేదం అంటారు. అవును ఇప్పుడు విస్సన్న వేదమే చెపుతున్నడు. విస్సన్న పలుకులు వింతలుగా ధ్వనించినా యధార్థాలవుతున్నాయి. అది విచిత్రం. ఉర్దూలో 'అన్హోని' అంటారు. 'అన్హోని' తాత్పర్యం జరుగగూడనివి జరుగడం. అభినవ విస్సన్న పలుకుతున్న పలుకులు వేద వాక్యాలవుతున్నాయి. ఐదేండ్ల కిందట, 2014 వేసవిలో 16వ లోక్‌సభ ఎన్నికలు జరిగి, కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్దిరోజులకు ఆయన-విస్సన్న, అప్పటి విశ్వహిందూ పరిషత్తు అధ్యక్షుడితో కలిసి కలకత్తా వెళ్లి ఒక సభలో ప్రసంగిస్తూ, వేద వాక్యాలు ఉద్ఘోషిస్తూ ఆరు వందల ఏండ్ల అనంతరం కేంద్రంలో ఢిల్లీలో హిందూ రాజ్యం ఏర్పడిందన్నారు. దేశ ప్రజలు, ప్రపంచ జనులు నివ్వెరపోయి ముక్కుమీద వేలేసుకున్నారు. ఎవరెక్కడ వేలేసుకున్నా విస్సన్న చెప్పింది వేదం. అది నిజం కాకుండా ఉండదు అన్హోని! ఇండియా దటీజ్ భారత్ హిందూ ప్రభుత్వం హఠాత్తుగా, రాత్రికిరాత్రే అవీఇవీ ఎన్నో పిట్ట కథలు, కాకి కబుర్లు చెప్పి దాదాపు పది లక్షల మంది సాయుధ బలగాలను విమానాల్లో పంపి మోహరించి తమ రాష్ట్రాన్ని బల ప్రయోగంతో ఆక్రమించిందని, తమ రాష్ట్రాన్ని ముక్కలు చేస్తున్నట్లు ప్రకటించిందని, చట్టాలకు, భారత రాజ్యాంగానికి వక్రభాష్యాలు చెప్పి తమ రాష్ట్రంలోనే, తమ ఇండ్లలోనే తమను ఖైదీలుగా చేసిందని, నిన్న మొన్నటివరకు తమ సర్వ పరిష్వంగంలో తీయని మాటలు వింటూ మైమరిచిన నేతలను సైతం నిర్బంధానికి గురిచేశారని, నాడు అటల్ బిహారీజీ కవితాత్మకంగా అన్న 'కశ్మీరియత్, జమ్‌హూరియత్, ఇన్సానియత్' మాటలకు ఆయన రాజకీయ వారసులు ఎలక్ట్రిక్ క్రిమటోరియంలో దహన సంస్కారాలు జరిపారని ఆందోళన చెందుతూ కోటికి మించిన కశ్మీరీలు కుమిలిపోతున్నారని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తున్నది. స్వతంత్ర భారతదేశం 'గిట్లనే ఉంటది' అని 72 ఏండ్ల కిందట అసాధారణ జోస్యం చెప్పిన సర్ విన్‌స్టన్ చర్చిల్ తన లండన్ సమాధిలో లేచి నిల్చుని పగలబడి నవ్వుతున్నాడని అంటున్నారు. 72 ఏండ్ల కిందట, ఇప్పుడు ఈ దేశంలో ఇటీవల ఆగస్టు 5 నుంచి సంభవిస్తున్న పరిణామాలను తీవ్రంగా విమర్శిస్తున్న బ్రిటన్ లేబర్ పార్టీ అప్పుడు భారత స్వాతంత్ర్య ప్రదానానికి పౌరోహిత్యం వహించింది, ఆరోజు బ్రిటిష్ ఇండియాకు స్వాతంత్ర్యం సిద్ధించినప్పుడు భారత స్వాతంత్ర్య రథసారథి గాంధీజీ కోట్లాది భారత ప్రజలకు బాపూజీ సంబురాలు జరుపుకోలేదు. తెలంగాణ ప్రజలు కూడా ఆ రోజు స్వాతంత్ర్యం పొందలేదు, తెలంగాణ ప్రజలకు స్వాతంత్ర్యం, స్వరాజ్యం వచ్చి విముక్తి కలిగింది 2014 జూన్ 2న. ఆ రోజు మత కలహాలు బాపూజీకి అంతులేని మనోవేదన కలిగించాయి. ఆ మతోన్మాద పిశాచి ఆ తర్వాత కొన్ని నెలలకే బాపూజీని పొట్టన పెట్టుకున్నది. 72 ఏండ్ల స్వాతంత్ర్యంతో, మతాతీత లౌకిక విధానాలతో, ప్రపంచంలోని అన్నిటికంటే పెద్ద భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు రాజకీయ పరిణతి, విజ్ఞత చేకూరిందనుకున్న వారు మొన్నటి ఆగస్టు 15 స్వాతంత్ర్య సంబురాల్లో, వేడుకల్లో పాల్గొనలేకపోయిన జమ్ముకశ్మీరీల దయనీయస్థితిని చూసి తల్లడిల్లారు, నిరాశా నిస్పృహలకు గురైనారు. 1948 జనవరి 30 సాయంత్రం ఢిల్లీలో గాంధీజీని ఒక మతోన్మాది బలిగొన్నప్పుడు తెలంగాణ మహాకవి దాశరథి గుండెలో గునపం గుచ్చినట్లయింది. దాశరథి లేఖిని ఆ క్షణాన కంటతడి పెట్టి అక్షర శ్రద్ధాంజలి ఘటించింది. తెలంగాణతల్లి మతోన్మాదాన్ని సహించలేదు, భరించలేదు.

గాంధీజీ హత్యానంతరం మూడ్రోజులకు అప్పటి ఉప ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ బీజేపీ మాతృ సంస్థ ఆరెస్సెస్‌ను నిషేధించారు. తర్వాత బాబూ రాజేంద్రప్రసాద్ పటేల్‌కు 1948 మే 14న లేఖ రాసి అప్పటి ఢిల్లీ క్లిష్టపరిస్థితి వివరించారు. ఎవరిపట్ల ఎటువంటి విద్వేషం లేనివాడుగా, అజాత శత్రువుగా, సనాతన హైందవ ధర్మవాదిగా ప్రసిద్ధి పొందిన రాజేంద్రప్రసాద్ (స్వతంత్ర భారత ప్రథమ రాష్ట్రపతి) తన లేఖలో వ్యక్తపరిచిన అభిప్రాయానికి పటేల్ చాలా విలువ ఇచ్చారు. 4 రోజులకే రాజేంద్రప్రసాద్‌కు జవాబిచ్చారు. గాంధీజీ హత్య వెంటనే ఫిబ్రవరి 1న పటేల్ అప్పటి ఆరెస్సెస్ అధినేత ఎం.ఎస్.గోల్వాల్కర్‌ను అరెస్టు చేయించారు. నిషేధం విధించినప్పటికీ, సంస్థను రద్దు చేయనందువల్ల, ఫలితం కన్పించడం లేదన్న అభిప్రాయాన్ని పటేల్‌కు రాసిన లేఖలో రాజేంద్రప్రసాద్ వ్యక్తపరుచడం గమనార్హం. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ అనంతరం ఆరెస్సెస్‌ను రద్దుచేస్తామని ఆ సంస్థకు సంబంధించిన కొందరు పెద్దలు 1976లో నాటి జనతా పార్టీ ప్రముఖ నేత చరణ్‌సింగ్‌కు హామీ ఇచ్చారట. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో ఇందిరా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడటానికి అవతరించిన జనతా పార్టీలో అప్పటి జనసంఘ్ (ఇప్పటి బీజేపీ పూర్వాశ్రమం) ఒక భాగస్వామి. డ్యుయల్ మెంబర్‌షిప్ సమంజసం కాదని, జన సంఘీయులు ఆరెస్సెస్‌లో సభ్యత్వం వదులుకోవాలని జనతాపార్టీ కన్వీనర్ జార్జ్ ఫెర్నాండేజ్, మధులిమాయె, మధు దండావతె, మృణాల్‌గోరే తదితర సోషలిస్టు నాయకులు పట్టుబట్టడం వల్ల, జన సంఘీయులు ఆరెస్సెస్ సభ్యత్వాన్ని వదులుకోకపోవడం వల్ల రెండేండ్లయినా నిండకముందే జనతా పార్టీ ముక్కలయింది, జయప్రకాశ్ నారాయణ్ దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు. నాటి ప్రకటిత ఎమర్జన్సీని వ్యతిరేకించిన, దాని అంతం చూసిన జయప్రకాశ్ నారాయణ్ నేటి అప్రకటిత, ప్రచ్ఛన్న ఎమర్జన్సీని వ్యతిరేకించి ఉద్యమించడానికి దేశ ప్రజల మధ్య లేకపోవడం దురదృష్టం. నాటి జమ్ముకశ్మీరు సీఎం షేరె కశ్మీర్‌షేఖ్ అబ్దుల్లాను పదవీచ్యుతుడిని చేసి, అరెస్టు చేసి, కారాగారంలో పదకొండేండ్లు నిర్బంధించినప్పుడు అబ్దుల్లా విడుదల కోసం, కశ్మీరు ప్రజలకు న్యాయం చేయడానికి నిర్విరామ పోరాటం జరిపిన ఏకైక నాయకుడు జయప్రకాశ్ నారాయణ్. ఆయన గొప్ప మానవతావాది, సర్వోదయ నాయకుడు. నాగాల హక్కుల కోసం నడుం బిగించిన, చంబల్ లోయ దోపిడీ దొంగల హృదయ పరివర్తన కోసం కంకణధారణ చేసిన మహా మానవతావాది, క్విట్ ఇండియా ఉద్యమవీరుడు, అక్షరాల గాంధేయవాది జయప్రకాశ్. ఈరోజు ఆయనే బతికి ఉంటే స్వతంత్ర భారత్‌లో కశ్మీరీ ప్రజలు వరుసగా ఇరువై రోజుల నుంచి ప్రాథమికహక్కులను సైతం కోల్పోయి, ఇంతవరకు ప్రపంచంలో ఎక్కడా కనీవినీ ఎరుగని (ఫాసిస్టు హిట్లర్ నాజీ పాలనలో తప్ప ఇంకెక్కడ లేని) విపరీత నిర్బంధం, ఆంక్షలు ఎదుర్కొంటున్నందుకు తీవ్ర నిరసన తెలిపి ఖండించేవాడు. న్యాయం కోసం నిలిచేవాడు. కాళోజీ బతికి ఉంటే కళ్లెర్రజేసి అక్షర ఖడ్గం దూసేవాడు-'ఏవి తల్లీ నిరుడు నిలిచిన ఉద్యమశక్తులు ఏవి తల్లీ..' అంటూ మహాకవి శ్రీశ్రీ హుంకరించేవాడు; దాశరథి మళ్లీ శ్రీకృష్ణ జన్మస్థానం వెళ్లవలసి వచ్చినా భయపడక జైలు గోడలపై ఈ నయా కాశీం రజ్వీల అరాజక చర్యలపై అక్షరాగ్నిధారలను ప్రవహింపజేసేవాడు.

విస్సన్నలు ఎన్ని వేదాలు వల్లించినా కశ్మీర్ సమస్య 'అంతర్గత సమస్యగా', 'ద్వైపాక్షిక సమస్యగా' మిగులడం లేదు. కశ్మీరులో, ముఖ్యంగా ఇటీవలి విషమ, విజ్ఞతారహిత చర్యల పర్యవసానంగా మానవ, పౌర హక్కులకు భంగం కలుగుతున్నదని అంతర్జాతీయ రంగంలో, ఐరాసలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నది. ఒకవంక స్వదేశం కాంగ్రెస్‌లో (ప్రజాప్రతినిధుల సభలో పార్లమెంట్‌లో) అభిశంసన (ఇంపీచ్‌మెంట్) తీర్మానం ప్రమాదాన్ని, మెక్సికో గోడ నిర్మాణం ఇబ్బందిని, కొందరు సుందరాంగులతో పాత సంబంధాల పంచాయితీని, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, ఉత్తరకొరియా, కమ్యూనిస్టు చైనా తదితర సమస్యలను, రానున్న ఎన్నికల సమస్యను ఎదుర్కొంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలువని పేరంటంగా కశ్మీరు వివాదంలో కూడా జోక్యం చేసుకొని మధ్యవర్తిత్వం జరుపడానికి ఉబలాటపడుతున్నాడు. 'ఇది మా అంతర్గత సమస్య' అని మొత్తుకుంటున్నా ట్రంప్ వినడం లేదు. 'కశ్మీరు మతానికి సంబంధించిన అతి క్లిష్ట సమస్య' అని ట్రంప్ మరో భాష్యం చెప్పాడు. బ్రిటన్‌లో ఏదో ఒకరోజు తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్న లేబర్ పార్టీ నాయకులు కశ్మీరులో మానవహక్కులు మట్టి కలుస్తున్నాయని ఢంకా బజాయించి ప్రపంచానికి చెప్తున్నారు. చైనా సంగతి సరేసరి. పాకిస్థాన్‌కు ఆప్తమిత్రంగా వ్యవహరిస్తున్న చైనా ఇటీవల ఆగస్టు 5 నుంచి కశ్మీరులో సంభవించిన పరిణామాల విషయం ఆలోచించడానికి భద్రతామండలి (సెక్యూరిటీ కౌన్సిల్) అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేయించగలిగింది. మొత్తానికి కశ్మీరు మళ్లీ అంతర్జాతీయ వేదిక మీదికి వచ్చిందని పాకిస్థాన్ సంతోషిస్తున్నది. భద్రతా మండలిలోని ఐదు శాశ్వత సభ్యత్వ దేశాల్లో మూడు అమెరికా, చైనా, బ్రిటన్-పాకిస్థాన్ పక్షాన గొంతు విప్పుతున్న సూచనలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఈ లోపున ఇక్కడ విస్సన్న చెప్పిన వేదం విన్నప్పుడు స్వతంత్ర భారత రాజ్యాంగంలోని మరికొన్ని పేజీలకు, అట్టడుగువర్గాల సంక్షేమానికి అవకాశం కల్పిస్తున్న రిజర్వేషన్ అధ్యాయం పేజీలకు ఎసరుపెట్టే, చెదలుపట్టే ప్రమాదం భయంకరంగా కన్పిస్తున్నది. సాయుధ బలగాల మోహరింపుతో ఈ ప్రాసెస్ మొదలుకావడం ఇప్పటి సంప్రదాయం. రామాయణంలో పిడకల వేట వలె మొన్న ఆగస్టు 15 నాటి ప్రసంగాలు ప్రతిధ్వనించాయి. సన్యాసులు సంసారాల గురించి మాట్లాడినప్పుడు ప్రహసనాలను విన్నట్లనిపిస్తుంది. కొందరు సన్యాసి నాయకులు ఈ దేశంలోని దంపతులు ఎక్కువమంది పిల్లలను ఉత్పత్తి చేసి హిందువుల సంఖ్యను పెంచాలని ఆదేశించిన విషయం మరిచిపోలేనిది. ఇటీవల ఆగస్టు 15న ఢిల్లీలో ఎర్రకోట నుంచి దేశ ప్రజలకు సందేశం అందిస్తూ ప్రధాని మోదీజీ జనాభా విస్ఫోటనం పట్ల ఆందోళన వ్యక్తపరిచారు. స్వతంత్ర భారతదేశం అవతరించిన తర్వాత మూడేండ్లకే 1951లోనే కు.ని.జాతీయ విధానాన్ని అమలుపరిచి జనాభా పెరుగుదలను నిరోధించడానికి కృషి జరిపిన సంగతి జగద్విదితం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రభుత్వ పక్షాన జనాభా పెరుగుదల నిరోధానికి కు.ని. జాతీయవిధానాన్ని నాడే ప్రవేశపెట్టిన తొలి దేశం భారతదేశం. ఇది చారిత్రక సత్యం.

> **కొందరు సన్యాసి నాయకులు ఈ దేశంలోని దంపతులు ఎక్కువమంది పిల్లలను ఉత్పత్తి చేసి హిందువుల సంఖ్యను పెంచాలని ఆదేశించిన విషయం మరిచిపోలేనిది. ఇటీవల ఆగస్టు 15న ఢిల్లీలో ఎర్రకోట నుంచి దేశ ప్రజలకు సందేశం అందిస్తూ ప్రధాని మోదీజీ జనాభా విస్ఫోటనం పట్ల ఆందోళన వ్యక్తపరిచారు.**

# బీజేపీ ఆటలు ఇక్కడ సాగవు

### విశ్లేషణ



**ఎస్.వి.సి.ప్రకాశ్**

భారత రాజకీయవ్యవస్థలో గత నాలుగు దశాబ్దాలుగా ఒక సైద్ధాంతిక పునాదిగా ఉన్న పార్టీ బీజేపీ. మధ్యతరగతి వర్గాలు, హిందుత్వవాదుల్లో గుర్తింపు పొంది నేడు క్రమంగా దేశవ్యాప్తంగా అధికారం చేజిక్కించుకునే దిశగా పావులు కదుపుతున్నది. 2014లో బీజేపీ 'కాంగ్రెస్ ముక్త్ భారత్' నినాదంతో గుజరాత్ అభివృద్ధి నమూనాను చూపించి మోదీ నేతృత్వంలో కేంద్రంలో అధికారం చేజిక్కించుకున్నది.

అప్పటి నుంచి మోదీ-షా ద్వయం పాలన, రాజకీయాల్లో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. దేశంలోని అన్నిరాష్ట్రాల్లో తమ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమే బీజేపీ లక్ష్యం. దాన్ని సాధించడానికి పలు రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచింది. లేదా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది. 2014 ఎన్నికల్లో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని కాంగ్రెస్ క్రమంగా చాలా రాష్ట్రాల్లో అధికారాన్ని కోల్పోయింది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఉన్నప్పుడే రాష్ట్రాలు బలంగా ఉంటాయని కొత్త రాజకీయ సిద్ధాంతాలను తీసుకువచ్చింది. అందులో భాగంగానే 2019 సార్వత్రిక ఎన్నికల్లో సొంతంగా 303 స్థానాలు కైవసం చేసుకొని దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చింది బీజేపీ. తర్వాత అన్నిరాష్ట్రాల్లో, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ఉబలాటపడుతున్నది.

బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే కశ్మీర్‌కు ఉన్న స్వయం ప్రతిపత్తిని రద్దుచేసింది. 370, 35 ఏ ఆర్టికల్స్‌ను రద్దుచేయడం ద్వారా కశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదా రద్దయింది. బీజేపీ అఖండ భారతావనిని సాధించాలనే లక్ష్యంతో దక్షిణాది రాష్ట్రాలకు ముఖ ద్వారమైన తెలంగాణలో అదే దూకుడు ప్రదర్శిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన బహిరంగ సభలో బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన ప్రసంగమే ఇందుకు ఉదాహరణ.

2023 వరకు తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ఏకైక లక్ష్యంతో మోదీ-షా ద్వయం తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టింది. 2018 శాసనసభ ఎన్నికల్లో 103 చోట్ల డిపాజిట్లు కోల్పోయిన బీజేపీకి 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నాలుగు పార్లమెంట్ స్థానాలు లభించడంతో ఎనలేని ధైర్యం వచ్చింది. సిద్ధాంతాలు వదిలి, హిందుత్వవాదాన్ని పక్కనబెట్టి బీజేపీ కేవలం అధికారవాదాన్నే సిద్ధాంతంగా మార్చుకున్నది. దేశ రాజకీయాల్లో దళారీ రాజకీయ సంస్కృతిని ప్రవేశపెడుతున్నది. దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలన్నింటిని కాషాయీకరణ చేసుకుంటూ యావత్ దేశాన్ని కాషాయీకరణ చేయాలనే దుందుడుకు పోకడలతో రాజ్యాంగ మౌలికసూత్రాలను కూడా మార్చాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మోదీ-షా చేస్తున్న ఈ ప్రయత్నాల వల్ల భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతీయ సంస్కృతికి తీవ్ర విఘాతం కలుగడం వాస్తవం. కమలనాథులు తమ ప్రయోగాలతో కర్ణాటకలో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసి విజయం సాధించారు. ఆ ప్రయోగాన్నే అన్ని దక్షిణాది రాష్ట్రాల్లో చేయాలనే దురాలోచనలో బీజేపీ ఉన్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నది. ఇందులో భాగంగానే తెలంగాణలో బలంగా ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచి అధికారంలోకి రావడానికి తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టింది. దక్షిణాది రాష్ట్రాల్లో అటు బీజేపీలో, ఇటు కాంగ్రెస్‌లో కేసీఆర్ లాంటి బలమైన, ప్రజాదరణ కలిగిన ప్రజా నాయకుడు లేరు. బీజేపీ అధికారవాద, ఆక్రమణవాద సిద్ధాంతాన్ని కేసీఆర్ వ్యతిరేకిస్తూ లౌకిక ప్రజాతంత్రశక్తులను ఏకం చేయడానికి ప్రయత్నాలు చేయడం మోదీ-షాలకు రుచించడం లేదు. అందుకే కేసీఆర్ ప్రభుత్వంపై జేపీ నడ్డా అనుచిత వ్యాఖ్యలు చేశారు.

> **తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ చేస్తున్న అవిరళ కృషి కేంద్రంలోని బీజేపీకి ఇబ్బందిగా మారింది. అందుకే కమలనాథులు విలువలకు తిలోదకాలిచ్చి, సైద్ధాంతిక నిబద్ధతను పక్కనబెట్టి అధికార రాజకీయాలకు పాల్పడుతున్నారు. అందుకే 'నెక్స్ట్ తెలంగాణ' పేరుతో బీజేపీ చేసిన వ్యాఖ్యలకు టీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఘాటైన జవాబు ఇచ్చారు.**

బలమైన ఫెడరల్ ప్రభుత్వ ఆవశ్యకతను కేసీఆర్ అనేక సందర్భాల్లో వ్యక్తపరిచారు. ఫెడరల్ స్ఫూర్తిని ముందుకుతీసుకుపోవడం కోసం పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, జాతీయ నాయకులను కలిశారు. దీన్ని సహించలేని మోదీ, షాలు కేసీఆర్‌కు చెక్‌పెట్టాలనే దురుద్దేశంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఇతర పథకాల్లో అక్రమాలు జరిగాయంటూ విమర్శలు చేస్తున్నారు. కానీ మిషన్ భగీరథ ప్రారంభోత్సవంలో దాని గొప్పదనాన్ని ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారన్నది మరిచిపోవడం విడ్డూరం. సీఎం కేసీఆర్ దార్శనికతను కొనియాడిన మోదీ-అమిత్ షాలు 2019 ఎన్నికల అనంతరం కేసీఆర్‌పై అక్కసు వెళ్ళగక్కుతుండటం ఖండించదగిన విషయం. నిన్నగాక మొన్న జాతీయ పవర్ కార్పొరేషన్ చైర్మన్ కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించి దేశంలోనే అద్భుతమైన ప్రాజెక్టు అని కొనియాడటం కొసమెరుపు.

సుమారు రూ.40 వేల కోట్లతో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి పటిష్ఠంగా అమలుపరుస్తున్న కేసీఆర్ ప్రభుత్వం దేశంలోనే తెలంగాణను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపింది. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత కరెంటు, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు ముఖ్యంగా రైతుబంధు, రైతుబీమా పథకాలు దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయ సంస్థల చేత ప్రశంసించబడుతున్నాయి. అందుకోసమే 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 51 శాతం ఓట్లతో 88 స్థానాలు గెలిపించుకొని దేశంలో ఒక గొప్ప ప్రజాదరణ కలిగిన నాయకుడిగా గుర్తించబడినారు సీఎం కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం సుమారు 17 శాతం వృద్ధిరేటుతో దేశంలోనే అగ్ర రాష్ట్రంగా అవతరించడం కమలనాథులకు కంటగింపయ్యింది. అందుకే తెలంగాణ ప్రభుత్వ పథకాలపై నడ్డా చేసిన విమర్శల్లో సహేతుకత లేదని చెప్పవచ్చు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు నయా పైసా కూడా అదనంగా ఇవ్వలేదని తెలిసీ రాష్ట్ర బీజేపీ నాయకులు విమర్శలు చేస్తుండటం విడ్డూరం.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ చేస్తున్న అవిరళ కృషి కేంద్రంలోని బీజేపీకి ఇబ్బందిగా మారింది. అందుకే కమలనాథులు విలువలకు తిలోదకాలిచ్చి, సైద్ధాంతిక నిబద్ధతను పక్కనబెట్టి అధికార రాజకీయాలకు పాల్పడుతున్నారు. అందుకే 'నెక్స్ట్ తెలంగాణ' పేరుతో బీజేపీ చేసిన వ్యాఖ్యలకు టీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఘాటైన జవాబు ఇచ్చారు. తెలంగాణ గడ్డ పోరాటాలకు, చైతన్యానికి అడ్డాగా పేర్కొన్న కేటీఆర్ మాటల్లో వాస్తవం ప్రతిబింబిస్తున్నది. తెలంగాణలో పాగా వేయాలనే బీజేపీ పగటి కలలు కల్లలైపోవడం ఖాయం.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com


అమెజాన్ అడవి దగ్ధమవుతుండటంతో భారీగా వెలువడుతున్న పొగ

## అమెజాన్ కార్చిచ్చు.. తీవ్రమైన అత్యయిక స్థితి!

- జర్మనీ ఛాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ ఆందోళన
- జీ7లో ప్రధాన ఎజెండాగా చర్చించనున్నట్టు వెల్లడి

**బెర్లిన్, ఆగస్టు 23:** కార్చిచ్చుతో అమెజాన్ తగులబడిపోతున్నది. వేలాది ఎకరాల్లో అడవులు బుగ్గిపాలవుతుండటంతో వాతావరణంపై ఇది తీవ్ర ప్రభావం చూపనున్నదని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అమెజాన్ అడవుల్లో నెలకొన్న పరిస్థితిపై జర్మనీ ఛాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ స్పందించారు. ఈ విపత్తును తీవ్రమైన అత్యయిక స్థితిగా అభివర్ణించారు. అమెజాన్ కార్చిచ్చు అంశాన్ని ఈ వారాంతంలో జరిగే జీ7 సమావేశంలో పాల్గొనే ప్రపంచ దేశాల అధినేతలతో ప్రధాన ఎజెండాగా చర్చించనున్నట్టు తెలిపారు. ఈ నెల 14న బ్రెజిల్‌లోని ట్రాన్స్-అమెజానియా హైవేలో కొన్ని కిలో మీటర్ల విస్తీర్ణంలో మొదలైన ఈ మంటలు వారం రోజుల వ్యవధిలోనే ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. ఎన్నో అరుదైన వృక్ష జాతులు మంటల్లో ఆహుతవుతుండడం ప్రకృతి ప్రేమికులను కలిచివేస్తున్నది.

## ఆరోసారి రాజ్యసభ ఎంపీగా మన్మోహన్ సింగ్

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత మన్మోహన్ సింగ్(86) ఆరోసారి రాజ్యసభ ఎంపీ అయ్యారు. రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు శుక్రవారం ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. మన్మోహన్ సింగ్ భార్య గురుశరణ్ కౌర్‌తోపాటు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఆ పార్టీ నేతలు రాహుల్‌గాంధీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మన్మోహన్ సుమారు 28 ఏండ్లపాటు అసోం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు.

## నీటిపై అణురియాక్టర్!



'న్యూక్లియర్ టైటానిక్', 'మంచుపై చెర్నోబిల్' అంటూ పర్యావరణ వేత్తలు చేసిన హెచ్చరికలను పెడచెవిన పెడుతూ ప్రపంచంలోనే మొట్టమొదటి తేలియాడే అణు రియాక్టర్‌ను రష్యా శుక్రవారం ప్రారంభించింది. అణు ఇంధనంతో కూడిన 'అకెడెమిక్ లోమోనోసోవ్' రియాక్టర్ 5000 కి.మీ. ఆర్కిటిక్ యాత్రకు బయలుదేరింది. అక్కడ చమురు నిక్షేపాల అన్వేషణకు రష్యా దీన్ని అభివృద్ధి చేసింది. భూమిపై నిర్మించే అణు రియాక్టర్లకు ప్రత్యామ్నాయమని చెబుతున్నది.



# కశ్మీర్ ద్వైపాక్షికమే


ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్‌తో మోదీ కరచాలనం

### మూడో పక్షం జోక్యం తగదు

- ఆ ప్రాంతంలో ఎవరూ హింసను ప్రేరేపించొద్దు
- స్పష్టం చేసిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్
- ప్రధాని మోదీతో సమావేశం
- ఇరు దేశాల మధ్య నాలుగు అవగాహన ఒప్పందాలు

**చంటిల్లీ (ఫ్రాన్స్), ఆగస్టు 23:** కశ్మీర్ వివాదాన్ని భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సూచించారు. ఇందులో మూడో పక్షం జోక్యం చేసుకోవద్దని, ఆ ప్రాంతంలో హింసను ప్రేరేపించొద్దని స్పష్టంచేశారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఫ్రాన్స్‌కు చేరుకున్న భారత ప్రధాని నరేంద్రమోదీతో గురువారం ఆయన పురాతన చటియావ్ డి చంటిల్లీ భవనంలో సమావేశమయ్యారు. దాదాపు 90 నిమిషాలపాటు ఈ భేటీ సాగింది. చర్చల అనంతరం రెండు దేశాలు నాలుగు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. జమ్ముకశ్మీర్‌పై భారత్ తీసుకున్న నిర్ణయం గురించి ప్రధాని మోదీ తనకు వివరించారని సంయుక్త ప్రకటనలో మెక్రాన్ పేర్కొన్నారు. భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షికంగా ఆ సమస్యకు పరిష్కారం కనుగొనాలని, ఈ విషయంలో మూడో పక్షం జోక్యం అనవసరమని సూచించానన్నారు. త్వరలోనే పాకిస్థాన్ ప్రధానితో మాట్లాడుతానన్నారు. 36 రాఫెల్ యుద్ధ విమానాల్లో మొదటి విమానాన్ని వచ్చే నెలలో భారత్‌కు అందిస్తామని మెక్రాన్ తెలిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఫ్రాన్స్‌తో భారత్ సంబంధం స్వార్థంతో కూడుకున్నది కాదని, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో కూడుకున్నదని చెప్పారు. 'రెండు దేశాలూ నిత్యం ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నాయి. సీమాంతర ఉగ్రవాదంపై పోరాటంలో సహకారం అందించినందుకు మెక్రాన్‌కు ధన్యవాదాలు. భద్రత, ఉగ్రవాదంపై పోరులో సహకారాన్ని పెంపొందించుకోవాలని మేం నిర్ణయించాం' అని ప్రధాని పేర్కొన్నారు. వాతావరణ మార్పులను, పర్యావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయని చెప్పారు. భారత్ ప్రతిపాదించిన మేరకు ఉగ్రవాద ముప్పును ఎదుర్కొనే విషయంపై అంతర్జాతీయ సదస్సును త్వరగా నిర్వహించేందుకు కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు. రక్షణ, వాణిజ్యం, అంతరిక్ష రంగంలో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. పారిస్ ఒప్పందం అమలు కోసం సంపన్న దేశాలు గ్రీన్ క్లైమేట్ ఫండ్‌కు నిధులను పెంచాలని కోరారు. కాగా, ఫ్రాన్స్ ప్రధాని ఎడ్వర్డ్ చార్లెస్ ఫిలిప్పీతోనూ మోదీ భేటీ అయ్యారు.

**విమాన మృతుల స్మారకం ప్రారంభం**

1950, 66లో ఫ్రాన్స్‌లోని మౌంట్ బ్లాంక్ పర్వతం వద్ద చోటుచేసుకున్న రెండు ఎయిరిండియా విమాన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన బాధితుల సంస్మరణార్థం ప్రధాని మోదీ శుక్రవారం ఒక స్మారకాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. మౌంట్ బ్లాంక్ దిగువన నిడ్ డి ఐగిల్ వద్ద ఈ స్మారకాన్ని నిర్మించారు. 1966 జనవరిలో జరిగిన ప్రమాదంలో భారత అణు పితామహుడు హోమీ జహంగీర్ బాబాతోపాటు పలువురు భారతీయులు సహా మొత్తం 106 మంది ప్రయాణికులు, 11 మంది విమాన సిబ్బంది మృతిచెందారు. 1950లో చోటుచేసుకున్న ప్రమాదంలో 48 మంది ప్రాణాలు కోల్పోయారు. 'శోకంలోనూ భారత్, ఫ్రాన్స్ ఒక్కటిగా ఉన్నాయి. ఈ రెండు విమాన ప్రమాదాల్లో హోమీ బాబాతోపాటు పలువురు భారతీయులను కోల్పోయాం. వారికి ఘనంగా నివాళి అర్పిస్తున్నాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**యుఏఈకి పయనమైన ప్రధాని మోదీ**

మోదీ శుక్రవారం యుఏఈకి బయలుదేరారు. యుఏఈ యువరాజు షేక్ మొహమ్మద్ బిన్ జయెద్ అల్ నహ్యాన్‌తో మోదీ సమావేశం కానున్నారు. యూఏఈ గతంలో ప్రకటించిన ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ జాయెద్'ను స్వీకరించనున్నారు. అనంతరం ఆయన బహ్రెయిన్ పర్యటనకు వెళ్తారు.


శుక్రవారం పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ

### ఇది 'ఇన్‌ఫ్రా' బంధం

భారత్, ఫ్రాన్స్‌ది 'ఇన్‌ఫ్రా' బంధం అని ప్రధాని మోదీ అన్నారు. ఇండియాలోని 'ఇన్'.. ఫ్రాన్స్‌లోని 'ఫ్రా'.. కలిస్తే 'ఇన్‌ఫ్రా' అని మోదీ కొత్త నిర్వచనం ఇచ్చారు. పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ఆయన భారత సంతతి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. భారత్, ఫ్రాన్స్ ఏదైనా విజయం సాధించినప్పుడు రెండు దేశాల ప్రజలు ఎంతో సంతోషిస్తారని, 2018లో ఫ్రాన్స్ ఫుట్‌బాల్ ప్రపంచకప్ విజేతగా నిలిచినప్పుడు భారత్ అభిమానుల ఆనందమే అందుకు ఉదాహరణ అని చెప్పారు. ఫుట్‌బాల్ క్రీడలో ఫ్రాన్స్‌కున్న అభిమానులు ఫ్రాన్స్ కంటే భారత్‌లోనే ఎక్కువన్నారు. 'ఫుట్‌బాల్‌ను ప్రేమించే దేశానికి నేను వచ్చా. గోల్ ప్రాముఖ్యత ఏంటో మీకు తెలుసు. అత్యున్నత లక్ష్యాన్ని సాధించడమే. గతంలో అసాధ్యమనుకున్న వాటిని మేం గత ఐదేండ్లలో లక్ష్యాలుగా నిర్దేశించుకున్నాం. సమిష్టి కృషితో వాటిని సాధించాం' అని మోదీ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు అఖండ మెజార్టీని కట్టబెట్టింది కేవలం ప్రభుత్వ ఏర్పాటు కోసం కాదని, నవభారత నిర్మాణం కోసమన్నారు. సామ్రాజ్యవాదం, ఫాసిజం, తీవ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ కేవలం తమ దేశంలోనే కాకుండా ఫ్రాన్స్ గడ్డపైనా పోరాడిందన్నారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని (రాజ్యాంగంలో తాత్కాలిక హోదాలో ఉన్న 370 నిబంధనను) రద్దు చేయడాన్ని ప్రస్తావిస్తూ.. 'దేశంలో తాత్కాలికానికి చోటులేదు. గాంధీ, బుద్ధుడు, రాముడు, కృష్ణుడు నడయాడిన భారత్‌కు తాత్కాలిక నిబంధనను తొలిగించేందుకు ఏడు దశాబ్దాలు పట్టింది' అని పేర్కొన్నారు.

## 370 రద్దు మూడో తప్పిదం



- దానితో ఒరిగేదేమీ లేదు
- ఆ నిర్ణయం అప్రజాస్వామికం
- 'డెమోక్రసీ వాల్స్'లో ఎంఐఎం అధ్యక్షుడు ఒవైసీ

**మేడ్చల్ రూరల్:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు ఇప్పటివరకు జరిగిన మూడో తప్పిదమని ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. 1953లో షేక్ అబ్దుల్లాను అరెస్ట్ చేయడం, 1987లో ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడటం తొలి రెండు తప్పిదాలైతే.. తాజాగా 370 ఆర్టికల్ రద్దు మూడో తప్పిదమని చెప్పారు. మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ విద్యాసంస్థల ఆడిటోరియంలో శుక్రవారం ఫేస్‌బుక్ సౌజన్యంతో ది ప్రింట్ యూట్యూబ్ చానల్, వెబ్‌సైట్.. 'డెమోక్రసీ వాల్స్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిలో ఒవైసీతోపాటు ఐపీఎస్ అధికారి రాజేశ్వరి, సోఫియా అష్రఫ్, యాక్టర్ నిమ్రతాకౌర్, ఫ్యాకల్టీ సంస్థ ఫౌండర్ రాజేశ్ దుబ్బుడు పాల్గొని పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఒవైసీ మాట్లాడుతూ.. 370 రద్దుతో అక్కడి ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా, అప్రజాస్వామికంగా ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. దేశంలో ఉగ్రవాదాన్ని అణిచివేయడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, కానీ.. ప్రజల ప్రాథమిక హక్కులను హరించడం సరికాదని చెప్పారు. మైనార్టీలను ద్వితీయశ్రేణి పౌరులుగా చూసే పరిస్థితులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఐపీఎస్ అధికారి రాజేశ్వరి మాట్లాడుతూ సమాజంలో శాంతి, భద్రతల పరిరక్షణకు కమ్యూనిటీ పోలీసింగ్ అవసరమన్నారు. ఫేక్ న్యూస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫ్యాకల్టీస్ సంస్థ ఫౌండర్ రాజేశ్ అన్నారు. సీఎంఆర్ కార్యదర్శి చామకూర గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ పాల్గొన్నారు.

## యూపీ ర్యాగింగ్ కేసులో సీనియర్లపై వేటు

**ఎటావా/ సంబల్‌పూర్:** నూతన విద్యార్థులను ర్యాగింగ్ చేసిన ఏడుగురు సీనియర్ విద్యార్థులు తరగతులకు హాజరు కాకుండా ఉత్తర్‌ప్రదేశ్‌లోని సైఫాయి వైద్యవిశ్వవిద్యాలయం నిషేధం విధించింది. వీరిపై పోలీసులు శుక్రవారం ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. మరోవైపు ఈ ఘటన మీడియాలో రావడంతో కనీసం ఏడాదిపాటు అడ్మిషన్ల నిర్వహణపై ఎందుకు నిషేధం విధించకూడదో తెలుపాలని యూనివర్సిటీకి భారతీయ వైద్య మండలి నోటీసు జారీచేసింది. తొలి సంవత్సరం విద్యార్థులకు బోడిగుండ్లు కొట్టించి హాస్టల్‌లో ప్రదర్శన చేయించిన వీడియో క్లిప్పింగ్‌లు మీడియాలో వచ్చాయి. దీనిపై అధికారులు ఏర్పాటుచేసిన కమిటీ విచారణ జరిపి నివేదికను వర్సిటీ వైస్ చాన్స్‌లర్‌కు అందజేసింది. ర్యాగింగ్‌లో ఏడుగురు సీనియర్లు పాల్గొన్నట్లు రుజువైంది. వారిని మూడు నెలల పాటు తరగతులకు హాజరుకారాదని, హాస్టల్‌లో బస చేయరాదని వీసీ ఆదేశించారు. వారిపై రూ.5000 జరిమానా విధించారు. హాస్టల్‌లో జరుగుతున్న పరిణామాలను తమ దృష్టికి తేనందుకు ఇద్దరు వార్డెన్లను సస్పెండ్ చేశారు. ఇద్దరు సెక్యూరిటీ గార్డులను తొలిగించారు. మరో ఘటనలో జూనియర్లపై ర్యాగింగ్‌కు పాల్పడిన పది మంది విద్యార్థులను ఏడాదిపాటు పరీక్షలు రాయకుండా నిషేధం విధిస్తూ ఒడిశాలోని వీర్ సురేంద్ర సాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నిర్ణయించింది. 52 మందికి రూ.2000 చొప్పున జరిమానా విధించింది.

# చిదంబరానికి ఊరట

- ఈడీ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- సోమవారం వరకు అరెస్ట్ చేయొద్దన్న ధర్మాసనం
- సీబీఐ కస్టడీ అంశంలో జోక్యం చేసుకోని కోర్టు
- రేపటివరకూ సీబీఐ కస్టడీలోనే చిదంబరం

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** ఐఎన్‌ఎక్స్ మీడియా కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరానికి సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ మంజూరుచేసింది. సీబీఐ, ఈడీ కేసులను కలిపి ఈ నెల 26న విచారిస్తామని తెలిపింది. చిదంబరం ఇప్పటికే సీబీఐ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. సీబీఐ కస్టడీకి సంబంధించిన అంశంలో ధర్మాసనం జోక్యం చేసుకోకపోవడంతో సోమవారం వరకు ఆయన కస్టడీ కొనసాగనున్నది. తన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు రద్దు చేయడంపై స్టే విధించాలని కోరుతూ చిదంబరం బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, శుక్రవారం విచారణ జరుపుతామని న్యాయస్థానం పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం జస్టిస్ ఆర్ భానుమతి, ఏఎస్ బొపన్నతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. 'వాదోపవాదాలు విన్న అనంతరం, ఈ కేసులో సహ నిందితులకు ఇప్పటికే బెయిల్ మంజూరైన నేపథ్యంలో పిటిషనర్‌ను (చిదంబరంను) తదుపరి విచారణ వరకు అరెస్ట్ చేయొద్దని ఈడీని ఆదేశిస్తున్నాం' అని పేర్కొన్నారు. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు. ఆ తర్వాత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఒక సీల్డ్ కవర్‌లో ఉన్న పత్రాలను ధర్మాసనానికి అందించబోయారు. ఉత్తర్వులు జారీచేసేముందు వాటిని పరిశీలించాలని కోరారు. ఆయన విన్నపాన్ని ధర్మాసనం తిరస్కరించింది. సోమవారం అందజేయాలని సూచించింది. అంతకుముందు ఈడీ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, చిదంబరం తరపున కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఇదో తీవ్రమైన మనీలాండరింగ్ కేసు అని, అనేక షెల్ కంపెనీల ద్వారా భారీ మొత్తంలో డబ్బు చేతులు మారిందని తుషార్ మెహతా పేర్కొన్నారు. ఆ డబ్బుతో దేశ, విదేశాల్లో ఆస్తులు కొనుగోలు చేసినట్టు ఈడీ గుర్తించిందని, ఈ మేరకు పక్కా ఆధారాలను సేకరించిందని చెప్పారు. మరిన్ని వివరాలను చిదంబరం నుంచి తెలుసుకోవాల్సి ఉన్నదని, కాబట్టి ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. రిమాండ్ నుంచి విడుదల చేసేలా ఎలాంటి ఆదేశాలు జారీ చేయొద్దని విన్నవించారు. కపిల్ సిబల్ స్పందిస్తూ ఈడీ దాఖలు చేసిన పత్రాలను ఆధారంగా చేసుకొని ఢిల్లీ హైకోర్టు చిదంబరం ముందస్తు బెయిల్ పిటిషన్‌ను రద్దు చేసిందని చెప్పారు. కనీసం తమ వాదనలు వినిపించేందుకు అవకాశం కూడా ఇవ్వలేదన్నారు. ఏడు నెలల కిందట ఇచ్చిన తీర్పులోని వాక్యాలనే న్యాయమూర్తి పొల్లుపోకుండా తాజా తీర్పులోనూ పొందుపరిచారని చెప్పారు.

**ఇరకాటంలో సీబీఐ**

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ప్రస్తుతం సీబీఐ కస్టడీలో ఉన్న చిదంబరాన్ని విడుదల చేసేలా ఆదేశాలు జారీచేయాలంటూ ఆయన తరపు న్యాయవాదులు శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ఈడీ పిటిషన్‌తో కలిపి సోమవారం విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొన్నది. వాదనల సందర్భంగా చిదంబరం దర్యాప్తు సంస్థలకు సహకరిస్తున్నారని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ఇరకాటంలో పడింది. ట్రయల్‌కోర్టులో జరిగిన విచారణలో చిదంబరం తమకు సరిగా సహకరించడం లేదని సీబీఐ వాదించింది. ఇదే కారణంతో న్యాయమూర్తి ఆయనకు కస్టడీ విధించారు. అయితే చిదంబరం సహకరిస్తున్నారంటూ తాజాగా ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించడంతో.. సోమవారం నాటి విచారణలో సీబీఐ తన వాదనలకు ఆధారాలు చూపించాల్సి ఉంది.



### ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులోనూ ఊరట

ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో చిదంబరం, ఆయన కుమారుడు కార్తీ చిదంబరానికి ఢిల్లీ హైకోర్టు ఊరట కల్పించింది. వచ్చే నెల 3వ తేదీ వరకు ముందస్తు బెయిల్‌ను పొడిగించింది. అప్పటివరకు సీబీఐ, ఈడీ ఆయనను అరెస్ట్ చేయవద్దని ప్రత్యేక న్యాయమూర్తి ఓపీ సైనీ ఆదేశించారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నదని, కాబట్టి ఈ కేసు విచారణను వాయిదా వేయాలన్న ఈడీ, సీబీఐ ప్రతిపాదనను న్యాయమూర్తి తిరస్కరించారు. 'మీరు దాఖలు చేసిన పత్రాల ప్రకారం విచారణలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. అయినా వాయిదా ఎందుకు కోరుతున్నారు? ఏడాదికాలంగా మీరు ఇలాగే చేస్తున్నారు. ఇవన్నీ ఇబ్బందికరంగా ఉన్నాయి' అని ఈడీ, సీబీఐపై అసహనం వ్యక్తం చేశారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసు,ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసు వేర్వేరని చెప్పారు. ఇవి విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ (ఎఫ్ఐపీబీ) అక్రమంగా జారీ చేసిన అనుమతులకు సంబంధించినవేనని సీబీఐ వాదించగా, ఎఫ్ఐపీబీకి సంబంధించి వందలాది కేసులు నమోదవుతూ ఉంటాయని, వాటన్నింటినీ ఒకేగాటన కట్టలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు.



### 'ఐఎన్‌ఎక్స్' ఉల్లంఘనలు ఎఫ్‌ఐపీబీ దృష్టికి రాలేదు

- ఆర్బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 23:** ఐఎన్‌ఎక్స్ మీడియాలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించే విషయంలో అక్రమాలు జరిగినట్టు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థకు (ఎఫ్‌ఐపీబీ) ఎలాంటి సమాచారం లేదని ఆర్థిక వ్యవహారాల విభాగం మాజీ కార్యదర్శి, ఆర్బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు పేర్కొన్నారు. ఆయన గతంలో ఈడీకి ఇచ్చిన సమాధానంలో ఈ మేరకు పేర్కొన్నారు. ఆ పత్రాలను పీటీఐ వార్తాసంస్థ సేకరించింది. వాటి ప్రకారం.. 'ఐఎన్‌ఎక్స్ మీడియాలోకి ఎఫ్‌డీఐల అనుమతులకు సంబంధించి ఎలాంటి ఉల్లంఘనలు బోర్డు దృష్టికి రాలేదు' అని పేర్కొన్నారు. కంపెనీలో డౌన్ స్ట్రీమింగ్ జరిగినట్టు నిర్ధారణ అయితే మాత్రం అది కచ్చితంగా ఉల్లంఘనల కిందికి వస్తుందని సుబ్బారావు పేర్కొన్నారు.

## ఆ కంపెనీల లావాదేవీల వివరాలివ్వండి

- ఐఎన్‌ఎక్స్ కేసులో ఐదు దేశాలకు సీబీఐ అభ్యర్థనలు

**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీల పెట్టుబడులు, చెల్లింపులకు సంబంధించిన అంతర్జాతీయ లావాదేవీల వివరాలను కోరుతూ సీబీఐ ఐదు దేశాలకు న్యాయపరమైన అభ్యర్థనలను పంపింది. బ్రిటన్, సింగపూర్, మారిషస్, బెర్ముడా, స్విట్జర్లాండ్‌లకు ఇటీవల ఎల్ఆర్‌లను (లెటర్ రొగేటరీ- సమాచారం కోసం భారత్‌లోని కోర్టు విదేశీ కోర్టుకు పంపే అభ్యర్థన) పంపినట్లు అధికారులు తెలిపారు. రూ.305 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అందుకునేందుకు ఐఎన్‌ఎక్స్ మీడియాకు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎఫ్‌ఐపీబీ) అనుమతి మంజూరు చేయడంలో అక్రమాలకు సంబంధించి కేంద్ర మాజీ మంత్రి చిదంబరాన్ని సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మారిషస్‌కు చెందిన మూడు కంపెనీల (డున్‌ఎర్న్, ఎన్‌ఎస్‌ఆర్-పీఈ, న్యూవెర్నాన్ ప్రైవేట్ ఈక్విటీ లిమిటెడ్) నుంచి ఐఎన్‌ఎక్స్ మీడియా విదేశీ పెట్టుబడులు పొందిందని, దీంతో ఈ మూడు కంపెనీలపై సీబీఐ దృష్టిసారించిందని అధికారులు తెలిపారు. అలాగే కార్తీ చిదంబరానికి చెందినవిగా భావిస్తున్న అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్, చెస్ మేనేజ్‌మెంట్ కంపెనీల విదేశీ లావాదేవీలపైనా దృష్టిసారించినట్లు చెప్పారు. మరోవైపు సీబీఐ శుక్రవారం చిదంబరాన్ని సుమారు ఆరుగంటలపాటు విచారించింది. రాజ్యసభ ఎంపీగా ఆయన హోదాకు భంగం కలుగకుండా వ్యవహరిస్తున్నామని ఒక అధికారి తెలిపారు. శుక్రవారం చిదంబరాన్ని ఆయన భార్య నళిని, కుమారుడు కార్తీ కలిశారు. అనంతరం కార్తీ మాట్లాడుతూ.. తాను గానీ, తన తండ్రిగానీ ఎలాంటి తప్పు చేయలేదని, నిర్దోషులుగా బయటపడుతామని చెప్పారు.

### చిదంబరానికి బెయిల్ నిరాకరించిన.. ఢిల్లీ హైకోర్టు జడ్జి పదవీవిరమణ



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం అరెస్ట్‌కు ముందు బెయిల్ నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సునిల్ గౌర్ గురువారం పదవీ విరమణ చేశారు. హైకోర్టు జడ్జిగా 11 ఏండ్ల పాటు సేవలందించిన ఆయనకు ఢిల్లీ హైకోర్టు న్యాయవాదులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఐఎన్‌ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న చిదంబరాన్ని సీబీఐ అధికారులు బుధవారం రాత్రి ఆయన ఇంటి గోడ దూకి లోనికి ప్రవేశించి అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే అరెస్ట్‌కు ముందు బెయిల్ కోసం ఢిల్లీ హైకోర్టులో ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బుధవారం ఢిల్లీ హైకోర్టులో సునిల్ గౌర్ చిదంబరం దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు.

## దీటైన జవాబు ఇస్తాం!

- అమెరికా క్షిపణి ప్రయోగంపై పుతిన్ నిప్పులు

**మాస్కో, ఆగస్టు 23:** నిషేధించిన క్రూయిజ్ క్షిపణిని ప్రయోగాత్మకంగా పరీక్షించిన అమెరికాపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిప్పులు చెరిగారు. అమెరికా చర్యలకు దీటైన జవాబిస్తామని వెల్లడించారు. నిషేధిత క్షిపణిని ప్రయోగించిన అమెరికా చర్యలకు సరైన జవాబు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని సైన్యాన్ని ఆదేశించారు. 'అమెరికా చర్యల వల్ల మన దేశానికి జరుగబోయే ముప్పును సమగ్ర స్థాయిలో ఎదుర్కొని, దీటైన జవాబు ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలి' అని ఆయన సైన్యానికి పిలుపునిచ్చారు. మధ్యశ్రేణి అణ్వాయుధ ప్రయోగ నిషేధ ఒప్పందం (ఐఎన్‌ఎఫ్)-1987 నిషేధించిన ఓ క్రూయిజ్ క్షిపణిని సోమవారం ప్రయోగాత్మకంగా పరీక్షించినట్టు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం తెలిపింది. అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యమున్న ఈ క్షిపణి 500 కి.మీ దూరంలోని నిర్దేశిత లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిందని కూడా పేర్కొంది. అమెరికా ప్రయోగాన్ని రష్యాతో పాటు చైనా కూడా తీవ్రంగా వ్యతిరేకించింది.

### వ్యాన్‌పై పడిన ట్యాంకర్.. 9 మంది మృతి

**జైపూర్, ఆగస్టు 23:** ఓ గ్యాస్ ట్యాంకర్ అదుపుతప్పి వ్యాన్‌పై పడింది. దీంతో వ్యానులో ప్రయాణిస్తున్న 9 మంది మృతి చెందారు. రాజస్థాన్‌లోని రాజసమంద్ జిల్లాలోని దేసురి కాలువ వద్ద శుక్రవారం ఈ ఘటన జరిగింది. వ్యాన్‌ను దాటి వెళ్లేందుకు గ్యాస్ ట్యాంకర్ డ్రైవర్ ప్రయత్నించి అదుపుకోల్పోవడంతో దానిపై పడిపోయినట్లు ఏఎస్పీ రాజేశ్ కుమార్ గుప్తా తెలిపారు. ఈ ప్రమాదంలో వ్యానులో ప్రయాణిస్తున్న రెండు కుటుంబాలకు చెందిన 9 మంది మరణించినట్లు వెల్లడించారు.

## నేడు కశ్మీర్‌కు ప్రతిపక్ష నేతలు

శాంతికి విఘాతం కలుగుతుంది.. రావొద్దన్న రాష్ట్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ:** పలు పార్టీలకు చెందిన ప్రతిపక్ష నాయకులు శనివారం జమ్ముకశ్మీర్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలతో సమావేశం కానున్నారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు భారీగా బలగాలను మోహరించడంతోపాటు ఆంక్షలను కూడా విధించింది. రాష్ట్ర రాజకీయ నాయకులను నిర్బంధంలో ఉంచింది. ఈ నేపథ్యంలో తొలిసారిగా ప్రతిపక్ష నేతలు శనివారం జమ్ముకశ్మీర్‌లో పర్యటించనున్నారు. ఈ బృందంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, ఎన్సీపీ, టీఎంసీ, డీఎంకే పార్టీలకు చెందినవారు ఉండనున్నారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కూడా వెళ్లే అవకాశం ఉంది. ఈ బృందం తొలుత శ్రీనగర్‌ను సందర్శిస్తుంది. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు వెళ్లడానికి అధికారులు అనుమతిస్తే ఆయా ప్రాంతాల్లోనూ పర్యటిస్తుంది. మరోవైపు ప్రతిపక్ష నేతలు కశ్మీర్‌లో పర్యటించడం వల్ల శాంతికి విఘాతం కలిగే అవకాశముందని, కాబట్టి పర్యటనకు రావొద్దని జమ్ముకశ్మీర్ ప్రభుత్వం సూచించింది. 'ఇప్పుడిప్పుడే కశ్మీర్‌లో శాంతి క్రమంగా నెలకొంటున్నది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేతలు కశ్మీర్‌లో పర్యటిస్తే శాంతికి విఘాతం కలిగే అవకాశముంది. కాబట్టి నాయకులు ఇక్కడికి రావొద్దని విజ్ఞప్తి చేస్తున్నాం' అని అధికారులు పేర్కొన్నారు. ఇంకోవైపు చెదురుమదురు నిరసనలు మినహా శ్రీనగర్‌తోపాటు కశ్మీర్ లోయలో శుక్రవారం మధ్యాహ్న ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ప్రార్థనలు ముగిసిన తర్వాత శ్రీనగర్ నగర శివారులో 300 మంది నిరసనకు దిగారు. అయితే వారికి నచ్చజెప్పడంతోపాటు స్వల్ప లాఠీచార్జీ చేసి చెదరగొట్టామని అధికారులు తెలిపారు.

### 'పతంజలి' బాలకృష్ణకు అస్వస్థత

రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో చేరిక



**రిషికేశ్:** యోగా గురువు బాబా రాందేవ్‌కు అత్యంత సన్నిహితుడు, పతంజలి యోగ్‌పీఠ్ అధిపతి బాలకృష్ణ (47) అనారోగ్యంతో శుక్రవారం రిషికేశ్‌లోని ఎయిమ్స్ దవాఖానలో చేరారు. ఛాతి నొప్పితోపాటు తల తిరగడంతో దవాఖానలో చేరారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ బ్రహ్మ ప్రకాశ్ చెప్పారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఓ భక్తుడు ఇచ్చిన ఆహారం తిన్న అనంతరం బాలకృష్ణకు ఫుడ్ పాయిజన్ లక్షణాలు కనిపించాయని బాబా రాందేవ్ వీడియో సందేశంలో తెలిపారు.

## తలాక్‌పై కేంద్రానికి నోటీసులు

- చట్టం చెల్లుబాటు అంశాన్ని పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులు ఇవ్వడాన్ని నేరంగా పరిగణించే ముస్లిం మహిళల (వివాహ పరిరక్షణ) చట్టం-2019 చెల్లుబాటును పరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. రాజ్యాంగ నిబంధనలను ఈ చట్టం ఉల్లంఘిస్తున్నదని, దీన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లపై స్పందన తెలియజేయాలని జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ అజయ్ రస్తోగితో కూడిన ధర్మాసనం శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఒక పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ వాదనలు వినిపిస్తూ.. ట్రిపుల్ తలాక్ విధానాన్ని నేరంగా పరిగణించడం, మూడేండ్లు జైలు శిక్ష విధించడం వంటి వాటిపై కోర్టు పరిశీలన చేయాలన్నారు. ట్రిపుల్ తలాక్‌ను ఇదివరకే సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ మళ్లీ దీన్ని నేరంగా పరిగణించడంపై పిటిషనర్లలో ఆందోళన నెలకొందన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఒక మతాచారాన్ని రద్దు చేసినప్పటికీ, వరకట్నం, బాల్య వివాహాల మాదిరిగా నేరంగా ప్రకటించినప్పటికీ, ఆ దురాచారం కొనసాగుతుంటే ఏం చేయాలని ప్రశ్నించింది. దీనికి ఖుర్షీద్ స్పందిస్తూ.. వివిధ అంశాలను అధ్యయనం చేయాలని, ట్రిపుల్ తలాక్ అంశంలో రాజ్యాంగ ధర్మాసనం ఆ ఆచారం చెల్లదని స్పష్టం చేసిందని పేర్కొన్నారు.

**మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు**

ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No. 9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

# కారణం లేకపోయినా కొర్రీలు

కాస్తులో ఉన్నా రికార్డులోకి ఎక్కని 9.29 ఎకరాలు

- వారసత్వ భూమికి ఆధారాలు చూపినా పట్టని రెవెన్యూ సిబ్బంది
- కోర్టులో ఉన్నదంటూ దాటవేస్తున్న అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి బాధిత సోదరులు కల్లూరి మల్లేశ్, చంద్రమౌళి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం నర్కొండకర్‌నగర్‌కు చెందిన కల్లూరి మల్లేశ్, కల్లూరి చంద్రమౌళి ఇద్దరు అన్నదమ్ములు. చుంచుపల్లి పరిధిలోని విద్యానగర్‌కాలనీ సర్వే నంబర్ 137/2/ఆలో తాతల నుంచి వారసత్వంగా వచ్చిన 9.29 ఎకరాల భూమిని 65 ఏండ్లుగా కాస్తులో ఉంటూ సాగు చేసుకొంటున్నారు. భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా తమ పేరిట భూమి నమోదుచేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని అధికారులకు దరఖాస్తు చేసుకొన్నారు. మొత్తం 9.29 ఎకరాలకుగాను రెవెన్యూ అధికారులు 4.35 ఎకరాలు కల్లూరి మల్లేశ్ పేరిట ప్రొసీడింగ్ ద్వారా మ్యాన్యువల్ పహాణీలో ఎక్కించారు. కానీ, అందులో తండ్రి పేరును సంజీవరావుకు బదులు కొమరయ్య అని తప్పుగా ఎక్కించారు. వారసత్వ భూమి అని కాకుండా, కొన్న భూమి అని రికార్డుల్లో నమోదుచేశారు. మిగతా 4.34 ఎకరాల భూమిని కల్లూరి చంద్రమౌళి పేరిట ఎక్కించలేదు. ఇదేమని అడిగితే సర్వే నంబర్ తప్పు అని, ఆర్డీవో కోర్టులో తేల్చుకోవాలని రెవెన్యూ అధికారులు ఉచిత సలహా ఇచ్చారు. 1955 మే 24న చుట్టుపక్కల ఉన్న 60 ఎకరాల భూమిని రైతులు పార్టీషన్ డీడ్‌తో పంచుకొన్నారు. ఆ పార్టీషన్ డీడ్‌ను చూపించినా అధికారులు పట్టించుకోవడం లేదు. చుట్టుపక్కల భూములన్నింటినీ యజమానుల పేరిట సర్వే నంబర్లు సరిచేసి పాస్‌పుస్తకాలు అందించిన తాసిల్దార్.. తమ భూమి విషయంలో కుంటిసాకులు చూపడంపై కల్లూరి సోదరులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



### చెప్పులరిగేలా తిరుగుతున్నాం

కాస్తులో ఉండి ఏండ్లతరబడి సాగుచేసుకొంటున్నా హక్కుపత్రాలు లేని దైన్యం మాది. మా తండ్రి సంజీవరావు పేరిట ఉన్న భూమిని ఆయన చనిపోయిన నాటినుంచి మా పేరిట ఎక్కించాలని ఇద్దరం తాసిల్ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. గ్రీవెన్స్‌డేలో కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందించాం. అయినా మా సమస్యకు ఇంతవరకు పరిష్కారం లభించలేదు. సర్వే నంబర్లు 137/1, 137/3ఆ, 137/4ఆ, 137/5ఆ, 137/6ఆ, 137/7ఆ, 137/8ఆ, 137/9ఈలలో ఉన్న 18 ఎకరాల భూమి ట్రైబల్ వెల్ఫేర్ కోర్టులో ఉన్నది. దానిని సాకుగా చూపించి 137/2ఆలో ఉన్న మా భూమికి తాసిల్దార్ పట్టాచేయడం లేదు.

**- కల్లూరి మల్లేశ్, చంద్రమౌళి, బాధిత సోదరులు**

### కోర్టులో పెండింగ్ ఉన్నది

ఈ భూమి సమస్య ట్రైబల్ వెల్ఫేర్ కోర్టులో పెండింగ్‌లో ఉన్నది. దీనిపై పలుమార్లు కల్లూరి మల్లేశ్, కల్లూరి చంద్రమౌళి నన్ను కలిసిన మాట వాస్తవమే. కానీ, కోర్టులో పెండింగ్ ఉన్నందున మేము ఏమీ చేయలేకపోతున్నాం. ఈ సర్వే నంబర్‌పై ఆర్డీవో కోర్టులో తేల్చుకోవాలి.

**- నాగుబాయి, చుంచుపల్లి తాసిల్దార్**



చిల్లంచర్లలో బాధిత రైతు ఎల్డి మల్లయ్యతో మాట్లాడుతున్న ఆర్డీవో ఈశ్వరయ్య

## ఎల్డి మల్లయ్యకు అందిన 1-బీ

- 'పైసలిచ్చినోళ్లకే పట్టా' కథనానికి స్పందన
- తప్పుచేసినవారిపై చర్యలు తప్పవన్న తొర్రూరు ఆర్డీవో ఈశ్వరయ్య

**మరిపెడ, నమస్తే తెలంగాణ:** 'పైసలిచ్చినోళ్లకే పట్టా' శీర్షికతో శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి మహబూబాబాద్ జిల్లా అధికారులు స్పందించారు. విచారణ అనంతరం బాధిత రైతు ఎల్డి మల్లయ్యకు 1-బీ పత్రాన్ని అందజేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం గ్రామానికి చెందిన ఎల్డి మల్లయ్య పక్క ఊరు చిల్లంచర్ల శివారులోని సర్వే నంబర్ 439/ఆ/1లో ఐదెకరాల భూమిని 44 ఏండ్ల నుంచి సాగుచేసుకొంటున్నారు. 1975లోనే జమాబంది ద్వారా పట్టాచేసుకొన్నారు. రైతుకు తోక పట్టాతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు జారీచేసిన పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఉన్నది. ఇవన్నీ ఉన్నా మల్లయ్యకు కొత్త పాస్‌పుస్తకం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి వేరే వాళ్లకు ఇచ్చారు. దీనిపై కథనం ప్రచురితమవడంతో స్పందించిన జిల్లా కలెక్టర్.. విచారణ చేపట్టాలని తొర్రూరు ఆర్డీవో ఈశ్వరయ్యను ఆదేశించారు. తాసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆర్డీవో చిల్లంచర్ల గ్రామానికి చేరుకొని రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి చుట్టుపక్కల పొలాల రైతులను విచారించారు. అనంతరం ఈ భూమి ఎల్డి మల్లయ్యదేనని గుర్తించారు. తప్పుచేసినవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకొంటామని ఆర్డీవో తెలిపారు. ఇతరులకు పంపిణీచేసిన ఈ భూమి పాస్‌పుస్తకాలను రిబోక్‌చేసిన ఆర్డీవో.. భూమికి సంబంధించి మల్లయ్యకు 1-బీ పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు మల్లయ్య మాట్లాడుతూ.. తాను 'నమస్తే తెలంగాణ' యజమాన్యానికి ఎంతో రుణపడి ఉంటానని, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## షాపూర్ వీఆర్వో సస్పెన్షన్



భూమన్న

**నందిపేట్ రూరల్:** నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం షాపూర్ వీఆర్వో భూమన్నను ఉన్నతాధికారులు సస్పెండ్‌చేశారు. గత సోమవారం గ్రామానికి చెందిన మహిళా రైతు రాజుబాయి తాసిల్ కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్‌లో పేరు మార్చేందుకు రూ.10 వేలు ఇచ్చానని, అయినా పనిచేయడంలేదంటూ వీఆర్వోను నిలదీశారు. దీనిపై మంగళవారం 'పైసలిచ్చినా పనిచేయవా?' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు బాధితురాలికి న్యాయం చేశారు. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం శుక్రవారం వీఆర్వోను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## కొత్త పాస్‌పుస్తకం ఇస్తలేరు



బాధితుడు నగేశ్

**చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి పరిధిలోని బిల్డింగ్‌తండాకు చెందిన రమావత్ నగేశ్ 2006లో గ్రామంలో సర్వే నంబర్లు 108/1లో ఎకరం, 105/అ-1/2లో 8 గుంటలు, 108/1-1లో 10 గుంటలు మొత్తం 1.18 ఎకరాలు కొని రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. పాత పాస్‌పుస్తకాలు కూడా ఉన్నాయి. భూరికార్డుల ప్రక్షాళనలో కొత్త పాస్‌బుక్ రాలేదు. నగేశ్ తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు కనికరించడం లేదు. అన్ని ఆధారాలు చూపించినా మూడేండ్లుగా తిప్పుకొంటున్నారు. ఈ విషయమై వీఆర్వో శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. త్వరలో కొత్త పాస్‌పుస్తకం అందేవిధంగా చూస్తామని చెప్పారు.

# వృద్ధుడి భూమి అన్యాక్రాంతం

- సారంగాపూర్ రెవెన్యూ అధికారుల నిర్వాకం
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన నిర్మల్ జిల్లా బాధితుడు అర్జన్న

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఓ ఎనభై ఏండ్ల వృద్ధుడికి వారసత్వంగా సంక్రమించిన భూమిని రెవెన్యూ అధికారులు మరోవ్యక్తి పేరుమీదకు బదలాయించారు. ఉన్న భూమంతా అన్యాక్రాంతం కావడంతో ఆ వృద్ధ రైతు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం కౌట్లా (బుజుర్గ్) గ్రామానికి చెందిన తీగల అర్జన్నకు సర్వే నంబర్ 693/1లో తండ్రి భీమన్న నుంచి వారసత్వంగా వచ్చిన 2.18 ఎకరాల భూమి ఉన్నది. అర్జన్నకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అర్జన్న తన భూమిలో సోయా, పత్తి పంటలను సాగు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ భూమికి పాస్‌పుస్తకం, పహాణీ కూడా ఉన్నాయి. భూరికార్డుల ప్రక్షాళన తర్వాత అధికారులు కొత్త పాస్‌పుస్తకం కూడా జారీచేశారు. మొదటి విడుతలో రైతుబంధు సాయం కింద రూ.9,850 చెక్కు కూడా వచ్చింది. కానీ రెండో విడుత రైతుబంధు డబ్బులు మంజూరు కాకపోవడంతో అధికారులను సంప్రదించగా, భూమి అర్జన్న పేరిట లేదని చెప్పారు. దీంతో మీ సేవలో పహాణీ తీయించగా.. గ్రామ మాజీ సర్పంచ్ తీగల మోహన్ పేరిట పట్టా అయినట్టు తేలింది. తాను విక్రయించకుండానే ఆ భూమిని రెవెన్యూ అధికారులు తీగల మోహన్ పేరిట పట్టాచేశారంటూ బాధిత రైతు అర్జన్న 'ధర్మగంట'ను ఆశ్రయించారు. రెవెన్యూ అధికారులు మాజీ సర్పంచ్‌తో కుమ్మక్కై తన భూమిని అక్రమంగా అతడికి కట్టబెట్టారని ఆరోపించారు. దీనిపై కౌట్ల వీఆర్వో ప్రకాశ్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. పొరపాటుగా మోహన్ పేరిట పట్టా అయిఉంటుందని.. విచారణ జరిపి సరి చేస్తామని చెప్పారు.



## ఎట్టకేలకు అమలైన హైకోర్టు ఉత్తర్వులు

- 'హైకోర్టు తీర్పిస్తే నాకేంటి?' కథనానికి స్పందన
- బొమ్మాయిపల్లిలో భూమి సరోజినిదేవిదేనని తేల్చిన అధికారులు
- తాసిల్దార్ డిజిటల్ సైన్‌చేయడంతో సీసీఎల్‌ఏ నుంచి రిస్టోర్

**యాదాద్రి భువనగిరి జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ:** 'హైకోర్టు తీర్పిస్తే నాకేంటి?' శీర్షికతో మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించి బాధితురాలికి న్యాయంచేశారు. దివంగత సినీనటి ప్రత్యూష తల్లి పాదరాజు సరోజినిదేవికి చెందాల్సిన బొమ్మాయిపల్లిలోని సర్వే నంబర్ 10/ఆ/2లోని ఎకరం భూమి విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును.. యాదాద్రి భువనగిరి జిల్లా అధికారుల ఆదేశంతో భువనగిరి తాసిల్దార్ జనార్దన్ రెడ్డి అమలుచేశారు. భూమిపై సరోజినిదేవికి పూర్తి హక్కు సంక్రమించేలా సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో ఉంచిన పెండింగ్‌ను తొలగించి రీస్టోర్ చేసేందుకు శుక్రవారం డిజిటల్ సైన్‌చేశారు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దేపనిని కూడా పూర్తి చేశారు. మంగళవారం ఈ సమస్యపై కథనం ప్రచురితమవడంతో స్పందించిన కలెక్టర్ అనితారామచంద్రన్.. ఈ సర్వే నంబర్‌లోని భూమిపై సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని భువనగిరి ఆర్డీవో గార్లపాటి వెంకటేశ్వర్లును ఆదేశించారు. విచారణచేసిన ఆర్డీవో నివేదిక ఆధారంగా సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో ఉంచిన పెండింగ్‌ను తొలగించి రీస్టోర్‌చేశారు. ఎట్టకేలకు హైకోర్టు ఉత్తర్వులు రెవెన్యూ అధికారులు అమలు చేయడంతో సరోజినిదేవి 'నమస్తే తెలంగాణ'కు, జిల్లా కలెక్టర్‌కు, భువనగిరి ఆర్డీవోకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

## మైక్రోసాఫ్ట్, ఐఎస్బీ ఒప్పందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృత్రిమ మేధస్సు ఆధారంగా భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మైక్రోసాఫ్ట్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్బీ) ముందుకొచ్చాయి. ఈ రంగాల్లో ఔత్సాహికులకు శిక్షణ అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఐఎస్బీ డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర శ్రీవాత్సవ, మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ అనంత్ మహేశ్వరి శుక్రవారం హైదరాబాద్‌లోని ఐఎస్బీ ప్రాంగణంలో ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా అనంత్ మహేశ్వరి మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు ఐఎస్బీ, మైక్రోసాఫ్ట్ సంయుక్తంగా కృషిచేయనున్నాయని వెల్లడించారు. రాజేంద్ర శ్రీవాస్తవ మాట్లాడుతూ.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మేనేజర్లను రూపొందించేందుకు ఐఎస్బీ సిద్ధమవుతున్నదని చెప్పారు.

## లండన్‌లో తెలంగాణ విద్యార్థి అదృశ్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లండన్‌లో పీజీ చదువుతున్న ఖమ్మం జిల్లావాసి సన్నె ఉజ్వల్ శ్రీ హర్ష శుక్రవారం నుంచి కనిపించడం లేదు. దీనిపై లండన్‌లో మిస్సింగ్ కేసు నమోదైందని అక్కడి పోలీసులు ఖమ్మంలోని ఆయన కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. జీవీమాల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు ద్వారా విషయం తెలుసుకున్న ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు.. ఫోన్‌లో శ్రీహర్ష తండ్రి ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సన్నె ఉదయ్‌ప్రతాప్, బంధువులతో మాట్లాడారు. విదేశాంగశాఖ అధికారులతో, లండన్‌లో ఉన్న తెలుగువారితో మాట్లాడుతానని, కేంద్రానికి లేఖరాసి.. హర్ష ఆచూకీ కనుగొనేందుకు కృషి చేస్తానని చెప్పారు.

## రేపు ఆయుర్వేద జాతీయ సదస్సు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఆయుర్వేదం ద్వారా చర్మవ్యాధుల నివారణ, వ్యాధి నిరోధక విజ్ఞానం తదితర అంశాలపై ఆదివారం జాతీయ సదస్సును నిర్వహించనున్నట్టు విశ్వ ఆయుర్వేద పరిషత్ తెలంగాణ విభాగం అధ్యక్షుడు డాక్టర్ ఏ సమ్మిరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజయ్ గణేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. పంజాగుట్టలోని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో ఆదివారం ఉదయంనుంచి సాయంత్రం వరకు సదస్సు నిర్వహిస్తామన్నారు.

# సీజనల్ వ్యాధులకు చెక్

- అన్నిచోట్లా అందుబాటులో మందులు
- వైద్యాధికారులతో సమీక్షలో మంత్రి ఈటల రాజేందర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా వైద్యశాఖలోని అన్ని విభాగాలు అప్రమత్తం కావాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో పబ్లిక్ హెల్త్, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, ఇతర వైద్యాధికారులతో రాష్ట్రంలో చేపట్టిన వైద్య సహాయక చర్యలు, ముందస్తు ఏర్పాట్లపై ఈటల సమీక్షించారు. ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధులను అడ్డుకునేందుకు వైద్యారోగ్యశాఖ ప్రణాళికలు సిద్ధంచేసిందని చెప్పారు. కిందిస్థాయిలో వైద్య విభాగాలను అప్రమత్తం చేసి, నిరంతర పర్యవేక్షణ కోసం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలో 24 గంటలపాటు ప్రత్యేక విభాగాన్ని, రాష్ట్ర, జిల్లాస్థాయిలో 33 బృందాలను ఏర్పాటుచేశామని ఈటల వెల్లడించారు. 33 జిల్లాల్లోని ప్రయోగశాలల్లో డయాగ్నోస్టిక్ కిట్లు, వైద్యశాలల్లో తగినన్ని మందులు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించినట్టు ఈటల తెలిపారు.

### వైద్యశాఖ అప్రమత్తం.. చర్యలు వేగవంతం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, మలేరియా నిర్ధారణ కిట్లను, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు.
- వరద నీరు చేరే ప్రాంతాల్లో అవసరానికంటే ఎక్కువ మందులను పెట్టారు.
- అత్యవసర పరిస్థితుల్లో తరలించేందుకు అదనంగా అంబులెన్సులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.
- సీజనల్ వ్యాధుల అనుమానితులకు ఇండ్ల వద్దే మలేరియా, డెంగ్యూ, జ్వర నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు.
- రాష్ట్రస్థాయిలో అంటువ్యాధుల నిర్మూలన కేంద్రం ద్వారా 24 గంటలు పర్యవేక్షిస్తున్నారు.
- ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా ఆరోగ్యకార్యకర్తల ద్వారా ఆయా ప్రాంతాల్లో విస్తరించే సీజనల్ వ్యాధుల సమాచారాన్ని సేకరిస్తారు.
- గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు విస్తృత ప్రచారం చేపడుతారు.
- గ్రామాల్లో తాగునీటి నాణ్యతను పరీక్షిస్తారు. తాగునీటి ద్వారా వ్యాధులు ప్రబలకుండా దృష్టిసారించారు.

కీసర రిజర్వు ఫారెస్ట్



## కీసర ఫారెస్ట్ అభివృద్ధికి ప్రణాళిక

- రూ.2.9 కోట్లతో ప్రతిపాదనలు!
- 29న మొక్కలు నాటనున్న ఎంపీ సంతోష్‌కుమార్

**మేడ్చల్ జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ దత్తతతో కీసర రిజర్వు ఫారెస్ట్ దశ మారనుంది. ఈ ఫారెస్ట్‌ను ఎంపీ తన సొంత నిధులతో తొలిదశలో రూ.2.9 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు జిల్లా అటవీ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు (జూలై 24వ తేదీ)న 'గిఫ్ట్ ఏ స్మైల్' నినాదంతో స్ఫూర్తిపొందిన సంతోష్‌కుమార్ కీసర ఫారెస్ట్‌ను దత్తత తీసుకున్న సంగతి విధితమే. సంతోష్‌కుమార్ ఈ నెల 29న మంత్రి మల్లారెడ్డితో కలిసి కీసర రిజర్వు ఫారెస్ట్‌లో మొక్కలు నాటనున్నారు. దీన్ని అర్బన్ లంగ్స్ పార్కుగా అభివృద్ధి చేయడంపై అధికారులతో చర్చించనున్నారు.

## వ్యాక్సినేషన్‌లో తెలంగాణ టాప్

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వెల్లడి.. రోటా వైరస్ వ్యాక్సిన్‌కు ప్రణాళికలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యాక్సినేషన్‌లో దేశంలోనే తెలంగాణ టాప్‌గా నిలిచింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్) ప్రకారం దేశవ్యాప్తంగా వ్యాక్సిన్ల వాడకం 62 శాతం ఉండగా.. తెలంగాణలో 67.5 శాతం ఉన్నట్టు వెల్లడయింది. ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం వ్యాక్సినేషన్‌లో రాష్ట్రం ముందంజలో ఉన్నది. నవజాత శిశువులకు వివిధ రకాల వ్యాధుల నుంచి రక్షణ కోసం ప్రభుత్వం కొత్త వ్యాక్సిన్లను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధంచేసింది. యూనివర్సల్ వ్యాక్సిన్ కార్యక్రమంలో భాగంగా రోటా వైరస్ వ్యాక్సిన్‌ను రాష్ట్రంలోని చిన్నారులకు అందించేందుకు వైద్యశాఖ కార్యాచరణ చేపట్టింది. ఈ ఏడాదే టీడీ వ్యాక్సిన్‌ను తీసుకురాగా, రోటా వైరస్ వ్యాక్సిన్‌ను వచ్చేనెల సెప్టెంబర్‌లో అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. 2.5 మి.లీ. రోటా వైరస్ వ్యాక్సిన్ 6 మి.లీ. ఓరల్ సిరంజితో నోటి ద్వారా చిన్నారులకు ఇస్తారు. ఏడాది లోపల పిల్లలకు రోటా వైరస్ వ్యాక్సిన్ మొదటి మోతాదును ఇవ్వాల్సి ఉంటుంది. నాలుగు వారాల వ్యవధిలో రోటా వైరస్ టీకాను 3 మోతాదుల్లో ఇస్తే.. నవజాత శిశువులు రోగ నిరోధక శక్తిని పొందగలుగుతారు.



## రేపు ఐలమ్మ విగ్రహావిష్కరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాగార్జునసాగర్‌లో ఆదివారం (ఈ నెల 25న) వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ప్రభుత్వ సలహాదారు రాంలక్ష్మణ్ ఆవిష్కరించారు. సచివాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రజక సంఘాల రాష్ట్ర కన్వీనర్ కొండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఐలమ్మ విగ్రహాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ఆవిష్కరిస్తారు.

# 60రోజుల ప్రణాళికకు సిద్ధం

- పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా కార్యక్రమం
- పదోన్నతుల జాబితా సిద్ధం చేయండి
- రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి
- పంచాయతీరాజ్ సమీక్షలో మంత్రి దయాకర్‌రావు



శుక్రవారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీ రాజ్ వ్యవస్థకు పునర్వైభవం తీసుకురావడం, పచ్చని, పరిశుభ్ర పల్లెసీమల నిర్మాణమే లక్ష్యంగా 60 రోజుల ప్రణాళికను అమలుచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా 60 రోజుల ప్రణాళిక అమలుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పంచాయతీరాజ్‌శాఖను వ్యవస్థాగతంగా బలోపేతం చేయాలని సీఎం నిర్ణయించి ఈ మేరకు అవసరమైన పోస్టులను కూడా మంజూరు చేశారని చెప్పారు. 1956 తర్వాత పంచాయతీరాజ్ శాఖలో ఒకేసారి 311 పోస్టులు మంజూరుచేసిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఉద్యోగాల భర్తీకి వీలుగా పదోన్నతుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామ కార్యదర్శి మొదలుకొని జెడ్పీ సీఈవో స్థాయి వరకు అన్ని దశల్లో పదోన్నతులు పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన మూడో దశ కింద మన రాష్ట్రానికి 2,724 కిలోమీటర్ల కొత్త రోడ్లు మంజూరయ్యాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేసి అవసరమైన చోట రోడ్డు మార్గం అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

### గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

దేశానికే ఆదర్శంగా నిలిచేలా మన రాష్ట్రంలో హరితహారం కార్యక్రమం నడుస్తున్నదని, గ్రామస్థాయిలో 85 శాతం మొక్కలు బతికించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. గ్రామపంచాయతీల అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు, మానవతావాదులను, ఎన్నారైలను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీకి కార్యాలయం ఉండాలని, నిర్మించాల్సిన పంచాయతీ భవనాలకు ఎంత ఖర్చు అవుతుందనేది అంచనా వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పంచాయతీ పాలక వర్గాల్లో కోఆప్షన్ సభ్యుల నియామకానికి మార్గదర్శకాలు ఖరారు చేయాలని, అభివృద్ధి కమిటీల నియామకం చేపట్టాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రత చాలా ముఖ్యమని, పారిశుద్ధ్య నిర్వహణకు మంచి ప్రణాళిక ఉండాలని సూచించారు. కేంద్ర తాగునీటి, పారిశుద్ధ్యశాఖ ఢిల్లీలో ఈ నెల 26న జల్‌జీవన్ మిషన్‌పై అన్ని రాష్ట్రాలతో సమావేశం నిర్వహిస్తున్నదని, మన రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టుల సమగ్ర నివేదికను సిద్ధంచేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ రఘునందన్‌రావు, ఈఎన్సీ కృష్ణారెడ్డి, పీఆర్ ఈఎన్సీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లికి అధికారుల కృతజ్ఞతలు

పంచాయతీరాజ్ అభివృద్ధి, గ్రామాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ బంగారు తెలంగాణ సాధనలో ముందుంటామని తెలంగాణ ముఖ్య కార్యనిర్వహణ, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారుల సంఘం అధ్యక్షుడు బీ రాఘవేంద్రరావు అన్నారు. 25 ఏండ్లుగా ఎదురుచూస్తున్న అధికారులకు పదోన్నతులు కల్పించడమే కాకుండా.. కొత్తగా 311 ఉద్యోగాలు మంజూరుచేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును శుక్రవారం పలు సంఘాల ఆధ్వర్యంలో కలిసి అభినందనలు తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖలో సీఎం కేసీఆర్ విప్లవాత్మక మార్పులు తెచ్చారని, కొత్త చట్టంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రిని కలిసినవారిలో సీఈవోల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు ఎం సత్తయ్య, ప్రధాన కార్యదర్శి ప్రశాంతి ఉన్నారు.

# రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అమలు భేష్: హైకోర్టు

- బీజేపీ నేత పిటిషన్ కొట్టివేత
- బెంగళూరు కంటే హైదరాబాద్‌లోనే ఉత్తమ వైద్యసేవలున్నాయని వ్యాఖ్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయి పేద రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకుడు పేరాల శేఖర్‌రావు దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఈ పిటిషన్‌కు కాలంచెల్లిందని (ఇన్‌ఫ్రక్చువస్) వ్యాఖ్యానించింది. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అమలు భేష్‌గా ఉన్నదని తెలిపింది. ఆరోగ్యశ్రీని తక్షణం అమలుచేయాలని, ప్రైవేటు హాస్పిటల్స్‌కు రూ.వేలకోట్లు చెల్లిస్తున్నారని దీనికి బదులు ప్రభుత్వ దవాఖానలను బలోపేతంచేయాలని పిటిషనర్ కోరారని పేర్కొన్న ధర్మాసనం.. ఈ రెండు అంశాలు ఒకదానికి ఒకటి పరస్పర విరుద్ధంగా ఉన్నాయని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం విడుదలచేసిన హెల్త్ ఇండియా సర్వే -2016 ప్రకారం.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వ దవాఖానల కంటే ప్రైవేటు హాస్పిటళ్లలో వైద్యం పొందేవారి సంఖ్య ఎక్కువగా ఉన్నదని తేలిందని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. తాము చూసిన దాని ప్రకారం బెంగళూరు కంటే హైదరాబాద్‌లోనే ఉత్తమ వైద్యసేవలు అందుతున్నాయని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలను ఎలాంటి ఆలస్యం లేకుండా పునఃప్రారంభించామని చెప్పారు.



శివనగర్ వైపు తీర్చిదిద్దిన వరంగల్ రైల్వేస్టేషన్ స్వాగత ద్వారం

# మోడ్రన్ రైల్వేస్టేషన్‌గా వరంగల్

చారిత్రక వారసత్వానికి ప్రతీకంటూ

రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ ట్వీట్

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** చారిత్రక కళా వైభవానికి ప్రతీకగా వరంగల్ రైల్వే స్టేషన్ నిలువనున్నది. టీఆర్‌ఎస్ ఎంపీల ప్రతిపాదన మేరకు వరంగల్ రైల్వేస్టేషన్‌ను మోడ్రన్ స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులోభాగంగా గతేడాది ఏప్రిల్ 5న వరంగల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించిన అప్పటి దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం అనిత్‌వర్ధన్ దీనిని మోడ్రన్‌స్టేషన్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఈ మేరకు కాకతీయుల కళావైభవం ఉట్టిపడేలా స్టేషన్‌ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. 'వరంగల్ కళావారసత్వానికి ప్రతీకగా రైల్వేస్టేషన్ అత్యాధునిక హంగులద్దుకుంటున్నదనీ, ప్రయాణికులు ఈ సుందరమైన స్టేషన్‌ను చూసి ఇక్కడి సంస్కృతిని తెలుసుకొంటారు'అంటూ శుక్రవారం రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ ట్వీట్ చేశారు.




కేంద్ర మంత్రి పియూష్‌గోయల్ ట్వీట్



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేసి, స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఉత్సవ విగ్రహాలను పట్నంపైకి తీసుకొచ్చి, ఆలయ పుర వీధుల్లో ఊరేగించారు. - చేర్యాల, నమస్తే తెలంగాణ





ఆదిలాబాద్ జిల్లా మావల హరితవనంలో మొక్కనాటి నీళ్లుపోస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

## పులులకు ఆవాసంగా ఆదిలాబాద్ అడవులు

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**ఆదిలాబాద్ రూరల్ :** ఆదిలాబాద్ అడవులు పులుల ఆవాసానికి అనుకూలంగా మారాయని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా మావల హరితవనంలో స్కై సైక్లింగ్, జిప్‌లైనింగ్, బోటింగ్‌ను ప్రారంభించి, మొక్కలు నాటారు. మహారాష్ట్రలోని తాడోబా, తిప్పేశ్వర్ అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న ఆదిలాబాద్ అడవులు పులుల ఆవాసాలకు ఎంతో అనుకూలమన్నారు. కంపా నిధులతో అటవీప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరిచి జీవరాశుల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని తెలిపారు. 'జంగల్ బచావో.. జంగల్ బడావో.. కార్యక్రమంలో భాగంగా అటవీ భూభాగంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి అటవీ సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమం లో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావు, పీసీసీఎఫ్ ఆర్.శోభ, ఆదిలాబాద్ కలెక్టర్ దివ్యదేవరాజన్, ఆదిలాబాద్ ఎస్పీ విష్ణువారియర్ పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా మునిగేపల్లిలో ఫాంపాండ్ పనుల్లో పాల్గొన్న జలశక్తి అభియాన్ బృందం సభ్యులు

## సెప్టెంబర్ 15లోగా జలశక్తి పనులు పూర్తవ్వాలి

కేంద్ర జలశక్తి అభియాన్ బృందం

**కూసుమంచి:** ఖమ్మం జిల్లాలో జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులన్నీ సెప్టెంబర్ 15లోగా పూర్తి చేయాలని జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు కుల్వంత్‌రాణా, విజయ్‌ప్రకాశ్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లాలోని కూసుమంచి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో బృందం సభ్యులు పర్యటించారు. మొదట కూసుమంచి మండలం మునిగేపల్లి, ధర్మతండా, మల్లేపల్లి, భగత్‌వీడు, గురువాయిగూడెం గ్రామాల్లో పర్యటించి ఫాంపాండ్ పనులను పరిశీలించారు. మునిగేపల్లిలో స్వయంగా పార, గడ్డపార చేతపట్టి ఫాంపాండ్ పనులు చేశారు.



శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో తన కూతురుని గోపికగా తయారు చేసి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది ఓ ముస్లిం మహిళ . కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన ఎండీ అమ్రిన్-పాషా దంపతుల కూతురు ఆనస్ స్థానిక కాకతీయ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నది. శుక్రవారం కృష్ణాష్టమి సందర్భంగా అమ్రిన్ తన కూతురు ఆనస్‌ను గోపికగా అలంకరించింది. హిందూ సంప్రదాయాన్ని గౌరవించిన అమ్రిన్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు.-జమ్మికుంట



కరీంనగర్ జిల్లా మానకొండూర్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. గ్రామాల్లో మరుగుదొడ్ల వినియోగం, పరిశుభ్రత, పాడి, తడి చెత్త, ఇంకుడు గుంతల నిర్మాణం, తదితర అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ పాఠశాలలో గ్రామస్తులతో సమావేశమయ్యారు.
- మానకొండూర్ రూరల్ /శంకరపట్నం/ సైదాపూర్

## పరిశ్రమల స్థాపనకు మహిళలు ముందుకురావాలి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సింగరేణి ప్రాంత మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి కృషిచేయాలని సింగరేణి డైరెక్టర్ (ఆర్థిక) ఎన్ బలరాం పిలుపునిచ్చారు. మహిళల ఆర్థికాభివృద్ధికి సింగరేణి ఎప్పుడూ సహకారం అందిస్తుందన్నారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎన్‌ఐఎంఎస్‌ఎంఈ) ఆధ్వర్యంలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు నిర్వహించిన ఐదురోజుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

## అంగన్‌వాడీల పదోన్నతులపై మంత్రికి వినతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంగన్‌వాడీ ఉద్యోగుల పదోన్నతులపై సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం పరీక్ష నిర్వహించాలని టీఎన్జీవో, అంగన్‌వాడీ హెల్పర్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిని కోరారు. శుక్రవారం వారు సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు భిక్షవమ్మ, సరిత, ఉమారాణి, నర్మద ఉన్నారు.

## పీఆర్ కమిషనర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ రఘునందన్‌రావును తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర బాధ్యులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్‌లలో ఉద్యోగుల కేటాయింపుపై చర్చించారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్‌తో పాటు సూర్యకాంత్, మధులత, చంద్రశేఖర్, సుశీల్‌కుమార్ తదితరులు కమిషనర్‌ను కలిశారు.

# రెండు జిల్లాల్లో భారీ వర్షాలు

పలు జిల్లాల్లో ఓ మోస్తరు..

- ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పొంగుతున్న వాగులు
- సమీప గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- సింగరేణి ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్
- అత్యధికంగా బెజ్జూర్‌లో 8.22 సెం.మీటర్లు నమోదు



ఉధృతంగా ప్రవహిస్తున్న కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలోని కుకుడ వాగు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో శుక్రవారం పలు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జిల్లాల్లో భారీవర్షం కురవగా, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ అర్బన్, రూరల్, ములుగు, నల్లగొండ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షాల కారణంగా ఆయా జిల్లాల్లో వాగులు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. భద్రాద్రి, మంచిర్యాల జిల్లాల్లో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. అత్యధికంగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో 8.22 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాగల 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

రాకపోకలకు అంతరాయం..

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు ఉప్పొంగుతున్నాయి. శుక్రవారం కూడా వర్షం పడటంతో సలుగుపల్లి సమీపంలో రోడ్డు కోతకు గురై కాగజ్‌నగర్ నుంచి బెజ్జూరు మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. బెజ్జూర్ నుంచి సోమిని వైపు రోడ్డుపై లోతు ఒర్రె, సుస్మీర్ వాగులు పొంగి పొర్లడంతో సుస్మీర్, సోమిని, గెర్రెగూడ, పాత సోమిని, మొగవెళ్లి, ఇప్పల గైడ, చింతలపల్లి, బండల గూడ, నాగెపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యధికంగా బెజ్జూర్ మండలంలో 82.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లా సగటు వర్షపాతం 39.9 మిల్లీ మీటర్లుగా రికార్డయింది.

కూలిన నాలుగు ఇండ్లు..

మంచిర్యాల జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. కోటపల్లి మండలం నక్కలపల్లి, ఆలుగామ, ఏదుల్లబందం గ్రామాల్లో ఒక్కో ఇల్లు, సోమగూడెంలో మరో ఇల్లు కూలింది. ఏదుల్లబంధం వద్ద తుంతుంగా వాగు ఉప్పొంగడంతో శిర్సా, ఆలుగామ, పుల్లగామ, జనగామ, నందనంపల్లి, రొయ్యలపల్లి, ఏదుల్లబంధం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నీల్వాయి రిజర్వాయర్ నిండి మత్తడి దూంకింది. జిల్లావ్యాప్తంగా 57.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

భద్రాద్రి జిల్లాలో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంతోపాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, అశ్వారావుపేట, ఇల్లెందు, మణుగూరు, ఆళ్లపల్లి, దమ్మపేట, ములకలపల్లి, భద్రాచలంలో శుక్రవారం సాయంత్రం కొన్నిచోట్ల భారీ వర్షం, మరికొన్నిచోట్ల చిరుజల్లులు పడ్డాయి. ములకలపల్లి మండలం గుర్రాలగుంట వద్ద రోడ్డుకు అడ్డంగా వృక్షం కూలడతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

వరంగల్ అర్బన్‌లో ముసురు..

వరంగల్ అర్బన్ జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ముసురుతో వరంగల్ నగరంలోని పలు మురికివాడలు జలమయమయ్యాయి. మడికొండలో ఓ ఇంటిగోడ కూలింది. అత్యధికంగా ధర్మసాగర్ మండలంలో 30 మి.మీ నమోదు కాగా, జిల్లా వ్యాప్తంగా సగటు 89.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ములుగు జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు అత్యధికంగా వెంకటాపురం(నూగూరు)లో 60.8 మి.మీటర్ల వర్షం కురవగా, జిల్లా సగటు వర్షపాతం 30.8 మి.మీ. నమోదైంది.

### సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం..



వర్షం కారణంగా మంచిర్యాల జిల్లా పరిధిలోని శ్రీరాంపూర్, ఆర్కేపీ, కేకే ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఓబీ(మట్టి వెలికితీత) పనులు ఆగిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని మణుగూరు ఏరియాల్లోని ఓసీల్లోకి వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. అధికారులు మోటర్ల ద్వారా వరద నీటిని బయటకు తోడివేయించే ఏర్పాట్లు చేస్తున్నారు.

నీటి వనరులకు జలకళ..

వరంగల్‌రూరల్ జిల్లాలో గురువారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు నీటిమట్టం 13 అడుగులకు చేరింది. ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 అడుగులుకాగా, ప్రస్తుతం24.8 ఫీట్లకు చేరింది. నల్లగొండ జిల్లాలోని మునుగోడు, పెద్దవూర మండలాల్లో భారీ వర్షం పడింది.

24 గంటల్లో రాష్ట్రంలో వర్షాలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాగల 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈశాన్య మధ్యప్రదేశ్ దానిని ఆనుకొని ఉన్న దక్షిణ ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతున్నది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతున్నది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం దానిని ఆనుకొని ఉన్న వాయవ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో సముద్రమట్టానికి 1.5 నుంచి 4.5 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాగల 24 గంటల్లో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వారు పేర్కొన్నారు.

### గ్రేటర్ హైదరాబాద్‌లోనూ..

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గత రెండు రోజులుగా గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల వర్షా లు కురుస్తున్నాయి. గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి నగరం తడిసిముద్దయింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8.30 వరకు హైదరాబాద్ నగరంలో సెంటీ మీటర్ వర్షపాతం నమోదు కాగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 వరకు 7.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కాగా రాగల 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్టు వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు.



బషీర్‌బాగ్ ఫ్లైఓవర్ ప్రాంతంలో కురుస్తున్న వర్షం



మత్తడి పోస్తున్న నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని పెద్దవూర చెరువు

# ఒకే గ్రామం.. ఒకే వినాయకుడు

- ఆదర్శంగా మేడ్చల్ జిల్లా సుతారిగూడ
- 40 ఏండ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం



మేడ్చల్ మండలంలోని సుతారిగూడ

**మేడ్చల్ రూరల్ :** వినాయక ఉత్సవాల సందర్భంగా గల్లీకో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ హంగు ఆర్భాటాలు ప్రదర్శించడం.. గ్రామం, పట్టణం అని తేడా లేకుండా ప్రతి చోటా జరిగే తంతు. ఇందుకు భిన్నంగా ఒకే గ్రామం.. ఒకే వినాయకుడి సంప్రదాయానికి మేడ్చల్ మం డలం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని సుతారిగూడ తెరతీసింది. 40 ఏండ్ల కింద ప్రారంభమైన సంప్రదాయం ఇప్పటికీ కొనసాగడం విశేషం. ఏటా వినాయక ఉత్సవాల సందర్భంగా గ్రామస్తులంతా కలిసి ఒకే విగ్రహాన్ని నెలకొల్పి, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 40 ఏండ్ల కింద గ్రామానికి చెందిన చింతల పెంటయ్య, నగరబోయిన శ్రీరాములు, నగరబోయిన పెంటయ్య, నట్టి యాదగిరి, సత్తయ్య, చిల్ల నర్సింహ, రామస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చి ఈ నిర్ణయం తీసుకోగా, నేటికీ ఇదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు.

### ఐక్యత కోసమే..



ఊరంతా ఐక్యంగా ఉండాలన్న కాంక్షతో గ్రామంలో ఒకే వినాయకుడిని ఏర్పాటు చేయాలని 40ఏండ్ల కిందట నిర్ణయించారు. గల్లీకో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే భక్తికన్నా ఆధిపత్యమే ఎక్కువగా ఉం టుంది. ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం సందర్భంగా గొడవలు జరిగే అవకాశం ఉంటుంది. ఐక్యత దెబ్బతింటుంది. మనుషుల మధ్య దూరం పెరుగుతుంది. ఒకే వినాయకుడి ప్రతిమ ఉంటే ఐక్యత పెరుగుతుంది. మేము తీసుకున్న ఈ నిర్ణయానికి స్థానికులు ఇప్పటికీ కట్టుబడటం సంతోషంగా ఉన్నది.
–చింతల పెంటయ్య, సుతారిగూడవాసి

### ఉగ్రరూపం దాల్చిన బొగత..



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరదతో ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ఉధృత రూపం దాల్చింది. శుక్రవారం జలపాతం వద్ద సందర్శకులు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. - వాజేడు(ములుగు)

## గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి



నబీన్, అయాన్ (ఫైల్)

**పరిగి రూరల్:** మరుగుదొడ్డి నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం ఇబ్రహీంపూర్‌లో శుక్రవారం ఉదయం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన నయీబ్ కుమారుడు నబీన్(8), మేనల్లుడు అయాన్(7) ఆడుకుంటూ సమీపంలోని నయ్యూం ఇంటికి వెళ్లారు. నయ్యూం ఇంటి ఎదుట మరుగుదొడ్డి నిర్మాణం కోసం తీసిన గుంతలో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచింది. ఈ గుంత పక్కనే నిమ్మ చెట్టు ఉండటంతో చిన్నారులు కాయలు కొసేందుకు అక్కడి వెళ్లగా ప్రమాదవశాత్తు గుంతలో పడి మునిగిపోయారు. ఎంతకీ పిల్లలు ఇంటికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. నయ్యూం ఇంటిలోని గుంతలో ఒకరి శవం తేలింది. వెంటనే గుంతలో గాలించగా మరొకరి మృతదేహం దొరికింది. మృతుల కుటుంబ సభ్యులను పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరామర్శించారు.

## పుట్టినరోజు వేడుకకు పిలిచి..

సామూహిక అత్యాచారం..

సిద్దిపేటలో ఘటన

**సిద్దిపేట టౌన్:** తన కూతురు పుట్టిన రోజు వేడుకకు రావాలని పిలిచి ఓ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన సిద్దిపేటలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మేడ్చల్ జిల్లా దుండిగల్‌కు చెందిన మహిళ(40)తో సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లికి చెందిన బాలకిషన్‌రెడ్డికి కొన్నేండ్లుగా పరిచయం ఉంది. బుధవారం తన కూతురు పుట్టిన రోజు ఉన్నదని బాలకిషన్‌రెడ్డి ఆ మహిళను సిద్దిపేటకు రమ్మన్నాడు. ఈ మేరకు సదరు మహిళ బుధవారం సిద్దిపేటకు రాగా, బాలకిషన్‌రెడ్డి ఆమెను భారత్‌నగర్‌లో నివాసముంటున్న స్నేహితుడు రంజిత్‌రెడ్డి ఇంటి వద్ద దిగబెట్టాడు. పథకం ప్రకారం రంజిత్‌రెడ్డి ఆమెను గణేశ్‌నగర్‌లో నివాసముంటున్న తన స్నేహితుడు ప్రణీత్‌రెడ్డి నివాసానికి తీసుకెళ్లి ఇద్దరు అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం బాలకిషన్‌రెడ్డి పుల్లూరు గ్రామ శివారులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయాన్ని బయటకు చెప్పొద్దని ఆమెను బెదిరించాడు. బాధిత మహిళ గురువారం రాత్రి ఫిర్యాదు చేయగా ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ శ్రీనివాస్ చెప్పారు.

## చిన్నారిపై లైంగికదాడికియత్నం

**కొండాపూర్:** మూడున్నరేండ్ల చిన్నారిపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని ఓ గ్రామం లో అంగన్‌వాడీ కేంద్రం నుంచి నీటికోసం వాటర్ ట్యాంకు వద్దకు వెళ్లిన మూడున్నరేండ్ల చిన్నారిని అదే గ్రామానికి చెందిన పాపయ్య అలియాస్ యోహాన్(35) తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. చిన్నారి అరుపులు విని స్థానికులు తలుపులు పగులగట్టి చిన్నారిని కాపాడారు. చిన్నారిని వైద్య పరీక్షలకు సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ
# ఆట
8
[ కరీంనగర్ ]
శనివారం 24 ఆగస్టు 2019
WWW.NTNEWS.COM

**2** ప్రకాశ్ పదుకొనే (1983) తర్వాత ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సెమీస్ చేరిన రెండో ప్లేయర్‌గా సాయి ప్రణీత్ రికార్డుల్లోకెక్కాడు.

# సెమీస్‌లో సింధు, సాయి

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

- ఐదోసారి పతకం ఖాయం చేసుకున్న పీవీ
- పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ కొత్త చరిత్ర..



సింధు

**5** ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సింధుకు పతకం ఖాయమవడం ఇది ఐదోసారి. ఇప్పటి వరకు రెండు రజతాలు, రెండు కాంస్యాలు ఆమె ఖాతాలో ఉన్నాయి.

**ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలుగు షట్లర్లు దుమ్మురేపుతున్నారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు.. పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ క్వార్టర్స్‌లో చక్కటి విజయాలతో సెమీఫైనల్లో అడుగుపెట్టారు. మెగాటోర్నీలో ఇంతకాలంగా ఊరిస్తూ వస్తున్న పసిడి పతకాన్ని ఈసారి ఒడిసి పట్టాల్సిందే అన్నట్లు సింధు ముందుకు సాగుతుంటే.. మూడున్నర దశాబ్దాలుగా పురుషుల సింగిల్స్ పతకం నెగ్గని లోటును తీరుస్తూ.. ప్రణీత్ కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నాడు.**

**బాసెల్:** అచ్చొచ్చిన అడ్డాలో పీవీ సింధు రాకెట్ వేగంతో దూసుకెళ్తుంటే.. అర్జున ఇచ్చిన ధైర్యంతో సాయి ప్రణీత్ ఎదురులేకుండా సాగుతున్నాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సింధు.. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ప్రణీత్ అదిరిపోయే ఆటతో ప్రత్యర్థులను చిత్తుచేసి సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. దీంతో ఈ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో గత రెండు పర్యాయాలు రజతాలతో సరిపెట్టుకున్న సింధు ఈసారి పతకం రంగు పసిడిలోకి మార్చాలనే పట్టుదలతో దుమ్మురేపుతుంటే.. 36 ఏండ్ల తర్వాత పురుషుల విభాగంలో సాయి ప్రణీత్ మెడల్ ఖరారు చేసి ఔరా అనిపించాడు. భారత్ నుంచి బరిలో దిగిన ప్లేయర్లంతా వెనుదిరిగిన తరుణంలో సింధు, ప్రణీత్ శుక్రవారం విజృంభించారు. తొలుత సింధు 12-21, 23-21, 21-19తో ప్రపంచ మాజీ నంబర్‌వన్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత తై జు యింగ్ (చైనీస్ తైపీ)ను చిత్తు చేస్తే.. ఆ వెంటనే ప్రపంచ 19వ ర్యాంకర్ సాయి ప్రణీత్ 24-22, 21-14తో ఆసియా క్రీడల పసిడి విజేత, ప్రపంచ 4వ ర్యాంకర్ జొనాథన్ క్రిస్టి (ఇండోనేషియా)ని వరుస గేమ్‌ల్లో ఓడించాడు. ఇప్పటికే ఈ టోర్నీలో రెండు రజతాలు, రెండు కాంస్యాలు చేజిక్కించుకున్న సింధు.. ఐదో మెడల్ తన పేరిట రాసుకుంది. ఇక అది ఏ పతకం అనేది రానున్న రెండు మ్యాచ్‌ల్లో ఆమె ప్రదర్శనపై ఆధారపడి ఉంది. శనివారం జరిగే సెమీఫైనల్స్‌లో చెన్ యు ఫీ(చైనా)తో సింధు, టాప్ సీడ్ కెంటా మెమోటా (జపాన్)తో సాయి ప్రణీత్ తలపడనున్నారు.

### గురిచూసి కొట్టిన సింధు..

ప్రత్యర్థిపై మంచి రికార్డు లేకున్నా.. తొలి గేమ్‌లో చిత్తుగా ఓడినా.. అవేవి పట్టించుకోని సింధు తుదికంటా పోరాడి ఒత్తిడిని చిత్తుచేసి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. గంటా 11 నిమిషాల పాటు సాగిన పోరు తొలి గేమ్‌లో తెలుగమ్మాయి పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ఆరంభంలో 3-9తో వెనుకబడ్డ సింధు ఏ దశలోనూ పుంజుకోలేకపోయింది. కొంత పోరాటం తర్వాత 9-18కి చేరినా.. అప్పటికే ఆలస్యమైపోయింది. సుదీర్ఘ ర్యాలీలు ఆడేందుకు సింధు ప్రయత్నిస్తే.. ఎక్కడికక్కడే స్మాష్‌లతో తై జు దూసుకెళ్లింది. ఇక ఒత్తిడంతా సింధుపైనే అనుకుంటున్న తరుణంలో అంచనాలను తలకిందులు చేస్తూ.. రెండో గేమ్ ఆరంభంలో చక్కటి ఆట తీరు కనబర్చి 2-0తో ముందంజ వేసింది. కాసేపటికే ప్రత్యర్థి వరుసగా మూడు పాయింట్లు సాధించడంతో స్కోరు 3-3తో సమమైంది. ఈ దశలో రెచ్చిపోయిన తై జు వరుస పాయింట్లు సాధించగా.. సింధు కూడా దీటుగా బదులిచ్చింది. దీంతో స్కోరు 15-15తో సమమైంది. మూడు పాయింట్లు సాధించిన పీవీ 18-16తో గేమ్ సొంతం చేసుకోవడం ఖాయమే అనిపించినా.. పట్టు వదలని తైపీ ప్లేయర్ రెండు గేమ్ పాయింట్లు కాచుకొని 20-20తో స్కోరు సమం చేసింది. సూపర్ సర్వీస్‌తో గేమ్ పాయింట్‌పై నిలిచిన సింధు.. బలమైన క్రాస్ కోర్ట్ షాట్‌తో గేమ్‌ను సొంతం చేసుకుంది. ఇక నిర్ణయాత్మక మూడో సెట్‌లో తై జు ఆరంభంలోనే 4-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. 8-4తో మరింత ముందుకెళ్లే తరుణంలో సింధు విజృంభించింది. ఒక్కో పాయింట్ సాధిస్తూ.. ఆధిక్యాన్ని తగ్గించింది. ఈ దశలో ప్రత్యర్థి చేసిన తప్పిదాలు కూడా సింధుకు కలిసొచ్చాయి. మ్యాచ్ అనంతరం సింధు మాట్లాడుతూ.. 'ఈ విజయం తో సంతృప్తి చెందడం లేదు. ముందు ముందు ఇంకా కఠినమైన మ్యాచ్‌లు ఎదురుకానున్నాయి. సెమీస్‌లో అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తా' అని పేర్కొన్నది.

## జోరు కనబర్చిన ప్రణీత్..

ఈ మెగాటోర్నీలో అంచనాలకు మించి రాణిస్తున్న సాయి ప్రణీత్ మరోసారి అదిరిపోయే ప్రదర్శన కనబర్చాడు. ఈ ఏడాది ఆరంభంలో స్విస్ ఓపెన్ రన్నరప్‌గా నిలిచిన సాయి ప్రణీత్.. క్వార్టర్ ఫైనల్లో తనకంటే మెరుగైన ప్లేయర్‌ను వరుస గేమ్‌ల్లో ఓడించి సత్తాచాటాడు. తొలి గేమ్‌లో 8-4తో ఆధిక్యంలోకి వెళ్లిన ప్రణీత్.. ఆ తర్వాత కాస్త వెనుకబడ్డాడు. ప్రత్యర్థి పుంజుకోవడంతో స్కోరు 10-10 వద్ద సమమైంది. ఒక దశలో 20-19తో నిలిచిన ప్రణీత్ ఓ చక్కటి షాట్‌తో మ్యాచ్‌ను సొంతం చేసుకోవాలని భావించినా.. క్రిస్టి అంతే అద్భుతంగా దాన్ని రిటర్న్ చేశాడు. అయితే ప్రణీత్ కొట్టిన బలమైన షాట్‌ను రిటర్న్ చేసే క్రమంలో క్రిస్టి నెట్ వద్ద తడబడ్డాడు. ఆ సమయంలో క్రాస్‌కోర్ట్ షాట్ ద్వారా వరుసగా రెండు పాయింట్లు సాధించిన ప్రణీత్ గేమ్‌ను ఖాతాలో వేసుకున్నాడు. రెండో గేమ్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వని ప్రణీత్ 7-1, 11-3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ప్రత్యర్థి కాస్త తేరుకొని.. దగ్గరకు వచ్చినా.. ఎలాంటి తడబాటుకు లోనుకాకుండా గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. గత 36 ఏండ్లలో ఒక భారత ఆటగాడు ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సెమీఫైనల్లో అడుగుపెట్టడం ఇదే తొలిసారి.



సాయి ప్రణీత్

> చాలా ఆనందంగా ఉంది. ఈ విజయాన్ని మాటల్లో వర్ణించలేను. మ్యాచ్ జరుగుతున్న సమయంలో గోపీచంద్ సర్ అటాక్ చేయకు.. రిథమ్ మార్చు అని సూచించారు. అది చక్కటి ఫలితాన్నిచ్చింది.
> - సాయి ప్రణీత్



సైనా

## అంపైర్ల వల్లే..

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అంపైరింగ్ ప్రమాణాలు సరిగ్గా లేవని భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఆరోపించింది. అంపైర్ల తప్పిదాల వల్లే తాను క్వార్టర్స్ చేరలేకపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ టోర్నీ మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో గురువారం సైనా 21-15, 25-27, 12-21తో మియా బ్లిచ్‌ఫెల్డ్ (డెన్మార్క్) చేతిలో ఓటమిపాలైన విషయం తెలిసిందే. 'రెండో గేమ్‌లో అంపైరింగ్ తప్పిదాల వల్ల 2 మ్యాచ్ పాయింట్లు చేజారడాన్ని నమ్మలేకపోతున్నా. అంతేకాదు ఆట మధ్య లో 'లైన్ అంపైర్లను వారి పని చేసుకోనివ్వండి' అని అంపైర్ నాతో అనడం కూడా సరైంది కాదు. మ్యాచ్ పాయింట్లు ఎలా విస్మరించాడో నాకైతే అర్థం కావడం లేదు. చాలా బాధగా ఉంది'అని సైనా ట్విట్టర్‌లో పేర్కొంది. 'చెత్త అంపైరింగ్ వల్లే 2 మ్యాచ్ పాయింట్లు కోల్పోవాల్సి వచ్చింది. అంతే కాదు మ్యాచ్‌లో అనేక తప్పుడు నిర్ణయాలు వెలువడ్డాయి. ఆ కోర్టులో రివ్యూ అడిగే చాన్స్ లేకపోవడం మరింత బాధ కలిగించింది' అని సైనా భర్త కశ్యప్ ప్రశ్నించాడు.

# భారత్ 297 ఆలౌట్

- రాణించిన రవీంద్ర జడేజా
- వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ 75/3

**పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మిడిలార్డర్ వైఫల్యంతో ఇబ్బందులు పడుతున్న టీమ్‌ఇండియాకు విండీస్‌తో టెస్టులో అదే ఆదుకుంది. పరీక్ష పెడుతున్న పిచ్‌పై అగ్రశ్రేణి ఆటగాళ్లు నిలువలేకపోయిన చోట.. కింది వరుస బ్యాట్స్‌మెన్ పోరాడటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో పోరాడే స్కోరు చేసింది. అజింక్యా రహానే చక్కటి ఇన్నింగ్స్‌కు చివర్లో రవీంద్ర జడేజా మెరుపులు తోడవడంతో మూడొందల మార్కుకు చేరువైంది. యువ రిషబ్ పంత్ పెద్దగా ప్రభావం చూపలేకపోయిన చోట ఇషాంత్ శర్మ 20 ఓవర్ల పాటు నిలువడం విశేషం. అనంతరం బౌలింగ్‌లోనూ మనవాళ్లు సత్తా చాటడంతో.. టీ విరామ సమయానికి కరీబియన్లు 3 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేశారు. ఆరంభంలో ధాటిగా ఆడేందుకు యత్నించిన విండీస్ బ్యాట్స్‌మెన్‌కు మనవాళ్లు కళ్లెం వేశారు. షమీ, ఇషాంత్, జడేజా తలా ఓ వికెట్ పడగొట్టి ప్రత్యర్థిని ఎక్కువ స్కోరు చేయకుండా కట్టడి చేశారు. ఇలాగే సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటితే కరీబియన్లపై మనదే పైచేయి అవుతుంది.**



జడేజా (1/17, 58)

రాత్రి 7 నుంచి సోనీ టెన్-1, టెన్-3లో

**అంటిగ్వా:** భారత వైస్ కెప్టెన్ అజింక్యా రహానే (163 బంతుల్లో 81; 10 ఫోర్లు) పోరాటానికి ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (112 బంతుల్లో 58; 6 ఫోర్లు, 1 సిక్సర్) తెగువ తోడవడంతో వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ మంచి స్కోరు చేసింది. టాపార్డర్ విఫలమైన చోట లోయరార్డర్ దన్నుగా వీరిద్దరూ చక్కటి ఇన్నింగ్స్‌లు ఆడటంతో భారత్ కోలుకుంది. ఫలితంగా టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 96.4 ఓవర్లలో 297 పరుగులకు ఆలౌటైంది. విహారి (32) ఫర్వాలేదనిపించగా.. పంత్ (24) పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. దాదాపు 20 ఓవర్లు క్రీజులో నిలిచిన ఇషాంత్ శర్మ (62 బంతుల్లో 19) జడ్డూకు చక్కటి సహకారం అందించడం విశేషం. విండీస్ బౌలర్లలో రోచ్(4/66), గాబ్రియల్ (3/71), చేజ్(2/58) వికెట్లు పడగొట్టారు.అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన వెస్టిండీస్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడింది. దూకుడు కనబర్చిన ఓపెనర్ క్యాంప్‌బెల్ (23)ను షమీ(1/10) పెవిలియన్ బాట పట్టించగా.. క్రైగ్ బ్రాత్‌వైట్ (14)ను ఇషాంత్ (1/30) రిటర్న్ క్యాచ్‌తో ఔట్ చేశాడు. అరంగేట్ర ఆటగాడు బ్రూక్స్ (11) జడేజా(1/5)కు చిక్కాడు. టీ విరామానికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 28 ఓవర్లలో 3 వికెట్లకు 82 పరుగులు చేసింది. బ్రావో (18), చేజ్ (10) క్రీజులో ఉన్నారు.

### జడ్డూ జోడీ కమాల్..

ఓవర్‌నైట్ స్కోరు 203/6తో రెండో రోజైన శుక్రవారం ఆట కొనసాగించిన టీమ్‌ఇండియా మరో 94 పరుగులు చేసి మిగిలిన 4 వికెట్లు కోల్పోయింది. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ (24) క్రితం రోజు స్కోరుకు నాలుగు పరుగులే జోడించి ఔటయ్యాడు. ఈ దశలో జడేజాకు ఇషాంత్ చక్కటి సహకారం అందించాడు. చక్కటి డిఫెన్స్‌తో జడ్డూపై ఒత్తిడి తగ్గించాడు. దీంతో స్వేచ్ఛగా షాట్లు ఆడిన జడేజా చకచకా పరుగులు జోడీస్తూ పోయాడు. విండీస్ పేసర్లను విసిగించిన ఈ జోడీ ఎనిమిదో వికెట్‌కు 60 పరుగులు జోడించింది. అనంతరం ఇషాంత్, షమీ (0) వెంటవెంటనే ఔటవడంతో జడేజా భారీ షాట్లకు దిగాడు. ఈ క్రమంలో టెస్టుల్లో 11వ అర్ధశతకం పూర్తి చేసుకోవడంతో పాటు జట్టు స్కోరును మూడొందలకు చేరువ చేసి చివరి వికెట్ రూపంలో పెవిలియన్ చేరాడు.

### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** రాహుల్ (సి) హోప్ (బి) చేజ్ 44, మయాంక్ (సి) హోప్ (బి) రోచ్ 5, పుజారా (సి) హోప్ (బి) రోచ్ 2, కోహ్లీ (సి) బ్రూక్స్ (బి) గాబ్రియల్ 9, రహానే (బి) గాబ్రియల్ 81, విహారి (సి) హోప్ (బి) రోచ్ 32, పంత్ (సి) హోల్డర్ (బి) రోచ్ 24, జడేజా (సి) హోప్ (బి) హోల్డర్ 58, ఇషాంత్ (బి) గాబ్రియల్ 19, షమీ (సి అండ్ బి) చేజ్ 0, బుమ్రా (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు:** 19, **మొత్తం:** 96.4 ఓవర్లలో 297 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-5, 2-7, 3-25, 4-93, 5-175, 6-189, 7-207, 8-267, 9-268, 10-297, **బౌలింగ్:** రోచ్ 25-6-66-4, గాబ్రియల్ 22-5-71-3, హోల్డర్ 20.4-11-36-1, మిగావ్ కమిన్స్ 13-1-49-0, చేజ్ 16-3-58-2.

**వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** క్రైగ్ బ్రాత్‌వైట్ (సి అండ్ బి) ఇషాంత్ 14, క్యాంప్‌బెల్ (బి) షమీ 23, బ్రూక్స్ (సి) రహానే (బి) జడేజా 11, బ్రావో (నాటౌట్) 18, చేజ్ (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు:** 6, **మొత్తం:** 28 ఓవర్లలో 82/3. **వికెట్ల పతనం:** 1-36, 2-48, 3-50, **బౌలింగ్:** ఇషాంత్ 8-2-32-1, బుమ్రా 8-2-11-0, షమీ 7-3-17-1, జడేజా 5-2-17-1.

## వదలని వాన.. లంక 144/6

**కొలంబో:** న్యూజిలాండ్-శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టును వరుణుడు ఇప్పట్లో వదిలేలా లేడు. వర్షం కారణంగా తొలిరోజు ఒక్క సెషన్ ఆట మాత్రమే సాగగా.. రెండో రోజు కూడా అదే పరిస్థితి ఎదురైంది. భారీ వర్షం వల్ల 29.3 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఓవర్‌నైట్ స్కోరు 85/2తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక చివరకు 144/6తో నిలిచింది. కెప్టెన్ కరుణరత్నే (65) ఒంటరి పోరాటం చేశాడు.

## ప్రపంచ యూత్ ఆర్చరీలో భారత్‌కు కాంస్యం



**న్యూఢిల్లీ:** ప్రపంచ యూత్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత్ కాంస్య పతకం సొంతం చేసుకుంది. స్పెయిన్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ జూనియర్ పురుషుల కాంపౌండ్ ఈవెంట్‌లో సుఖ్‌బీర్ సింగ్, సంగమ్‌ప్రీత్ సింగ్ బిస్లా, తుషార్‌తో కూడిన భారత బృందం కాంస్యం గెలుచుకుంది. శుక్రవారం మూడోస్థానం కోసం జరిగిన పోరులో భారత ఆర్చర్లు 60 పాయింట్లకు గాను 60 సాధించగా.. కొలంబియా త్రయం 56 పాయింట్లకు పరిమితమవడంతో మన ఖాతాలో కాంస్యం చేరింది. మరోవైపు ఇదే టోర్నీలో భారత్ మరో రెండు రజత పతకాలు ఖాయం చేసుకుంది.

## స్టేడియం పైకప్పు కూలి ఇద్దరు మృతి

**భళ్లారి:** స్టేడియం పైకప్పు కూలిన ఘటనలో శుక్రవారం ఇద్దరు మృతి చెందారు. సిరాకుప్ప జిల్లాలో జరుగుతున్న జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో ఈ ఘటన చోటు చేసుకుందని పోలీసులు పేర్కొన్నారు. ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా..35 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గాయపడ్డ వారిని దగ్గరలోని దవాఖానకు తరలించారు. జరిగిన ఘటన పట్ల విచారం వ్యక్తం చేసిన కర్ణాటక సీఎం యెడియూరప్ప విచారణకు ఆదేశించారు.



## పాలమూరు శుభారంభం

**మహబూబ్‌నగర్ స్పోర్ట్స్:** ఆరవ తెలంగాణ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు 4-2తో నిజామాబాద్‌పై గెలిచి శుభారంభం చేసింది. మిగతా మ్యాచ్‌ల్లో మెదక్ 10-0తో భద్రాద్రి కొత్తగూడెంపై, కరీంనగర్ 6-2తో నల్లగొండపై, వరంగల్ అర్బన్ 17-3తో మహబూబాబాద్‌పై విజయాలు సాధించాయి. బాలికల కేటగిరీలో హైదరాబాద్ 14-0తో నిర్మల్‌పై, మెదక్ 13-0తో వరంగల్ అర్బన్‌పై, కరీంనగర్ 6-2తో నల్లగొండపై గెలిచి ముందంజ వేశాయి. అంతకముందు స్టేడియంలో సాఫ్ట్‌బాల్ టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది. గురుకుల విద్యార్థులు ప్రత్యేక బ్యాండ్ ద్వారా రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు ఘన స్వాగతం పలికారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రితో పాటు సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి హాజరయ్యారు.

## నాడాకు వాడా షాక్

- డోపింగ్ టెస్ట్ ల్యాబ్ గుర్తింపుపై సస్పెన్షన్
- ఆరు నెలల పాటు వేటు
- అప్పీల్‌కు వెళతామన్న క్రీడాశాఖ

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక టోక్యో(2020) ఒలింపిక్స్‌కు సరిగ్గా సంవత్సరం కూడా లేని సమయాన భారత్‌కు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేవన్న కారణంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా)కు చెందిన టెస్టింగ్ ల్యాబోరేటరీ(ఎన్‌డీటీఎల్) గుర్తింపుపై అంతర్జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) శుక్రవారం సస్పెన్షన్ వేసింది. ఆరు నెలల పాటు ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా వేటు వేస్తూ వాడా నిర్ణయం తీసుకుంది. ఈనెల 20 నుంచి సస్పెన్షన్ అమల్లోకి వస్తుందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ నిర్ణయంతో ఇక నుంచి ఆటగాళ్లకు డోపింగ్ పరీక్షలు బయట నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే వాడా సస్పెన్షన్‌పై అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానం(సీఏఎస్)కు అప్పీల్‌కు వెళ్తామని కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. 'వాడా నిర్దేశించిన అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ల్యాబ్‌లు లేని కారణంగా ఎన్‌డీటీఎల్‌పై సస్పెన్షన్ వేటు వేశాం. ఆటగాళ్ల నుంచి సేకరించిన సాంపిల్స్‌పై జరుపుతున్న పరీక్షలు ఆశించిన స్థాయిలో జరుగడం లేదు. సస్పెన్షన్ నిర్ణయంపై లాసాన్నెలోని సీఏఎస్‌లో అప్పీల్ చేసుకునేందుకు రానున్న 21 రోజుల వరకు నాడాకు అవకాశముంటుంది' అని వాడా ఒక ప్రకటనలో పేర్కొంది. వాడా సస్పెన్షన్ కారణంగా దేశం బయట డోపింగ్ పరీక్షలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడితే అంత ఖర్చు భరించేందుకు తాము సిద్ధంగా లేమంటూ భారత ఒలింపిక్ సమాఖ్య(ఐవోఏ) అధ్యక్షుడు నరిందర్ బాత్రా పేర్కొన్నారు. మరోవైపు ఇటీవలే నాడా పరిధిలోకి వచ్చిన బీసీసీఐ స్పందిస్తూ వేచిచూసే ధోరణి అవలంభిస్తామని ఒక అధికారి అన్నారు. తమ వ్యాపార అవకాశాల కోసం వాడా ఈ నిర్ణయం తీసుకుందని క్రీడా శాఖ కార్యదర్శి రాధేశ్యామ్ ఝులనియా ఆరోపించారు.

## ఆసీస్‌కు భారీ ఆధిక్యం

**లీడ్స్:** మూడో టెస్ట్‌పై ఆసీస్ మరింత పట్టు బిగించింది. 112 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కంగారూలు భారీ ఆధిక్యం దిశగా పయనిస్తున్నారు. డాషింగ్ ఓపెనర్ వార్నర్(0) సున్నా పరుగులకే నిష్క్రమించినా.. మార్నస్ లబుషేన్(53 నాటౌట్) సాధికారిక ఇన్నింగ్స్‌తో ఇంగ్లండ్ బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టాడు. ట్రావిస్ హెడ్(25), వేడ్(33),తో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన లాబుచాంగ్నె మరో అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ టిమ్ పైన్(0) మరోమారు నిరాశపరుచగా, టెయిలెండర్లతో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 6 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. చేతిలో నాలుగు వికెట్లు ఉన్న ఆసీస్ ప్రస్తుతం 283 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. బ్రాడ్, స్టోక్స్ రెండేసి వికెట్లు తీశారు. అంతకుముందు హాజిల్‌వుడ్(5/30) విజృంభణతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 67 పరుగులకే కుప్పకూలింది. హాజిల్‌వుడ్‌కు తోడు కమ్మిన్స్ (3/23), ప్యాటిన్సన్(2/9) రాణింపుతో ఇంగ్లండ్ జట్టులో డెన్లీ(12) మినహా అందరూ సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు.



హాజిల్‌వుడ్

## ఆరు పరాజయాల తర్వాత..

**చెన్నై:** ప్రొ కబడ్డీ లీగ్ 7వ సీజన్‌లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ ఎట్టకేలకు ఆరు వరుస ఓటముల తర్వాత గెలుపు రుచి చూసింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్ లో గుజరాత్ 29-26తో పాట్నా పైరేట్స్‌పై గెలుపొందింది. జెయింట్స్ తరపున రోహిత్ గులియా (10 పాయింట్లు) సూపర్-10 సాధించగా.. పాట్నా తరపున 'డుబ్కీ కింగ్'ప్రదీప్ నర్వాల్ 9 పాయింట్లతో ఒంటరి పోరాటం చేశాడు. తొలి సగంలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన పాట్నా సునాయాసంగా మ్యాచ్ సొంతం చేసుకునేలా కనిపించింది. ప్రదీప్ రెచ్చిపోవడంతో హాఫ్ టైమ్ సమయానికి పాట్నా 15-11తో ఆధిక్యంలో నిలిచింది. అయితే రెండో సగంలో జోరు కనబరిచిన గుజరాత్ మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. మరో మ్యాచ్‌లో యు ముంబా 29-24తో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. కాగా, శనివారం నుంచి ఢిల్లీ వేదికగా మ్యాచ్‌లు జరుగనున్నాయి.

# గౌరవంగా బతుకుదాం

- తెలంగాణలోనే మత్స్యకారులకు మంచిరోజులు
- కాళేశ్వరం ప్రాజెక్ట్ నీళ్లు చేరినచోటల్లా మత్స్యసంపద
- ముదిరాజ్ ప్రజాప్రతినిధుల సన్మానసభలో మంత్రి ఈటల
- 60 రోజుల ప్రణాళికలో భాగస్వాములుకండి: మంత్రి ఎర్రబెల్లి



ముదిరాజ్ మహాసభను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రులు ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎంపీ బండా ప్రకాశ్, ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు ఉన్నారు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మత్స్యకారులకు తెలంగాణలోనే మంచిరోజులు వచ్చాయని, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో గల్లా ఎగరేసి గౌరవంగా బతుకుదామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ చొరువ ఫలితంగా ముదిరాజ్‌లు ఇప్పటికే కొంత పురోగతివైపు పయనిస్తున్నారని, అభివృద్ధి ఫలాలు పూర్తిస్థాయిలో అందితే సంపన్నులైన మత్స్యకారులను తెలంగాణ గడ్డమీద మాత్రమే చూడగలమన్నారు. రచయిత, జర్నలిస్టు, హైదరాబాద్ తొలి మేయర్ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 126వ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం ముదిరాజ్ ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఒకనాడు రాళ్లు, రప్పలు తేలిన గోదావరి నది.. నేడు కాళేశ్వరం ప్రాజెక్ట్ ఫలితంగా జీవనదిగా మారిందని, 500 కోట్ల చేపపిల్లలు వేసినా తరగని సంపద మన సొంతమయ్యిందని చెప్పారు. కాళేశ్వరం నీళ్ల నిండిన ప్రతిచోటా చేపపిల్లలను పెంచబోతున్నామన్నారు. ఒకప్పుడు ఎస్సారెస్పీ కాలువకు గండిపెట్టి చెరువులు నింపి చేపలు పెంచుకొంటామంటే జేసీబీని సీజ్ చేశారని, కేసీఆర్ ప్రభుత్వం చెరువులు నింపి చేపలు పెంచుకొనే అవకాశం కల్పించిందన్నారు.

**గ్రామాల వికాసానికి పాటుపడండి: మంత్రి ఎర్రబెల్లి**

నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ ప్రజాప్రతినిధులంతా గ్రామాల వికాసానికి పాటుపడాలని రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులంతా 60 రోజుల ప్రణాళికలో భాగస్వామ్యమై గ్రామాలు, పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ బండా ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి చొప్పరి శంకర్, అఖిల భారత కోలి సమాజ్ ఉపాధ్యక్షుడు రొట్టం భూపతి, ముదిరాజ్ అధ్యయన వేదిక చైర్మన్ ప్రొఫెసర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## వినోద్‌కు నాయకుల అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను పలువురు నాయకులు అభినందించారు. కూకట్‌పల్లిలోని నివాసంలో ఆయనను శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అభినందించినవారిలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్, ములుగు జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య తదితరులు ఉన్నారు.

**నేడు వినోద్‌కుమార్‌కు సన్మానం:** రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన బోయినపల్లి వినోద్‌కుమార్‌ను శనివారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ లాయర్లు సన్మానించనున్నారు.

## ఏపీ మాజీ స్పీకర్ కోడెలకు అస్వస్థత

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం ఆయన గుంటూరులోని లక్ష్మి సూపర్ స్పెషాలిటీ దవాఖానలో చేరారు. ఛాతీలో నొప్పి లక్షణాలతో ఆయన దవాఖానలో చేరినట్టు తెలిసింది. కోడెలకు తీవ్ర గుండెపోటు వచ్చిందని, కుటుంబసభ్యులు వెంటనే దవాఖానకు తరలించారని టీడీపీ వర్గాల సమాచారం.






# హరిత సబ్ జైలు

- మహబూబాబాద్ జైలులో పరుచుకున్న పచ్చదనం
- అధికారుల ప్రత్యేక శ్రద్ధతో హరితహారం విజయవంతం

**మహబూబాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమం అద్భుతమైన ఫలాలు ఇస్తున్నది. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని సబ్‌జైలు ఆవరణలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలతో పచ్చదనం పరుచుకున్నది. జైలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. నాలుగున్నర ఎకరాల్లో జైలు ఉండగా, ఎకరం స్థలంలో భవనసముదాయం ఉంటుంది. మిగిలిన మూడున్నర ఎకరాల్లో జైలు సిబ్బంది మొక్కలను పెంచుతున్నారు. ఇక్కడ మొక్కల పెంపకానికి మహబూబాబాద్‌కు చెందిన ప్రజా హృదయం స్వచ్ఛంద సంస్థ సహకరిస్తున్నది. మొదటివిడుత హరితహారంలోనే సబ్‌జైలు ఆవరణలో 500 మొక్కలు నాటారు. ఆ తర్వాత ప్రతి విడుతలోనూ ఎక్కువ మొక్కలు నాటుతున్నారు. ప్రస్తుతం జైలు ఆవరణ ఐదువేల మొక్కలతో పచ్చని అందాలను పరుచుకుని ఆకట్టుకుంటున్నది. అందమైన పూల మొక్కలతోపాటు జామ, నేరేడు, దానిమ్మ, నిమ్మ, ఉసిరి, మునగ, టేకు, వేప, గానుక వంటి మొక్కలు కనిపిస్తున్నాయి. వాటి సంరక్షణ బాధ్యతను ఖైదీలకు అప్పగించి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఖైదీలకు మొక్కలపై అవగాహన కల్పించి, పచ్చదనం ప్రాధాన్యాన్ని వివరిస్తూ హరితహారం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

హరిత చైతన్యం



పచ్చని మొక్కలతో ఆకట్టుకుంటున్న మహబూబాబాద్ సబ్ జైలు ఆవరణ

### ఈ సారి పండ్ల మొక్కలు నాటుతాం

హరితహారంలో భాగంగా ఈ ఏడాది పండ్ల మొక్కలు నాటుతాం. హరితహార కార్యక్రమంలో మా వంతు బాధ్యతగా సబ్‌జైలులో 5 వేల మొక్కలు నాటి సంరక్షిస్తున్నాం. ఈ విడుత చేపట్టే హరితహారంలో పండ్ల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ మొక్కల పెంపకంలో జైలు సిబ్బంది ఏఎస్సై ఎస్ వెంకటేశ్వర్లు, హెడ్ వార్డెన్ ఇఫ్తార్ హైమద్, ఓదెలు, భీమా, దూదియా, స్వరూప, రజిత తదితరులు సహకారం అందిస్తున్నారు.

–నర్మెట చంద్రశేఖర్, జైలు సూపరింటెండెంట్



యాదాద్రిలోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో వేర్లతో సహా నేల కొరిగినప్పటికీ మరింత వికసించి నీడను పంచుతున్న చెట్టు



మల్లమ్మకు విధించిన జరిమానా రశీదు

## మొక్కలను మేకలు మేశాయని జరిమానా

**మొయినాబాద్:** కంటికి రెప్పలా కాపాడాల్సిన మొక్కలను మేకలపాలు చేసినందుకు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం దేవల వెంకటాపూర్‌కు చెందిన మేకల యజమాని బైకని మల్లమ్మకు పంచాయతీ అధికారులు రూ.500 జరిమానా విధించారు. దేవలవెంకటాపూర్‌లో ఇటీవల పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. 21న ఆ మొక్కలను మల్లమ్మ మేకలు మేశాయని అధికారులు గుర్తించి రూ.500 జరిమానా వసూలుచేశారు.

## ఫోక్స్‌వ్యాగన్ కేసులో ఏపీ మంత్రి బొత్సకు సమన్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫోక్స్‌వ్యాగన్ కుంభకోణం కేసులో ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణకు నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టు సమన్లు జారీచేసింది. కేసులో సాక్షిగా సెప్టెంబర్ 12న హాజరుకావాలని ఆదేశించింది.

## బాబుకూ 'చిద్దూ' గతే

- ట్విట్టర్‌లో ఎంపీ విజయసాయిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర మాజీ మంత్రి చిదంబరం 20 సార్లు ముందస్తు బెయిల్ పొందినప్పటికీ కటకటాలపాలవక తప్పలేదని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. 18 అవినీతి కేసుల్లో స్టే తెచ్చుకున్న చంద్రబాబు పరిస్థితి కూడా అలాగే అవుతుందని ఆయన ట్వీట్‌చేశారు.









నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 24 ఆగస్టు 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi

## రికార్డుల ప్రయాణం!



**ఆమె ప్రయాణం మొదలు పెట్టడమే ఓ రికార్డు. ప్రపంచంలోని ఎన్నో దేశాలు, సముద్రాలు, రాష్ట్రాల మీదుగా ఎయిర్‌క్రాఫ్ట్‌లో ప్రయాణించి. అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాల మీదుగా ప్రయాణించిన మొదటి మహిళా పైలెట్‌గా రికార్డుకెక్కింది ముంబైకి చెందిన అరోహి.**

అరోహి యంగ్ అండ్ విమెన్ పైలెట్. యునైటెడ్ స్టేట్స్‌లోని అలస్కా నుంచి ఆమె ప్రయాణం మొదలైంది. లైట్ స్పోర్ట్స్ ఎయిర్ క్రాఫ్ట్‌లో సోలోగా బయల్దేరింది. సముద్రాలు, మహాసముద్రాల మీదుగా వెళ్లి రష్యాలోని ఎన్డీర్ ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ అయింది. అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాల మీదుగా వెళ్లిన మొదటి మహిళా పైలెట్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది. కొద్దిసేపటికే మూడు రంగుల జెండాతో ఫొటో దిగి ట్వీట్ చేసింది. 13 నెలల ఆమె ప్రయాణంలో దీంతోపాటు ఎన్నో రికార్డులను సృష్టించింది. గ్రీన్‌ల్యాండ్ ఐస్ క్యాప్ సందర్శించిన మొదటి మహిళా పైలెట్‌గా, కెనడా నార్త్ ఈస్ట్ నుంచి నార్త్ వెస్ట్ వరకూ ప్రయాణించిన మొదటి మహిళా పైలెట్‌గా రికార్డులు సాధించింది. ఈ ప్రయాణానికంటే ముందు ఏడు నెలల సుదీర్ఘ శిక్షణ తీసుకుంది అరోహి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు శక్తి సామర్థ్యాలను పరీక్షించుకున్నది. ఆ తర్వాతే తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది.

# ప్రజాసేవలోకి.. తొలి అడుగు

**వాళ్లది.. ఉరిమే ఉత్సాహం. సాధించాలనే పట్టుదల. తమకెంతో ఇచ్చిన సమాజం కోసం ఎంతో కొంత తిరిగివ్వాలనే ఆలోచన. తమకు మేలు చేసిన సమాజం మేలు కోసం.. కంటికి రెప్పలా కాపాడుకోవడం కోసం ఇండియన్ పోలీస్ సర్వీస్‌ను ఎంచుకున్నారు. లక్ష్యంపై స్పష్టత.. సాధించాలనే పట్టుదల ఉంటే కష్టాలన్నీ కాళ్ల దగ్గర తలవొంచక తప్పదని నిరూపించారు. పాసింగ్ అవుట్ పరేడ్‌తో నేటినుంచి దేశసేవలోకి తొలి అడుగు వేయబోతున్న ముగ్గురు తెలంగాణ కేడర్ యువ ఐపీఎస్‌ల పరిచయం.**

ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. ఎంతో కష్టపడి చదువుకున్నారు. ఆటుపోట్లను అధిగమించి అత్యున్నత హోదా అయిన ఇండియన్ పోలీస్ సర్వీస్‌లోకి అడుగుపెట్టారు. దేశసేవలోకి వచ్చేందుకు సిద్ధమైన ఈ ముగ్గురు తెలంగాణ కేడర్ ఐపీఎస్‌లు.. ఏ విధంగా కష్టపడ్డారు? వాళ్ల నేపథ్యం ఏంటి? సమాజానికి వారు చేయాలనుకుంటున్నదేంటి? వంటి విషయాలు జిందగీతో పంచుకున్నారు. వివరాలు వాళ్ల మాటల్లోనే..



### జీవితంలో ప్రతీ అంశం ఒక పాఠం
**డాక్టర్ వినీత్**

మాది బెంగళూరు. నేను తొలుత ఎంబీబీఎస్ చేశాను. తర్వాత ఎంఎస్ ఆర్థో చేశాను. అయినా సరే నాలో ఏదో ఒక తీరని లోటు అనిపించేంది. డాక్టర్ అనేది ఎంతో గొప్ప వృత్తి, కానీ అందులో ప్రజలకు సేవ చేసేందుకు పరిధి చాలా తక్కువగా ఉంటుందన్న ఆలోచన ఎప్పుడూ ఉండేది. అందుకే సివిల్స్‌వైపు అడుగులు వేశాను. ఒక డాక్టర్‌గా ఆరోగ్యాన్ని బాగు చేసేందుకు శస్త్రచికిత్స చేస్తే, ఒక ఐపీఎస్ ఆఫీసర్‌గా సమాజంలోని చెడుకు శస్త్రచికిత్స చేసే అవకాశం ఉంటుందన్నది నా ఆలోచన. తొలుత ట్రైనింగ్‌కు వచ్చినప్పుడు కాస్త కఠినంగా అనిపించేది. అప్పటి వరకు పుస్తకాల చదువులోనే గంటల కొద్ది సమయం గడిపే నేను ఔట్‌డోర్‌లో కఠినంగా శ్రమించక తప్పని పరిస్థితి. నెమ్మదిగా నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. మెంటల్‌గా, ఫిజికల్‌గా ఇక్కడ ఎంతో ఫిట్ అయ్యాను. ఇక్కడ ట్రైనింగ్‌లో నేర్పే ప్రతీ అంశం జీవితంలో మనకు ఒక పాఠమే. ఇక ఒక ఐపీఎస్ ఆఫీసర్‌గా సర్వీస్‌లో ప్రజల జీవితాలను మరింత భద్రంగా, సంతోషంగా ఉండేలా చేయాలన్నదే నా లక్ష్యం. తెలంగాణ కేడర్‌కు రావడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఇక్కడి పరిస్థితులను ఆకలింపు చేసుకుని సర్వీస్‌లో నన్ను నేను నిరూపించుకునేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. టెక్నాలజీ వాడకంతోపాటు ఎన్నో విషయాల్లో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ముందంజలో ఉన్నారు. ఇక్కడ కేడర్ దక్కడం మంచి అవకాశంగా భావిస్తున్నాను.

### కష్టాల్లో పుట్టి.. పెరిగా
**గౌష్ ఆలం**

మాది ఢిల్లీ. నాన్న మిలిటరీలో సుబేదార్‌గా పనిచేసేవారు. నాన్న చిన్నప్పుడు చనిపోవడంతో ఒక్కసారిగా కష్టాలు మమ్మల్ని చుట్టుముట్టాయి. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు అయినా చదువును వదలలేదు. అన్నింటికీ పరిష్కారం చదువే అని నమ్మేవాడిని. ఎప్పుడూ మంచి మార్కులే సాధించేవాడిని. అలా ముంబైలోని ఐఐటీలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. తర్వాత ఉద్యోగం ఆలోచనకంటే జీవితంలో ఏదో ఒకటి సాధించాలి. నన్ను నేను నిరూపించుకోవాలన్న కసి ఉండేది. నా చుట్టూ నిత్యం జరిగే ఎన్నో పోరాటాలు చూస్తూ పెరిగాను. జీవితంలో రాణించాలంటే పట్టుదలతో లక్ష్యాన్ని చేరాలని అప్పుడే నిర్ణయించుకున్నా. ఐపీఎస్ అవ్వాలన్న దీక్షతో ఇక్కడి వరకు వచ్చాను. ఐపీఎస్‌కు సెలక్ట్ అయ్యేందుకు ఎంత కష్టపడ్డానో, అంతకు మించి నన్ను నేను నిరూపించుకునేందుకు ఈ శిక్షణ ఒక అవకాశంగా తీసుకుని మరింత శ్రమించాను. ఇక్కడ జాతీయ పోలీస్ అకాడమీలో ఫైరింగ్, అవుట్‌డోర్ ఈవెంట్లు నాకు అమితానందాన్నిచ్చాయి. శిక్షణలో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎంపిక కావడం, బ్యాచ్ టాపర్‌గా రావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రతిష్ఠాత్మకమైన ప్రధానమంత్రి, హోం మంత్రి రివాల్వర్‌తోపాటు ఉత్తమ ఆల్‌రౌండర్ ఐపీఎస్ ప్రొబెషనర్‌గా మారేందుకు రోజుకు 14 గంటల కఠోర శ్రమదాగి ఉంది. ఈ రెండు ట్రోఫీలతోపాటు మొత్తం ఐదు అంశాల్లో ట్రోఫీలు రావడం నాలో విశ్వాసాన్ని మరింత పెంచాయి. నేను తెలంగాణ కేడర్‌కు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రజలకు అవకాశం ఉన్నమేరకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం.

### ప్రజలకు అండగా ఉండేందుకు
**డాక్టర్ శబరీష్**

నేషనల్ పోలీస్ అకాడమీకి రాకముందు ఉన్న ఎన్నో భయాలు, అనుమానాలు ఎన్‌పీఏలో ట్రైనింగ్‌తో పటాపంచలయ్యాయి. మాది కర్నాటక. ఒక వైద్యుడిగా స్థిరపడినా, చిన్ననాటి నుంచి ఐపీఎస్ కావాలన్న కల నాలో అలానే ఉండిపోయింది. అందుకే మొదటి నుంచి ఆ దిశగా ప్రయత్నిస్తూనే ఉన్నాను. నేను మూడో ప్రయత్నంలో సాధించాను. శారీరకంగానేకాదు, మానసికంగా మనల్ని మనం దృఢంగా చేసుకునేలా శిక్షణ ఉంటుంది. కొన్నిసార్లు ఎంతో కఠినంగా అనిపిస్తుంది. ముఖ్యంగా ఔట్‌డోర్ శిక్షణలో 40 కిలోమీటర్ల నడక, ప్రతి రోజూ ఎంతో శారీరక శ్రమ తప్పదు. మరోపక్క అదే స్థాయిలో ఇండోర్ తరగతులు, పరీక్షలు ఇలా క్షణం తీరిక లేకుండా ఉంటుంది. ఒకేసారి ఎన్నో రకాల పరిస్థితులను తట్టుకుని మనల్ని మనం నిరూపించుకునేలా శారీరకంగా, మానసింగా మనల్ని దృఢంగా చేస్తారు ఇక్కడ. నాది కర్నాటక అయినా, ఇక్కడికి వచ్చాక తెలుగు నేర్చుకున్నాను. ఇప్పుడు నేను తెలంగాణ కేడర్‌కు వచ్చాను కాబట్టి ఇకపైనా ఇక్కడే ఉండాలి కదా. ఎంబీబీఎస్ ఎంతో నోబుల్ ప్రొఫెషన్. అయితే నాకు ఐపీఎస్ కావడం అనేది కల. ఒక పోలీస్ అధికారిగా, కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా ఉండి, వారి కన్నీళ్లు తుడిచే అవకాశం ఉంటుంది. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలోనే ఎక్కువ తృప్తి ఉంటుందని నేను నమ్ముతాను. సివిల్స్ లక్ష్యం పెట్టుకునేవాళ్లకు నేను ఇచ్చే సలహా ఒక్కటే.. పట్టుదలతో ఒక నిర్దిష్టమైన ప్రణాళిక పెట్టుకొని కష్టపడితే ఎవ్వరైనా సివిల్స్ సాధించవచ్చు. అందుకు తెలుగు మీడియం అయినా, ఏ మీడియం అయినా అడ్డుకాదు. మనం గ్రామీణ నేపథ్యమైనా గెలుపు సాధించాలన్న లక్ష్యం మనకు ఉంటే విజయం దక్కుతుంది. ఇందుకు నేనే ఉదాహరణ. శిక్షణ తర్వాత నేను తెలంగాణ కేడర్‌కు ఇంకా చాలా సంతోషంగా ఉంది. దేశంలోనే లీడింగ్ పోలీస్‌గా తెలంగాణ పోలీస్ ఉన్నారు.

... నాగోజు సత్యనారాయణ
కోనేటి వెంకట్

## సాధికారతకు భరోసా



**ఉపాధి కోసం మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారు. పురుషులు ఎక్కువగా ఉండే రంగాల్లో మహిళలూ దూసుకెళ్తున్నారు. అలాంటి రంగాల్లో ఒకటి మోటర్ ఫీల్డ్. ఇలాంటి రంగంలో ప్రభుత్వ పరిధిలో మహిళలకు ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.**

'నిరుద్యోగం' దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన సమస్య. అందులో మహిళలకు ఉద్యోగావకాశాలు చాలా తక్కువ. కానీ మహిళల సాధికారతకు, వారికి ఉపాధిని కల్పించేందుకు ప్రభుత్వ పరిధిలో ఉన్న పబ్లిక్ సెక్టార్‌లో ఉద్యోగాలు కల్పించనున్నది కేరళ ప్రభుత్వం. ఇటీవల సీఎం పినరయ్ నిర్వహించిన కేబినేట్ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. ఇప్పటివరకూ ప్రయివేటుగా డ్రైవింగ్‌లో ఉన్న మహిళలు ఎవరైనా ప్రభుత్వ పరిధిలో పని చేసేందుకు అవకాశం కల్పించింది. ఆర్టీసీ, ప్రభుత్వ వాహనాల డ్రైవింగ్ వంటి ఉద్యోగాల్లో మహిళలు చేరవచ్చు అని ఆదేశాలను ఇచ్చింది. దీంతోపాటు రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చట్టాలు కలిగి ఉన్నామని కేబినేట్ వెల్లడించింది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఈ అవకాశాలు కల్పిస్తున్నట్టు చెప్పింది. వీటితోపాటు మహిళల కోసం ప్రత్యేకంగా కమ్యూనిటీ సెంటర్లు, జాతీయ క్రీడా పతకాల విజేతలకు ప్రోత్సాహకాలు వంటి నిర్ణయాలు తీసుకుంది కేరళ ప్రభుత్వం. దీంతో అన్ని రాష్ట్రాల్లో కూడా ఈ సదుపాయాలు వస్తే మరింత బాగుంటుందని మహిళలు అభిప్రాయపడుతున్నారు.

## ఆదివారం చేసే పనులు



**సాధారణంగా ఉద్యోగం చేసే వారందరికీ ఆదివారం మాత్రమే సెలవు ఉంటుంది. ఒక్కోసారి అది కూడా ఉండదు. సెలవు రోజు పనులన్నింటినీ ఎలా చక్కదిద్దుకోవాలి? వీటికి కొన్ని నియమాలు పాటిస్తే సరి. మరి అవేంటో ఇప్పుడు చూద్దాం.**

- సాధారణ రోజుల్లో ఏ పనులు ఎప్పుడు చేయాలో ఓ ప్రణాళిక వేసుకోవాలి. అదేవిధంగా ఆదివారం రోజు కూడా అలానే పాటించాలి. గంటపాటు దుస్తులకు కేటాయించాలి. వారంరోజులు ఏ దుస్తులు వేసుకోవాలో వాటిని ఉతికి, ఇస్త్రీ చేసి పెట్టుకుంటే మిగిలిన రోజుల్లో ఎంతో సమయం కలిసొస్తుంది.
- ఆ రోజు కనీసం అరగంట అయినా.. రాబోయే వారం రోజులు ఏయే పనులు చేయాలో ఆలోచించుకోవాలి. అవసరమైతే కొన్ని పనులను రాసి పెట్టుకుంటే మంచిది. ఇలా చేయడం వల్ల ఎప్పుడు ఏమే పనులు చేయాలో గుర్తుంటుంది. దీంతో ఒత్తిడి సమస్యలు అసలు ఉండవు.
- ఆదివారం రోజున చాలామంది ఇంటి గురించి పట్టించుకోరు. దీనికి బదులుగా విశ్రాంతి తీసుకుంటారు. వారంలో కుటుంబానికి ఎంత సమయం కేటాయించాలి. వ్యక్తిగత సమయానికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలనేది ఆలోచించాలి.
- మిగిలిన రోజులన్నీ టీవీ, ఫోన్లు అంటూ ఉన్న సమయాన్ని వృథా చేసుకుంటారు. కనీసం ఆదివారం నాడైనా గ్యాడ్జెట్లకు దూరంగా ఉండాలి. వీలైనంత సమయం కుటుంబంతో సరదాగా గడపాలి. ఇంట్లో చిన్నపిల్లలు గనుక ఉంటే వారిని పార్కుకి తీసుకెళ్లి ఆడించాలి.
- పుస్తకాలు చదివే అలవాటు ఉంటే.. దీనికి కనీసం గంట సమయాన్ని కేటాయించాలి. షాపింగ్ పనులు ఏవైనా ఉంటే ఉదయాన్నే లేచి అన్ని పనులూ చకచకా చేసుకోవాలి. వారానికి ఒకసారి వచ్చే ఆదివారాన్ని ఇలా ప్లాన్‌డ్‌గా ఎంజాయ్ చేస్తూ గడుపండి.

## దాల్చినచెక్కతో రోగాలు మాయం

దాల్చినచెక్క రుచి, వాసన కోసం వంటకాల్లో వాడుతుంటారు. ఇది డిష్‌కు మంచి రుచి తేవడమే కాదు, ఆరోగ్యానికి కూడా చాలా ఉపయోగపడుతుంది. పలు రకాల ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

- సాధారణంగా మహిళలు రుతుసమయంలో కడుపునొప్పితో బాధపడుతుంటారు. అలాంటి బాధ నుంచి తప్పించుకోవాలంటే బియ్యం కడిగిన నీటిలో మూడు స్పూన్లు దాల్చిన చెక్కపొడి వేసుకొని తాగితే సరిపోతుంది.
- ఒక్కోసారి కొంతమందికి గుండె పట్టేసినట్లు అనిపిస్తూ ఉంటుంది. ఆ సందర్భాలలో దాల్చిన చెక్కను చూర్ణం చేసి అందులో కొద్దిగా యాలకుల పొడి వేసి నీటిలో మరిగించాలి. ఈ మిశ్రమాన్ని కషాయం రూపంలో తీసుకుంటే వెంటనే ఉపశమనం పొందవచ్చు.
- తలనొప్పి తగ్గాలంటే దాల్చిన చెక్కను పొడిచేసి నీటిలో కలిపి నుదుటిపై రాసుకుంటే సరిపోతుంది. దాల్చినచెక్క పొడిలో కొద్దిగా తేనె కలిపి రోజూ మూడుసార్లు క్రమం తప్పకుండా తీసుకుంటే కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- చర్మరోగాలు, దురదలు, చెమట పొక్కులు, ఎగ్జిమా వంటివి తగ్గాలంటే కొద్దిగా తేనెను వేడి చేసి అందులో కొంచెం దాల్చిన చెక్కపొడిని వేసి ఆ మిశ్రమాన్ని తీసుకున్నా, చర్మానికి రాసుకున్నా మంచి ఫలితం ఉంటుంది.
- రాత్రి నిద్రపోయేముందుగా గ్లాస్ పాలలో రెండు స్పూన్ల దాల్చిన చెక్క పొడి, కొద్దిగా చక్కెర వేసి తీసుకుంటే జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుంది. ఈ విధంగా దాల్చిన చెక్కను ఉపయోగించుకోవచ్చు.



## జుట్టు ఊడుతున్నదా?

**ఇటీవల కాలంలో చిన్నా, పెద్దా వయసుతో తేడా లేకుండా వేధిస్తున్న సమస్య జుట్టు చిట్లిపోవడం, రాలిపోవడం. ఈ సమస్యలకు అనేక షాంపూలు, మందులు ఉన్నప్పటికీ అవి తాత్కాలికం మాత్రమే. సహజసిద్ధంగా లభించే పదార్థాలతో జుట్టుని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. అదెలాగో చూద్దాం.**

- ఎండ, ఇతర కారణాల వల్ల కొందరికి జుట్టుచిట్లడమేకాక ఊడిపోతుంది. నిమ్మరసం, ఆలివ్‌నూనె కలిపి తలకు పట్టించాలి. 20 నిమిషాల తర్వాత తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే ఈ సమస్య దూరమవుతుంది.
- తేనె తీసుకొని తడి జుట్టుకు పట్టించాలి. 20 నిమిషాలపాటు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల అతినీలలోహిత కిరణాల నుంచి జుట్టును కాపాడుకోవచ్చు.
- జుట్టు నిర్జీవంగా కనిపిస్తున్నదా? పుల్లటి పెరుగు, తేనెవేసి బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించాలి. 30 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ పద్ధతిని వారానికి ఒకసారి చేస్తే జుట్టు నిగనిగలాడుతుంది. ఆరోగ్యంగా కూడా ఎదుగుతుంది.
- కలబంద రసానికి, తేనె, నిమ్మరసం కలిపి ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా చేయడం వల్ల జుట్టుకి, మాడుకి కావలసిన తేమ అందుతుంది.
- రోజ్‌వాటర్‌ను తలకు పట్టించాలి. 30 నిమిషాల తర్వాత వెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేసినా జుట్టు రాలకుండా ఉంటుంది. దీంతోపాటు చుండ్రుకు కూడా చెక్ పెట్టవచ్చు.

నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 24 ఆగస్టు 2019


● సర్, మా వీధిలో ఒక వ్యక్తి 200 గజాల స్థలంలో ఇల్లు కడుతున్నాడు. ఐదు అంతస్తులు వేయాలన్నది ప్లాన్ అట. ఒకవేళ, అదే జరిగితే, వీధి మొత్తం రద్దీగా మారుతుంది. ఆ ఇంట్లో నివసించేవారి వాహనాల్ని రోడ్డు మీదే నిలుపుకోవాలి. ఈ ఇంటికి అనుమతి ఉందా.. లేదా.. అనేది ఎలా తెలుసుకోవాలి?

– కిశోర్, కృష్ణానగర్

● డీపీఎంఎస్ హోమ్ పేజీ (http://dpms.ghmc.telangana.gov.in/BPAMSClient/) కి వెళ్లి.. సిటిజెన్ సెర్చ్ ట్యాబ్‌లో దరఖాస్తుదారుడి పేరు, ప్లాటు నెంబరు, ప్రాంతం, సర్వే నెంబరు వంటివి ఎంటర్ చేస్తే అనుమతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుస్తాయి. ఎన్ని అంతస్తులకు అనుమతి ఉంది? సెట్‌బ్యాక్స్ ఎంత వదలాలి? వంటి విషయాలన్నీ సులువుగా తెలుసుకోవచ్చు.

# ఇల్లు అక్రమమా? సక్రమమా?

జీహెచ్‌ఎంసీ



సందేహాలు-సమాధానాలు

● సార్, నాకు కొంపల్లిలో 300 గజాల ప్లాటు ఉంది. టీడీఆర్ సర్టిఫికెట్‌ను వినియోగించుకుని, నేను ఎన్ని అంతస్తులు కట్టుకోవడానికి మీరు అనుమతిస్తారు?

– రాజారవీంద్ర, బాలానగర్

● ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారమైతే, మీరు స్టిల్ట్ (పార్కింగ్) + 3 అంతస్తులు కట్టుకోవడానికి అర్హులు. కాకపోతే, టీడీఆర్ సర్టిఫికెట్ ఉందని అంటున్నారు కాబట్టి.. సెట్‌బ్యాకులను మార్చకుండా మీరు అదనంగా ఒక అంతస్తు వేసుకోవడానికి అనుమతిస్తాం. అంటే, మీరు స్టిల్ట్ + 4 అంతస్తులు కట్టుకోవచ్చన్నమాట.

● సర్, నా ప్లాటు మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఎఫెక్ట్ అవుతున్నది. సుమారు యాభై శాతం స్థలాన్ని రోడ్డు విస్తరణలో పోగొట్టుకోవాల్సి వస్తున్నది. నేను ఈ ప్లాటును ఇవ్వడం వల్ల నాకు ఒరిగేదేమిటి?

– రామకృష్ణ, మియాపూర్

● మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాన్ని పోగొట్టుకునే వారికి ప్రభుత్వం కొన్ని ప్రత్యేక ప్రయోజనాల్ని కల్పించింది. ముందుగా, మిగిలిన ప్లాటులో ఇల్లు కట్టే క్రమంలో సెట్‌బ్యాక్స్‌కు సంబంధించి కొన్ని నిబంధనల్ని సడలించారు. మాస్టర్ ప్లాన్ కోసం మీరు సరెండర్ చేసే ప్లాటు మీద దాదాపు 400 శాతం విలువ గల టీడీఆర్ సర్టిఫికెట్ మీ చేతికొస్తుందని గుర్తుంచుకోండి.

● ఉప్పల్‌లో నాకో ప్లాటు ఉంది. జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండానే ఒక అంతస్తు అదనంగా వేసుకున్నాను. అయితే, నా వద్ద ఉన్న టీడీఆర్ సర్టిఫికెట్ ఆధారంగా అదనంగా వేసుకున్న భవనాన్ని రెగ్యులరైజ్ చేసుకోవచ్చా? ఇలాంటి అవకాశాన్ని జీహెచ్‌ఎంసీ అందజేస్తుందా?



– రాఘవరావు, ఉప్పల్

● ప్రతిఒక్కరూ కచ్చితంగా గుర్తించాల్సిన విషయమిది. అనుమతుల్లేకుండా నిర్మించిన అదనపు అంతస్తుల్ని టీడీఆర్ సర్టిఫికెట్ ద్వారా రెగ్యులరైజ్ చేసుకోవడానికి వీల్లేదు. ఇందుకు చట్టం అంగీకరించదని గుర్తుంచుకోండి.

● నేను పదిహేనేండ్ల క్రితం చందానగర్‌లో ఒక ప్లాటు కొన్నాను. అధికారులు నా ప్లాటు ఎఫ్‌టీఎల్ కిందికొస్తుందని అంటున్నారు. ఇప్పుడు నన్నేం చేయమంటారు? ఈ సమస్య నుంచి నేను ఎలా గట్టెక్కాలి?

– రామ్మోహన్, మోతీనగర్

● ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్) సరిహద్దుల్ని నీటిపారుదల, రెవెన్యూ అధారిటీలు నిర్ణయిస్తాయి. ఒకవేళ, మీరు కొన్న ప్లాటు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తే.. అందులో ఇల్లు కట్టుకోవడానికి అనుమతివ్వరు. కాకపోతే, మీ స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి ఉచితంగా సరెండర్ చేస్తే.. రెండు రెట్లు అదనంగా విలువ గల టీడీఆర్ సర్టిఫికెట్‌ను తీసుకోవచ్చు. దీన్ని అమ్ముకుంటే, మీరు ఊహించిన దానికంటే అధిక సొమ్ము లభించే అవకాశం ఉంటుంది.

● సర్, పదిహేనేండ్ల క్రితం వనస్థలిపురంలో ప్లాటు కొన్నాను. ఇప్పుడు అందులో ఇల్లు కట్టుకోవాలని అనుకుంటున్నాను. ఇందుకోసం ఆర్కిటెక్ట్ సాయం తప్పనిసరిగా తీసుకోవాలా? లేకపోతే నేరుగా నేను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చా?

– రాము, అబిడ్స్

● ఆన్‌లైన్‌లో బిల్డింగ్ పర్మిషన్ (డీపీఎంఎస్) విధానం ద్వారా మీరు సులువుగా ఇండ్ల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మీ అంతట మీరే నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. కాకపోతే, భవన నిర్మాణ నిబంధనల ప్రకారం ఇంటి ప్లాన్లను రూపొందించడానికి చాలామంది లైసెన్స్‌డ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ) సాయం తీసుకుంటుంటారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్లాట్లు, వ్యక్తిగత గృహాలు, అపార్టుమెంట్ల అనుమతులు, ఆక్యుపెన్సీ తదితర అంశాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా, సందేహాలున్నా.. మాకు రాయండి. లేదా మెయిల్ చేయండి. జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిశోర్ మీకు సమాధానాలిస్తారు. మీరు ప్రశ్నలు పంపాల్సిన మా చిరునామా:

జీహెచ్‌ఎంసీ సందేహాలు- సమాధానాలు, సంపద డెస్క్, మొదటి అంతస్తు, నమస్తే తెలంగాణ కార్యాలయం, బంజారాహిల్స్, రోడ్ నెంబరు 10, హైదరాబాద్.
mail: nt.sampada@gmail.com

## రెరా చట్టాన్ని సవరించాలి

రియల్ ఎస్టేట్ రంగంలోని లొసుగులను తొలగించి కొనుగోలుదారుల ప్రయోజనాలను పరిరక్షించడానికి.. మన దేశీయ రెరా చట్టాన్ని కొంత సవరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమోటర్లు, గృహ కొనుగోలుదారులకు మేలు కలిగే విధంగా రెరా చట్టానికి అవసరమైన సవరణలు చేయాలని పలు రాష్ట్రాలకు చెందిన నిపుణులు కోరుతున్నారు. రెరా చట్టంలో ప్రస్తుతం ఉన్న నిబంధనల్లో కొన్ని లొసుగులు ఉన్నాయనిఅంటున్నారు. రెరా చట్టంలోని నిబంధనలు, ఉపనిబంధనలతోపాటు విభాగాలు, ఉపవిభాగాలు విరుద్ధంగా ఉండటం వల్ల అనేక చట్టపరమైన వివరణలకు అవకాశం లభిస్తుంది. అందుకే రెరా చట్టంలో సవరణలు అవసరమని ఈ రంగానికి చెందిన నిపుణులు కోరుతునారు.


JACKPOT
NOW or NEVER
@ KONGARAKALAN
Near New Collector Office
HMDA L.P.No. 166/2018
8099 831 831

LAUNCHING OFFER
జనగాం బైపాస్‌కు అతి దగ్గరలో 100 ఎకరాలలో
DTCP Layout
INDIPENDENT HOUSES:
Rs. 19,99,999/- & Open Plots for Sq. 4,999/-
1 Year EMI Available
Cell: 9346735338
8074368308

ప్రగతి రిసార్ట్స్
మెగా రెసిడెన్షియల్ వెంచర్
ప్రగతి స్ఫూర్తి సెంట్రల్ కౌంటీ
DTCP APPROVED
(TLP No. 24/2016/H)
Email: crs@pragatiresorts.com
9100073539 | 7661033339

WHAT A LOCATION!
A Locality With:
✓ Excellent Lush Green Surroundings
✓ Peaceful, Safe & Secure Colonies
✓ Several Health & Educational Institutes In Vicinity
✓ Fastest Price Appreciation In Hyderabad
NCL Sindhu
Suchitra-Kompally
KOMPALLY
Hyderabad's Gateway To North Telangana





Premium & Luxury
3BHK Residences
1850 - 1920 SFT
NCL HOMES presents NCL Sindhu, an Ultramodern Gated Community in a locality surrounded by lush greenery, with just 8 km away from Paradise circle, built by a group which has decades of experience building many admirable communities in the city.
Built On 5.5 Acres | 9 Floors, 414 Apartments Spread Over 6 Blocks
Lush Green Surroundings | High Quality Specifications & Materials
Exceptional Amenities | 8 Kms From Paradise Circle | Ready To Occupy Flats
3 Blocks Handed Over - 250+ Happy Families Residing
Powered by: NAGARJUNA | NCL WINDOORS | NCL AAC BLOCKS | NCL alltek PUTTIES + TEXTURES | VEKA
NCL HOMES LTD. LIVE HAPPY
Call: 799 799 9001/2/3
www.nclhomes.in

WHERE COMFORT, CONVENIENCE & CHARM BLEND TOGETHER !





LAUNCHING
AFFORDABLE VILLAS & OPEN PLOTS @
POCHARAM, MUTHANGI JUNCTION, PATANCHERU, HYDERABAD
Mahidhara LUXURIA
A PARADISE ON EARTH
₹74 LAKHS ONWARDS
50+ ACRES
727 PLOTS
46% OPEN SPACES







PROJECT HIGHLIGHTS
- Majestic Entrance Gate
- 120' / 50' / 40' / 30' wide black top roads
- Underground electricity provision
- Street lighting
- Rain water harvesting
- Centralized overhead water tank with gravity water supply
- Underground drainage sewage system (STP)
- Designed parks with sitting areas
- Children's Play Area
- Visitors parking bay
- Jogging track
- Cycling track
- Sports area with court yard
- Club house with swimming pool attached party lawn
- Avenue plantation
- Vastu compliant







CLUB HOUSE AMENITIES
- Swimming Pool
- Gym
- Banquet Hall
- Indoor Games
- Creche
- Party Lawn
- Super Market
- Pantry
- Visitor's Lounge
- Library

STRATEGIC AREAS
- Outer Ring Road - 05 mins
- NH 65 - Mumbai Highway - 05 mins
- International Schools - 15 mins







LOANS AVAILABLE FROM ALL LEADING BANKS
Mahidhara PROJECTS PVT. LTD.
HYDERABAD • CHENNAI • BENGALURU
Plot No. 15, Mahi Towers, Hitec City, Madhapur, Hyderabad - 500 081.
Email: sales@mahidharaprojects.com
www.mahidharaprojects.com
Follow us on: mahidharaprojects
REAL ESTATE RERA
RERA NUMBER P01100001071
A Member of TREDA
Approved by hmda Growing Global
99599 56789
98938 69999
040 4267 3399

# ఎఫ్‌ఏటీఎఫ్ బ్లాక్ లిస్ట్‌లో పాకిస్థాన్

- ఉగ్ర నిధుల సరఫరా, హవాలా లావాదేవీల నియంత్రణలో పాక్ విఫలమైనట్లు ఆక్షేపణ



**న్యూఢిల్లీ:** ఉగ్రవాదులకు నిధుల అందజేతను, హవాలా లావాదేవీలను నిలువరించడంలో విఫలమైనందుకు పాకిస్థాన్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) అనుబంధ ఆసియా పసిఫిక్ గ్రూప్ (ఏపీజీ) నిర్ణయించింది. ఎఫ్ఏటీఎఫ్ నిర్దేశిత ప్రమాణాలను పాటించడంలో పాక్ విఫలమైందని ఏపీజీ పేర్కొన్నట్లు భారత్ అధికారి ఒకరు చెప్పారు. 41 సభ్య దేశాలతో కూడిన ఎఫ్ఏటీఎఫ్–ఏపీజీ ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలో ఈ నెల 18–23 మధ్య సమావేశమైంది. ఎఫ్ఏటీఎఫ్ ప్రణాళిక అమలులో పాకిస్థాన్ సాధించిన ప్రగతిపై ఈ సమావేశం రెండు రోజుల్లో ఏడు గంటలకుపైగా చర్చించింది. ఉగ్రవాదులకు నిధులు అందకుండా చూడటంతోపాటు హవాలా లావాదేవీలు జరుగకుండా నివారించడంలో ఎఫ్ఏటీఎఫ్ 40 నిర్దేశిత ప్రమాణాల్లో పాక్ 32 ప్రమాణాల అమలులో విఫలమైందని సమావేశం నిర్ధారించింది. 11 కీలకమైన నిబంధనల అమలులో పాక్ 10వ స్థానంలో నిలిచింది. ఏ ఒక్క నిబంధన అమలు విషయంలోనూ పాక్ సభ్యదేశాలను అంగీకరింపజేయలేకపోయింది.

- మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీతో పాటు గుజరాత్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ!

# జాతీయ రాజకీయాల వైపు మజ్లిస్ చూపు



**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** జాతీయ రాజకీయాలవైపు మజ్లిస్ ఏ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) వడివడిగా అడుగులు వేస్తున్నది. తెలంగాణలోనే కాకుండా దేశంలో ప్రధానరాష్ట్రాల్లో తన బలాన్ని పెంచుకుని జాతీయపార్టీగా ఎదిగేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఇప్పటికే మహారాష్ట్రలో ఉనికిచాటుకున్న ఎంఐఎం.. బీహార్, జార్ఖండ్, గుజరాత్ రాష్ట్రాలవైపు దృష్టి సారించింది. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న మహారాష్ట్రతోపాటు జార్ఖండ్‌లో బరిలోకి దిగాలని నిర్ణయించింది. ఈ మేరకు జార్ఖండ్‌లో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటుచేయబోతున్నది. ముస్లింల ప్రాబల్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో పోటీ చేయనున్నది. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ప్రకాశ్ అంబేద్కర్ నాయకత్వంలోని భరిపా బహుజన్ మహాసంఘ్‌తో పొత్తుకు చర్చలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర అసెంబ్లీకి వచ్చే అక్టోబర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలలో ముస్లింలు అధికసంఖ్యలో ఉన్న దాదాపు 30 నియోజకవర్గాలపై మజ్లిస్ గురిపెట్టింది. గత మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో 24 స్థానాల్లో పోటీచేసి, ఔరంగాబాద్, ముంబై బైకులా అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపొందిన ఎంఐఎం.. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఔరంగాబాద్ నుంచి గెలుపొందింన విషయం తెలిసందే. మరోవైపు త్వరలో జరిగే గుజరాత్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేయాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గుజరాత్‌లో ప్రత్యేకంగా కార్యాలయం విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నాయి.



# తమిళనాట ఉగ్ర కలకలం



క్షతగాత్రులను దవాఖానకు తరలిస్తున్న సిబ్బంది

## ఆలయం వద్ద తొక్కిసలాట

- ముగ్గురు మృతి, 20 మందికి గాయాలు
- పశ్చిమ బెంగాల్‌లో దుర్ఘటన

**కోల్‌కతా, ఆగస్టు 23:** పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో శుక్రవారం ఓ దేవాలయం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు చనిపోగా, మరో 20 మందికిపైగా గాయపడ్డారు. కోల్‌కతాకు 50 కి.మీ. దూరంలోని కచువా సమీపంలో ఉన్న లోక్‌నాథ్ ఆలయం వద్ద తెల్లవారుజామున దాదాపు 2.15 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. 18వ శతాబ్దానికి చెందిన బెంగాలీ సాధువు బాబా లోక్‌నాథ్ బ్రహ్మచారి జయంతి వేడుకను జరుపుకొనేందుకు ఏటా ఆగస్టు 23న ఈ దేవాలయానికి లక్షల మంది తరలివస్తారు. ఈసారి కూడా భారీగా ప్రజలు తరలిరావడంతో తొక్కిసలాట జరిగింది. క్షతగాత్రులను కోల్‌కతాలోని పలు దవాఖానలకు తరలించారు. సీఎం మమతా బెనర్జీ నేషనల్ మెడికల్ కాలేజీ దవాఖానకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఈ ఏడాది కచువా లోక్‌నాథ్ ఆలయానికి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున భారీవర్షం ప్రారంభమవడంతో వారంతా దేవాలయానికి వెళ్లే రోడ్డులో వెదురుతో తాత్కాలికంగా నిర్మించిన స్టాళ్ల కింద తలదాచుకున్నారు. ఆ తర్వాత వర్షం అధికమవడంతో ఆ స్టాళ్లు కూలిపోయాయి. ఆ ప్రాంతం చాలా ఇరుకుగా, రద్దీగా ఉండటంతో కొంతమంది ఆలయం పక్కనే ఉన్న చెరువులో పడిపోయారు. దీంతో గందరగోళం తలెత్తి తొక్కిసలాట లాంటి పరిస్థితికి దారితీసింది' అని తెలిపారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు సీనియర్ మంత్రులను పంపామన్నారు. మరణించినవారికి రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడినవారికి రూ.50 వేల పరిహారం ప్రకటించారు.

## నాలుగునెలల అనంతరం శ్రీలంకలో ఎమర్జెన్సీ ఎత్తివేత

**కొలంబో:** శ్రీలంక ప్రభుత్వం ఎమర్జెన్సీని ఎత్తివేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 21న దేశంలో ఈస్టర్ ఆదివారం నాడు 258 మంది ప్రాణాలు బలిగొన్న వరుస బాంబు పేలుళ్ల అనంతరం ప్రభుత్వం ఎమర్జెన్సీని విధించింది. ఆ తర్వాత ప్రతినెలా పొడిగిస్తూ వచ్చింది. అయితే తాజాగా పొడిగించలేదు. అధికారవర్గాల సమాచారం మేరకు.. ఎమర్జెన్సీని మరో నెల పొడిగిస్తూ జారీ చేసే గెజిట్ గురువారం విడుదల కాలేదు. దేశంలోకి పర్యాటకుల రాక భారీగా తగ్గిపోవడంతో ఎమర్జెన్సీ ఎత్తివేతకు పర్యాటక పరిశ్రమ పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేసింది.

- శ్రీలంక నుంచి భారత్‌లోకి చొరబడిన ఆరుగురు ఉగ్రవాదులు
- హెచ్చరించిన ఆర్మీ నిఘా వర్గాలు
- నుదుటిపై తిలకం పెట్టుకొని హిందువుల్లాగా ప్రవేశం
- ఉగ్రవాదుల్లో ఒకరు పాకిస్థానీ, ఐదుగురు శ్రీలంక తమిళ ముస్లింలు
- హెచ్చరించిన ఆర్మీ నిఘా వర్గాలు
- కోయంబత్తూర్‌తో పాటు తమిళనాడు, కేరళలో హైఅలర్ట్

**కోయంబత్తూర్, ఆగస్టు 23:** దక్షిణాది రాష్ట్రం తమిళనాడులో ఉగ్రజాడ కలకలం రేపింది. లష్కరే తొయిబా(ఎల్ఈటీ)కు చెందిన ఆరుగురు ఉగ్రవాదులు కొయంబత్తూర్ జిల్లాలోకి చొరబడినట్టు ఆర్మీ నిఘా వర్గాలు చేసిన హెచ్చరికలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో హైఅలర్ట్ ప్రకటించారు. ఉగ్రవాదులు శ్రీలంక నుంచి భారత్‌లోకి చొరబడినట్టు అధికారులు తెలిపారు. ముష్కరుల్లో ఒకరు పాకిస్థానీ కాగా.. ఐదుగురు శ్రీలంక తమిళ ముస్లింలుగా తెలుస్తున్నది. నుదుటిపై తిలకం పెట్టుకొని హిందువుల్లాగా దేశంలోకి చొరబడి ఈ ఉగ్ర చర్యలకు కుట్ర పన్నుతున్నారని నిఘా వర్గాలు సమాచారమిచ్చాయి. పాకిస్థాన్‌కి చెందిన వ్యక్తిని ఇలియాస్ అన్వర్‌గా భద్రతాధికారులు గుర్తించారు. భద్రతలో భాగంగా అధికారులు కొయంబత్తూర్ నగరవ్యాప్తంగా 2,000 మంది పోలీసులను మోహరించారు. వాహనాలు, హోటళ్లు, లాడ్జీల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. 'నగరంలో సుమారు 2,000 మంది పోలీసులను మోహరించాం. ఎల్ఈటీ బృందానికి సంబంధించిన సమాచారాన్ని నిఘా వర్గాల నుంచి ఎప్పటికప్పుడు సేకరిస్తున్నాం. ప్రార్థనా మందిరాల దగ్గర భద్రతను పెంచాం. బస్టాండ్, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో పోలీసులను మోహరించాం' అని నగర పోలీసు కమిషనర్ సుమిత్ శరణ్ శుక్రవారం తెలిపారు. ఉగ్ర కలకలం నేపథ్యంలో పశ్చిమ జోన్‌లోని ఎనిమిది జిల్లాల్లో భద్రతను కట్టుదిట్టం చేశామని, సుమారు 7వేల మంది పోలీసులు తనిఖీల్లో పాల్గొంటున్నట్టు పశ్చిమ జోన్ ఐజీ పేరయ్య తెలిపారు. మరోవైపు, చెన్నై నగరంలో కూడా భద్రతను మరింత పటిష్ఠం చేసినట్టు నగర కమిషనర్ ఏ కే విశ్వనాథన్ తెలిపారు. 'అనుమానాస్పద వ్యక్తుల కదలికలను కనుక్కోవడానికి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం' అని ఆయన అన్నారు. మరోవైపు, అపరిచిత వ్యక్తులు నగరంలోకి ప్రవేశించడం, నివసించడం తదితర సమాచారాన్ని సేకరించడానికి పోలీసు శాఖ ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్ర సచివాలయంతో పాటు ముఖ్యమైన ప్రాంతాల్లో పోలీసులు గస్తీ పెంచారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించడానికి అదనపు డైరెక్టర్ జనరల్ జయంత్ మురళి గురువారం రాత్రే కొయంబత్తూర్ చేరుకున్నారు. తీర ప్రాంతాల్లోని మారుమూల ప్రదేశాల లోకి ఉగ్రవాదులు పడవల ద్వారా ప్రవేశించి ఉండవచ్చన్న నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. తీర ప్రాంతాల్లోని అనుమానాస్పద పడవలపై గట్టి నిఘాను పెట్టాలని తమిళనాడు డీజీపీ జే కే త్రిపాఠి అధికారులను ఆదేశించారు.



కోయంబత్తూర్‌లో భారీగా మోహరించిన పోలీసులు



కోయంబత్తూర్ బస్టాండ్‌లో ప్రయాణికుల లగేజీని తనిఖీ చేస్తున్న అధికారులు

**శబరిమల ఆలయంలో భద్రత కట్టుదిట్టం**

తమిళనాడులోకి ఉగ్రవాదులు ప్రవేశించారన్న నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో తమిళనాడు, కేరళలో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. తమిళనాడులోని తీరప్రాంతాలన్నిటిలో గురువారం అర్ధరాత్రి నుంచి పోలీసులు భద్రతను పెంచారు. కేరళలోని అన్ని జిల్లాల్లో హై అలర్ట్ విధిస్తూ రాష్ట్ర డీజీపీ లోక్‌నాథ్ బెహ్రా ఆదేశాలు జారీ చేశారు. బస్టాండు, రైల్వే స్టేషన్, విమానాశ్రయంతో పాటు శబరిమల, గురువాయూర్ ఆలయాల్లో కూడా భద్రతను పెంచారు. కేరళ, తమిళనాడు సరిహద్దుల్లోని పాలక్కాడ్, త్రిసూర్, ఎర్నాకుళం జిల్లాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ ఉగ్ర కుట్రకు ఓ కేరళ వ్యక్తి కూడా సహకారం కూడా ఉందన్న సమాచారం నేపథ్యంలో అధికారులు ఆ దిశగా విచారణ జరుపుతున్నారు.

## కశ్మీర్‌లోకి చొరబాటు ప్రయత్నాలు

- ఆఫ్ఘనిస్థాన్, పస్థూన్ తెగవారిని నియమించుకుంటున్న పాక్
- నిఘావర్గాలు వెల్లడి

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీయడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తున్నదని నిఘా వర్గాలు తెలిపాయి. ఇందుకోసం ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన వారితోపాటు పస్థూన్ తెగవారిని నియమించుకుంటున్నదని, వీరిని సరిహద్దులోని నియంత్రణ రేఖ గుండా కశ్మీర్‌లోకి పంపించాలని పన్నాగం పన్నుతున్నదని చెప్పాయి. ఇలాంటి వారు 100 మందికిపైగా సరిహద్దులోని నియంత్రణ రేఖ వెంట ఉన్న వివిధ పోస్టుల వద్ద విధులు కూడా నిర్వహిస్తున్నారని వివరించాయి. అంతేగాక పాకిస్థాన్‌కు చెందిన బోర్డర్ యాక్షన్ టీం (బీఏటీ) సహాయంతో కశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించడానికి జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నాయి. భారత పోస్టులపై బీఏటీ సైనికులు కాల్పులు జరుపుతున్నప్పుడు ఈ ఉగ్రవాదులను నియంత్రణ రేఖ దాటించాలన్నది పాక్ పన్నాగమని తెలిపాయి. ఓ అధికారి మాట్లాడుతూ దేశంలోని ప్రధాన నగరాల్లో భారీ ఉగ్రదాడులు జరుగొచ్చని, అలాగే జమ్ముకశ్మీర్‌లో హింసాత్మక ఘటనలు కూడా జరిగే అవకాశముందని చెప్పారు. వీటిని దీటుగా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

## జైరాం రమేశ్‌కు సింఘ్వీ, థరూర్ బాసట

- ప్రధాని మోదీ ప్రతీ పనిపై విమర్శలు తగదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ చేసే ప్రతీ పనిని తప్పు పట్టొద్దన్న కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్‌కు ఆయన సహచర నేతలు అభిషేక్ సింఘ్వీ, శశిథరూర్ శుక్రవారం బాసటగా నిలిచారు. గురువారం ఒక పుస్తకావిష్కరణ సభలో జైరాం మాట్లాడుతూ.. 'ప్రధాని చేసే పనులను గుర్తించకుండా ఎల్లవేళలా ఆయనను దెయ్యంలా చూస్తే విపక్షాలకు ఉపయోగపడదు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూజే) విజయవంతమైందంటే ప్రధాని మోదీ వల్లే' అన్నారు. జైరాం వ్యాఖ్యలపై సింఘ్వీ స్పందిస్తూ 'మోదీ చేపట్టే పనులను వ్యక్తిగతంగా చూడవద్దు. పనుల్లో మంచి చెడ్డలు ఉంటాయి. ఆయన చర్యలను అంశాల వారీగా చూడాలే తప్ప, వ్యక్తిగతంగా చూడొద్దు' అని ట్వీట్ చేశారు. శశిథరూర్ స్పందిస్తూ.. 'మోదీ మంచి చేసినా, మంచి మాట్లాడినా ప్రశంసించాలి. ఆయన చేసే పొరపాట్లను తప్పుబట్టినప్పుడు మాత్రమే విపక్షాల విమర్శలకు విశ్వసనీయత లభిస్తుంది' అని అన్నారు.

## ఆ టికెట్ రోల్స్ పొరపాటున వెళ్లాయి

తిరుమలలో అన్యమత ప్రచారంపై ఏపీఎస్ ఆర్టీసీ వివరణ

**అమరావతి:** తిరుమలలో బస్సు టికెట్ల వెనుక అన్యమత ప్రచారానికి సంబంధించిన ప్రకటనలు ముద్రించి ఉండటంపై భక్తులతోపాటు వివిధ ధార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఈ వ్యవహారంలో వైఎస్ జగన్ ప్రభుత్వంపై టీడీపీ, బీజేపీ విమర్శలు సంధిస్తుండగా.. మరోవైపు ఈ ఉదంతంపై దర్యాప్తు జరిపించాలని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామి డిమాండ్ చేశారు. దీంతో ఏపీఎస్‌ఆర్టీసీ స్పందించింది. వేరే ప్రాంతానికి వెళ్లాల్సిన టికెట్ రోల్స్‌లో ఐదు బండిళ్లు పొరపాటున తిరుమలకు వెళ్లాయని, ఇందులో దురుద్దేశమేదీ లేదని అధికారులు వివరణ ఇచ్చారు. తిరుమలలో అన్యమత ప్రచారంపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించామని ఏపీ దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

# కార్మికులకు కనీస వేతనం

- అమల్లోకి రానున్న వేతనాల కోడ్- 2019 బిల్లు
- 50 కోట్ల మందికి లబ్ధి
- ఇకపై మహిళలు, పురుషుల వేతనాల్లో వ్యత్యాసం ఉండదు



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉన్న 50 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనం అందనున్నది. ఇందుకు వీలు కల్పించే వేతనాల కోడ్–2019 బిల్లును కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. వేతనాలు, బోనస్‌లకు సంబంధించిన వివిధ నిబంధనలు, సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించిన విషయం తెలిసిందే. వేతనాల కోడ్–2019 బిల్లు జూలై 30న లోక్‌సభలో, ఆగస్టు 2న రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈనెల 8న దీన్ని రాష్ట్రపతి ఆమోదించారు. దేశవ్యాప్తంగా ఉన్న 50 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనాన్ని అందించడంతో పాటు.. వేతనాల చెల్లింపుల్లో జాప్యం వంటి సమస్యల పరిష్కారానికి ఈ బిల్లు మార్గం చూపిస్తుందని భావిస్తున్నారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే, పురుషులు, మహిళలు, ట్రాన్స్ జెండర్స్‌కి చెల్లిస్తున్న వేతనాల్లో కూడా వ్యత్యాసం పోనున్నది. ఈ బిల్లు చట్టంగా మారిన తర్వాత.. ప్రస్తుతం వేతనాలు, బోనస్ తదితర చెల్లింపుల కోసం అమలు చేస్తున్న కనీస వేతనాల చట్టం, వేతనాల చెల్లింపు చట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమాన వేతన చట్టాలు రద్దవుతాయి. వాణిజ్య సంఘాలు, యజమానులు, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యులుగా గల ఓ త్రైపాక్షిక కమిటీ కార్మికులకు కనీస వేతనాన్ని నిర్ణయిస్తుంది. వేతనాల స్థాయి, పనిచేస్తున్న రంగంతో సంబంధం లేకుండా దేశవ్యాప్తంగా అందరు కార్మికులకు కనీస వేతనంతో పాటు, సమయానికి వేతన చెల్లింపులు జరుపడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశ్యం. 2017 ఆగస్టులో వేతనాల కోడ్ బిల్లును ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని స్టాండింగ్ కమిటీకి సిఫారసు చేస్తూ 16వ లోక్‌సభ తీర్మానించింది. ఈ మేరకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అయితే ఈలోగా గత లోక్‌సభ రద్దు కావడంతో బిల్లు మురిగిపోయింది.

## సరిహద్దుల్లో మరోసారి పాక్ కాల్పులు

- ఓ సైనికుడి మృతి.. వారంలో నలుగురు దుర్మరణం

**జమ్ము, ఆగస్టు 23:** పాకిస్థాన్ శుక్రవారం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్ముకశ్మీర్ రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ వెంట కాల్పులకు తెగబడింది. పాక్ కాల్పుల్లో ఓ సైనికుడు ప్రాణాలు కోల్పోయాడు. దీనికి భారత సైన్యం దీటుగా బదులిచ్చిందని అధికారులు తెలిపారు. గత వారం రోజుల్లో పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా, వారిలో ముగ్గురు సైనికులు ఉన్నారు. 'నౌషెరా సెక్టార్‌లో పాకిస్థాన్ సైన్యం నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. భారత సైన్యంపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడింది. ఎదురుకాల్పుల్లో పశ్చిమబెంగాల్ జల్‌పాయ్‌గురి జిల్లాలోని మెచ్వారా గ్రామానికి చెందిన సైనికుడు నాయక్ రాజీవ్ థాప(34) వీరమరణం పొందారు' అని రక్షణశాఖ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ తెలిపారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన సైనికులను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుదని చెప్పారు. పాక్ కాల్పులకు పాల్పడటంతో భారత సైన్యం దీటుగా సమాధానం ఇచ్చిందని పేర్కొన్నారు. పాక్ సైనిక స్థావరాలను తీవ్రంగా నష్టపరిచిందని, అక్కడి సైనికులు సైతం మృతిచెందారని తెలిపారు. వరుస కాల్పుల నేపథ్యంలో ఉన్నత స్థాయి ఆర్మీ కమాండర్ పూంచ్, అక్నూర్ సెక్టార్లలో పర్యటించారు. నియంత్రణ రేఖ వెంట సైన్యాన్ని మరింత అప్రమత్తం చేశారు.

# యూరియా కొరత రానివ్వం

- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- మార్క్‌ఫెడ్ అధికారులతో సమీక్షలో మంత్రి నిరంజన్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతులకు యూరియా కొరత లేకుండా అవసరమైన మేరకు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పష్టంచేశారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్‌లో రాష్ట్రంలో ఎరువుల స్థితిగతులపై మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వానకాలం సీజన్‌కు రాష్ట్రానికి 8.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోటాను కేంద్రం కేటాయించగా, ఇప్పటివరకు 3.97 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందని తెలిపారు. ప్రస్తుతం 2.12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదని చెప్పారు. ఎరువుల కోటా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నందున ఏటా ఆయా రాష్ట్రాల వాడకం ఆధారంగా కోటా పెంచుతారన్నారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయి కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి రావడంతో సాగు విస్తీర్ణం పెరిగిందని, ఫలితంగా ఎరువుల వినియోగం గణనీయంగా పెరుగనున్న విషయాన్ని ముందే ఊహించి ఈ నెల 19న కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు తెలంగాణ ప్రభుత్వం తరపున లేఖ రాసినట్టు చెప్పారు. అలాగే శుక్రవారం కేంద్ర ఎరువుల శాఖ జాయింట్ సెక్రటరీ గుర్వీందర్‌సింగ్‌తో ఫోన్ ద్వారా సమస్య తీవ్రతను వివరించానని, జిల్లాలవారీగా యూరియా డిమాండ్ పరిస్థితులను చెప్పానని తెలిపారు. కృష్ణపట్నం, వైజాగ్ పోర్టుల్లో ఉన్న యూరియా.. తెలంగాణ ర్యాక్ పాయింట్స్‌కు వెంటనే తరలించాలని కోరారు. ఈ విషయంలో జాయింట్ సెక్రటరీ సానుకూలంగా స్పందించారని, వెంటనే యూరియా కోటా పంపిస్తారని భావిస్తున్నట్టు మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

## పెట్రోల్ బంకుల్లో అక్రమాలపై కేసులు

- రాష్ట్రవ్యాప్తంగా 183 బంకులకు నోటీసులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న అక్రమాలపై పౌరసరఫరాలశాఖ కొరడా ఝుళిపించింది. ఈ నెల 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి 183 బంకులకు నోటీసులు జారీచేసింది. పెట్రోల్, డీజిల్ పోసే క్రమంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని, కల్తీచేసి అక్రమాలకు పాల్పడుతున్నారని వస్తున్న ఫిర్యాదులపై పౌరసరఫరాలశాఖ స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ఆయా జిల్లాల పౌరసరఫరాలశాఖ అధికారులు తూనికలు కొలతలశాఖ, చమురు సంస్థల సిబ్బంది సహకారంతో తనిఖీలు నిర్వహించారు. 638 బంకుల్లో 20 రోజులపాటు వరుసగా తనిఖీలు జరిపి ఇందులో 183 బంకులకు నోటీసులిచ్చారు.

## హెలికాప్టర్‌కు తప్పిన ముప్పు

- సురక్షితంగా బయటపడిన పైలట్, కోపైలట్, ఉత్తరాఖండ్‌లో ఘటన

**డెహ్రాడూన్:** ఉత్తరాఖండ్ రాష్ట్రంలో వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఓ హెలికాప్టర్‌కు శుక్రవారం తృటిలో ముప్పు తప్పింది. పైలట్, కోపైలట్ ప్రాణాలతో బయటపడ్డారు. హెలికాప్టర్ స్వల్పంగా ధ్వంసమైనట్టు అధికారులు చెప్తున్నారు. వివరాల్లోకెళితే.. ఉత్తరాఖండ్ ఉత్తర కాశి జిల్లాలో పలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. రెండు రోజుల క్రితం మోల్డీ ప్రాంతంలో ఓ ప్రైవేట్ హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ముగ్గురు చనిపోవడంతో సహాయక చర్యలను నిలిపివేశారు. తిరిగి శుక్రవారం ఉదయం వరదల్లో చిక్కుకున్నవారికి ఆహారపొట్లాలు, ఇతర వస్తువులు ఇచ్చేందుకు వెళ్తున్న ఆర్యన్ ఏవియేషన్ సంస్థకు చెందిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో పైలట్ చాకచక్యంగా వ్యవహరించి టికోచి సమీపంలోని నది ఒడ్డున అత్యవసరంగా దింపేసాడు. దాంతో పైలట్, కోపైలట్ సురక్షితంగా బయటపడగా.. హెలికాప్టర్ స్వల్పంగా ధ్వంసమైనట్టు ఉత్తరకాశి లా అండ్ ఆర్డర్ డీజీ అశోక్‌కుమార్ చెప్పారు. ఉత్తరకాశి జిల్లాలోని మోరి బ్లాక్‌లో వరదలకు 16 మంది చనిపోగా, మరో ఆరుగురు కనిపించకుండా పోయారు. భారీ వర్షాల కారణంగా ఉత్తరకాశి జిల్లావ్యాప్తంగా రూ.130 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనావేశారు.

# రాజీనామా చేయకుండా పారిపోయారు

- అలాంటి బీజేపీ నేతలు మాపై విమర్శలు చేయడమా!
- క్యాబినెట్‌ను అవమానపర్చేలా మాట్లాడిన ఎంపీ సంజయ్ క్షమాపణ చెప్పాలి
- టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో రాజీనామాలు చేయాలంటే పారిపోయిన చరిత్ర బీజేపీ నాయకులదని, అలాంటి తెలంగాణ ద్రోహులు టీఆర్‌ఎస్‌పై విమర్శలు చేయడమేమిటని టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు. టీఆర్‌ఎస్‌పై విమర్శలు చేయడంలో ఉత్సాహం చూపుతున్న బీజేపీ నేతలు.. రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో చూపించాలని సూచించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ క్యాబినెట్‌ను అవమానపర్చేలా ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రజాప్రతినిధిగా ఒక హోదాలో ఉన్న వ్యక్తి హుందాగా మాట్లాడితే బాగుంటుందని, వెంటనే ఆయన తెలంగాణ జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్న కిషన్‌రెడ్డి రాజీనామా చేయకుండా వెనుక్కి తగ్గి అమెరికా పారిపోయారని విమర్శించారు. మరో ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ ఇంటి ముందు తెలంగాణవాదులు ధర్నాలు, ఆందోళనలు చేస్తేకానీ రాజీనామా చేయలేదనే విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని అవమానపరుస్తూ ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ ఎందుకు అభ్యంతరం చెప్పలేదు? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు నీతి ఆయోగ్ సిఫారసు చేసిన రూ.24 వేల కోట్ల నిధులు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏమయిందని ప్రశ్నించారు. నలుగురు ఎంపీలు గెలువగానే బీజేపీ నేతలు భ్రమల్లో మునిగితేలుతున్నారని, ఆ తరువాత జరిగిన పరిషత్ ఎన్నికల్లో 32 జెడ్పీలను టీఆర్‌ఎస్ గెలుచుకున్న విషయాన్ని మరిచిపోతున్నారని ఎద్దేవాచేశారు.

## కరువుసీమలో వజ్రాలవేట

**అమరావతి:** రాయలసీమలోని కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వజ్రాలవేట జోరుగా సాగుతున్నది. గత కొద్దిరోజుల నుంచి కురుస్తున్న భారీవర్షాలకు వజ్రాలు బయటపడతాయన్న నమ్మకంతో కర్నూలు జిల్లా తుగ్గలి, అనంతపురం జిల్లా వజ్రకరూరు ప్రాంతాలకు జనం క్యూకడుతున్నారు. దూరప్రాంతాల నుంచి బైక్‌లు, ఆటోలు, కార్లలో తరలివచ్చి అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు. పగలాంతా చేలు, చెలకల్లో వజ్రాలవేట సాగిస్తున్నారు. తుగ్గలి మండలంలో గత రెండు నెలల్లోనే అత్యంత విలువైన మూడు వజ్రాలు బయల్పడ్డాయి. అవి దాదాపు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల ధర పలుకడం, అనంతపురం జిల్లా గుత్తి సమీపంలోని జొన్నగిరిలో కూడా వజ్రాలు లభించాయన్న సమాచారం రాష్ట్రమంతటా విస్తరించింది. దీంతో వర్షాలు కురువడమే తడువుగా జనం తండోపతండాలుగా తరలివచ్చి వజ్రాలవేట సాగిస్తున్నారు. వజ్రకరూరు సమీపంలోని ఉయ్యాలగుట్ట, మారెమ్మ అవ్వ గుట్ట, రేణిమాను కుంట, సూలాలగుట్టతోపాటు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) క్యాంపునకు పడమటివైపున గల పొలాల్లో వజ్రాలు ఎక్కువగా బయల్పడుతుండటంతో ఆ ప్రాంతాల్లో అన్వేషణ ముమ్మరంగా సాగుతున్నది.

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
శనివారం 24 ఆగస్టు 2019

## పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సివచ్చింది!





అడివి శేష్, వెంకట్ రామ్‌జీ

'నేను అమెరికాలో ఉన్నప్పుడు బట్టలు కొనుక్కోవడానికి ఇబ్బంది పడిన రోజులున్నాయి. కెరీర్ తొలి నాళ్లలో 'కిస్' సినిమా తీసి చాలా నష్టపోయాను. ఎంతలా అంటే సినిమా పోస్టర్లకు అంటించిన మైదాపిండి ఖర్చుకూడా రాలేదు. అప్పులు ఇచ్చిన వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు' అన్నారు అడివి శేష్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'ఎవరు' ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. వెంకట్ రామ్‌జీ దర్శకుడు. పీవీపీ నిర్మాత. శుక్రవారం థాంక్స్‌మీట్‌ను నిర్వహించారు. అడివి శేష్ మాట్లాడుతూ 'కాలిఫోర్నియా నుంచి వచ్చినా కృష్ణానగర్ కష్టాలు నాకు తెలుసు. 'కిస్' సినిమాకు మూడు కోట్లు నష్టపోయాను. అప్పుల వాళ్ల ఫిర్యాదుతో ఢిల్లీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాల్సివచ్చింది. ఆ తర్వాత 'మనసుకు నచ్చిందే చేస్తాను. మన స్ఫూర్తిగా చేస్తాను' అని నిర్ణయించుకున్నాను. 'క్షణం' తర్వాత అడివి శేష్ 2.ఓ ప్రయాణం మొదలైంది. వరుసగా నాలుగు విజయాలొచ్చాయి. గత రెండురోజుల్లో నలుగురు నిర్మాతలు ఫోన్లు చేసి కథ ఏదైనా సరే నాతో సినిమా చేస్తామని అడుగుతున్నారు. అలాంటి నమ్మకం కోసమే ఇన్ని రోజులు పనిచేశాను. కెరీర్ ముగిసిన తర్వాత 'అడివి శేష్ మంచి సినిమాలు చేశాడు' అని అందరూ అనుకుంటే అదే చాలు. అంతేకాని నాకు కటౌట్లు కట్టాలని, పాలాభిషేకాలు చేయాలని కోరుకోను' అన్నారు. అందరూ సినిమాను ప్రేమించి పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని, దర్శకుడిగా తన ప్రయాణంలో మిత్రులు, శ్రేయోభిలాషులు ఎంతగానో సహకరించారని దర్శకుడు వెంకట్ రామ్‌జీ తెలిపారు. రెజీనా మాట్లాడుతూ 'మేము ఊహించిన దాని కంటే సినిమా పెద్ద విజయం సాధించింది. విడుదలకు ముందే సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో ఉందనిపించింది. ప్రేక్షకాదరణ దానిని రుజువు చేసింది' అని చెప్పింది. ఛాయాగ్రాహకుడిగా అరంగేట్ర చిత్రానికే ఈ స్థాయిలో పేరురావడం ఆనందంగా ఉందని వంశీ పచ్చిపులుసు పేర్కొన్నారు. తన ప్రయాణంలో అడివి శేష్ ఇంకా ఎదగాలని మాటల రచయిత అబ్బూరి రవి ఆకాంక్షించారు.

రెజీనా

## జైపూర్‌లో ఆటపాట



రజనీకాంత్

రజనీకాంత్ కథానాయకుడిగా ఏ.ఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'దర్బార్'. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నది. ఇటీవలే రాజస్థాన్‌లోని జైపూర్‌లో రజనీకాంత్, నయనతారలపై బృందా మాస్టర్ సారథ్యంలో ఓ మాస్ గీతాన్ని చిత్రబృందం తెరకెక్కించింది. ప్రత్యేకమైన సెట్‌లో సింగిల్ లాంగ్ టేక్‌లో చిత్రీకరించిన ఈ గీతం రజనీ అభిమానుల్ని ఆకట్టుకుంటుందని చెబుతున్నారు. జైపూర్‌లోనే పతాకఘట్టాలతో పాటు యాక్షన్ సన్నివేశాల్ని చిత్రీకరించబోతున్నారు. ముంబయి నేపథ్యంలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రజనీకాంత్ పోలీస్ అధికారిగా కనిపించబోతున్నారు. దాదాపు ఇరవై ఐదేళ్ల తర్వాత ఆయన పోలీస్ పాత్రలో నటిస్తున్న చిత్రమిది. నివేథా థామస్ ఈ సినిమాలో కీలక పాత్రను పోషిస్తున్నది.

## రైతు పాత్రలో..



శర్వానంద్

ఇటీవలే 'రణరంగం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు శర్వానంద్. ఈ సినిమాలో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించిన ఆయన త్వరలో నాగలి పట్టి వ్యవసాయం చేయబోతున్నారు. శర్వానంద్ కథానాయకుడిగా 14 రీల్స్ ప్లస్ పతాకంపై 'శ్రీకారం' పేరుతో ఓ చిత్రం తెరకెక్కనున్నది. ఈ సినిమా ద్వారా కిషోర్‌రెడ్డి దర్శకుడిగా పరిచయం కానున్నారు. రైతు సమస్యల నేపథ్యంలో ఎమోషనల్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో శర్వానంద్ రైతు పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. త్వరలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి హైదరాబాద్, తిరుపతి, అనంతపూర్‌లలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించనున్నట్లు చెబుతున్నారు. సత్యరాజ్ ఈ సినిమాలో కీలక పాత్రను పోషించనున్నట్లు సమాచారం. సంక్రాంతికి సినిమాను విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నది.

## వెంకట్‌ప్రభు దర్శకత్వంలో..



సాయిధరమ్‌తేజ్

'చిత్రలహరి' తో తిరిగి విజయాల బాట పట్టారు సాయిధరమ్‌తేజ్. ఈ సక్సెస్ తర్వాత కథల ఎంపికలో తన పంథాను మార్చుకున్నారాయన. సహజత్వంతో కూడిన వైవిధ్యమైన కథాంశాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. తాజాగా సాయిధరమ్‌తేజ్ తమిళ దర్శకుడు వెంకట్ ప్రభుతో ఓ సినిమా చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రేమ, యాక్షన్ హంగులతో వెంకట్ ప్రభు సిద్ధం చేసిన కథలోని కొత్తదనం నచ్చడంతో సాయిధరమ్‌తేజ్ ఈ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఎ.కె ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర ఈ సినిమాను నిర్మించబోతున్నట్లు సమాచారం.త్వరలో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం 'ప్రతిరోజు పండగే' సినిమాలో నటిస్తున్నారు సాయిధరమ్‌తేజ్. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది.

## బాలాకోట్-ది ట్రూస్టోరీ



వివేక్ ఒబెరాయ్

పుల్వామాలో భారత సైనికులపై జరిపిన మారణహోమానికి ప్రతీకారంగా బాలాకోట్‌లోని ఉగ్రశిబిరాలపై భారత వాయుసేన భీకర దాడులు చేసి ముష్కరులను అంతమొందించిన విషయం తెలిసిందే. తీవ్రవాద అణచివేతలో కీలకఘట్టంగా బాలాకోట్ దాడులు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ప్రస్తుతం ఆ ఘట్టాల్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. బాలాకోట్ వైమానిక దాడుల నేపథ్యంలో 'బాలాకోట్-ది ట్రూస్టోరీ' పేరుతో తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఓ చిత్రం తెరకెక్కనుంది. పుల్వామాలో భారత జవానులపై దాడి అనంతరం పరిణామాలు, బాలాకోట్ ఉదంతంలో వాయిసేన ప్రదర్శించిన అద్వితీయ ధైర్యసాహసాల్ని ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. వివేక్ ఒబెరాయ్ ఈ సినిమాకు నిర్మాత. ఈ చిత్రంలో వింగ్ కమాండర్ అభినందన్ ప్రదర్శించిన శౌర్యపరాక్రమాల్ని కూడా చూపించబోతున్నారట. ఈ ఏడాది చివరలో షూటింగ్‌ను మొదలుపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జమ్ముకశ్మీర్, ఢిల్లీ, ఆగ్రా ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని ప్రకటించనున్నారు.

## సంగీత బంధుత్వం ఉంది!



బాలసుబ్రహ్మణ్యం

'నేటితరం గాయనీగాయకులు సినిమానే గమ్యం అనే భావనతో ఉంటున్నారు. అవకాశం వస్తే చాలనుకుంటున్నారు. అందుకే ప్రతిభ ఉన్నా వృత్తిపరంగా ఎక్కువ కాలం నిలదొక్కుకోలేకపోతున్నారు' అని అన్నారు ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం. దిగ్గజ గాయకులు కె.జె.ఏసుదాస్, కె.ఎస్ చిత్రలతో కలిసి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 'లెజెండ్స్' పేరుతో లైవ్ మ్యూజికల్ కాన్సెర్ట్ నిర్వహించబోతున్నారు. నవంబర్ 30న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ సంగీత విభావరి జరుగనున్నది. ఈ వేడుకకు సంబంధించిన విశేషాల్ని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాత్రికేయులతో పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ 'నేనొక గడ్డి మొలకలాంటివాడినే. మహావృక్షంగా నన్ను నేను ఎప్పుడూ భావించుకోను. ఏసుదాస్, చిత్రలతో నాకు సంగీత బంధుత్వం ఉంది. ఏసుదాస్ పాటతోనే 'లెజెండ్స్' కాన్సెర్ట్ ప్రారంభమవుతుంది. నాలుగు గంటల పాటు నిర్విరామంగా సాగే ఈ వేడుకలో పూర్తిగా తెలుగు పాటల్నే ఆలపిస్తాం. దేశవ్యాప్తంగా పేరొందిన వాయిద్యకారులు ఈ కాన్సెర్ట్‌లో పాల్గొంటారు. ప్రస్తుతం పాటలోని సాహిత్యాన్ని అర్థం చేసుకొని పాడేవారు తగ్గిపోయారు. వాటి ప్రాముఖ్యతను చెప్పేవారు లేరు. ఏ గొంతు ఎవరిదో గుర్తు పట్టలేని పరిస్థితి నెలకొంది' అని అన్నారు.

## విద్యాబాలన్ నిర్మాతగా..



కథానాయికగా విద్యాబాలన్ శైలి ప్రత్యేకం. 'డర్టీపిక్చర్' చిత్రంతో జాతీయ ఉత్తమ నటిగా పురస్కారాన్ని సొంతం చేసుకున్న ఆమె గత కొంత కాలంగా విభిన్న తరహా చిత్రాల్ని ఎంచుకుంటూ వరుస విజయాల్ని సొంతం చేసుకుంటున్నది. త్వరలో ఆమె నిర్మాతగా కొత్త అడుగులు వేయబోతోంది. తొలి ప్రయత్నంగా ఓ వెబ్ సిరీస్‌లో నటిస్తూ నిర్మించడానికి సిద్ధమవుతోంది. ఐరన్‌లేడీ, మాజీ భారత ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా దీన్ని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఆమె మాట్లాడుతూ 'రెండేళ్ల క్రితం ఇందిరా గాంధీపై రూపొందిన ఓ పుస్తకానికి సంబంధించిన హక్కుల్ని తీసుకున్నాను. ఆ సమయంలో వెబ్ సిరీస్ గురించి నాకు అవగాహన లేదు. సినిమాతో పోలిస్తే వెబ్ సిరీస్ అయితే వివరంగా చెప్పే వీలుంటుంది. కాస్త ఎక్కువ సమయం పడుతుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. 'లంచ్‌బాక్స్' ఫేమ్ రితేష్ బాత్రా దర్శకత్వం వహిస్తారు. ఇది ఎప్పుడు మొదలవుతుందన్నది ఇప్పుడే చెప్పలేను. మరో ఏడాది కానీ రెండేళ్లలో కానీ ఈ వెబ్ సిరీస్‌ని పూర్తి స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని అనుకుంటున్నాను' అని తెలిపారు.

## నలుగురు అమ్మాయిలతో..



శివ, లాస్య

సింగరేణి ఉద్యోగి ఎనుమల శివ హీరోగా, నిర్మాతగా రూపొందుతున్న చిత్రం 'నలుగురు అమ్మాయిలతో' మంతిని మధు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలను తెలియజేస్తూ 'సింగరేణి పరిసర ప్రాంతాలైన గోదావరిఖని, మంచిర్యాల్, పెద్దపలి, బెల్లంపల్లి ఏరియాలో చిత్రంలోని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఈ చిత్రంలో సింగరేణి ఉద్యోగులతో పాటు లోకల్ ఆర్టిస్టులకు అవకాశం ఇస్తున్నాం' అన్నారు. రొమాంటిక్ మాస్ ఎంటర్‌టైనర్‌గా చిత్రాన్ని రూపొందిస్తున్నామని, తప్పకుండా చిత్రం అన్ని వర్గాల ఆదరణ పొందుతుందనే నమ్మకం వుంది' అని తెలిపారు. మహాలక్ష్మి, మానస, జాహ్నవి, లాస్యలు నాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో జబర్దస్త్ అప్పారావు, మ్యాజిక్‌రాజా, దామోదర శంకర్‌లు ఇతర పాత్రలు పోషిస్తున్నారు.

## వృత్తిని ప్రేమిస్తాను..



పూజా హెగ్డే

'సక్సెస్‌లు వచ్చినవాళ్లే ఇండస్ట్రీలో మనగలుగతారు... పరాజయాలు ఎదురైతే తెరమరుగైపోతారనే సిద్ధాంతాన్ని తాను విశ్వసించనని చెబుతున్నది మంగళూరు సొగసరి పూజా హెగ్డే. తమిళ సినిమాతో కెరీర్‌ను ప్రారంభించిన పూజా హెగ్డే ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు తెలుగు చిత్రసీమలో అగ్ర కథానాయకులతో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నది తన సినీ ప్రయాణాన్ని గురించి పూజా హెగ్డే మాట్లాడుతూ 'ఇండస్ట్రీలో నాకు గాడ్‌ఫాదర్‌లు ఎవరూ లేరు. స్వీయ ప్రతిభతోనే ఈ స్థాయికి చేరుకున్నాను. అందం వల్లే రాణించగలుగుతున్నాననే మాటను నమ్మను. ప్రతిభ ముఖ్యం ఆ తర్వాతే మిగతా అర్హతలు ఉపయోగపడతాయి. ఓ సక్సెస్ రాగానే ఇండస్ట్రీలో నిలదొక్కుకోగలిగామని అనుకునేలోపే పరాజయాలు ఎదురై పరిస్థితులు మారిపోతుంటాయి. అందుకే జయాపజయాల్ని పట్టించుకోకుండా వృత్తిని ప్రేమిస్తాను. ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తూ సానుకూల దృక్పథంలో ఉంటాను.అంతే తప్ప డబ్బులు సంపాదించాలి, నంబర్ గేమ్స్‌లో నేనే ముందుండాలని ఆలోచించను. మారుతున్న ధోరణులకు తగినట్లుగా కొత్త విషయాల్ని నేర్చుకుంటూ ముందుకు సాగడానికే తపిస్తుంటాను' అని తెలిపింది. ప్రస్తుతం పూజా హెగ్డే తెలుగులో 'అల వైంకుఠపురంలో', 'వాల్మీకి' సినిమాల్లో నటిస్తున్నది.

## అవార్డులు కొలమానం కాదు



రాధికా ఆప్టే

అవార్డుల కోసం ఆలోచిస్తూ తానెప్పుడూ సినిమాలు చేయనని అంటోంది రాధికా ఆప్టే. కమర్షియల్ ఇమేజ్‌కు కట్టుబడిపోకుండా ప్రయోగాలు, వైవిధ్యమైన కథాంశాలతో ప్రతిభను చాటుకుంటున్నది ఈ సుందరి. బాలీవుడ్‌తో పాటు దక్షిణాది చిత్రసీమలో తనదైన ముద్ర వేసిన ఆమె ఇటీవలే హాలీవుడ్‌లో అరంగేట్రం చేసింది. గత ఏడాది హిందీలో ఆమె నటించిన 'ప్యాడ్‌మన్', 'అందాధూన్' చిత్రాలు జాతీయ పురస్కారాల్ని దక్కించుకున్నాయి. అవార్డులు రావడం ఆనందమే కానీ వాటిని ఆశించి ఈ సినిమాల్లో నటించలేదని చెబుతున్నది రాధిక ఆప్టే. ఆమె మాట్లాడుతూ 'పురస్కారాలు, పేరుప్రఖ్యాతుల కంటే మంచి కథలను ప్రేక్షకులకు అందించాలనే తపనతో సినిమాల్ని అంగీకరిస్తాను. నేను నటించిన సినిమాలు ప్రేక్షకుల్ని మెప్పించాయా లేదా అన్నదే నాకు ముఖ్యం. అంతే తప్ప వాటికి అవార్డులు వస్తాయా?రావా?అని ఎదురుచూడను. పురస్కారాలు వృత్తిలో ఉన్నతికి ప్రోత్సాహకాలుగా ఉపకరిస్తాయి. కానీ అవే ప్రతిభకు అసలైన కొలమానాలు కాదు. అవార్డులతో పాటు కమర్షియల్‌గా సినిమాలు విజయం సాధించడం అవసరమే. ఆ సంతృప్తి ఈ సినిమాలతో దొరికింది' అని చెప్పింది.

